# Basic Lessons for Every Muslim

(Telugu)

## ప్రతి ముస్లిం తెలుసుకోదగిన

# ప్రాథమిక పాఠాలు


సంకలనం

అబ్దుల్ అజీజ్ సాలెహ్ అష్షొమార్

అనువాదం

ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

&

శాంతిమార్గం పబ్లికేషన్స్ రచన, అనువాద విభాగం



ప్రకాశకులు

శాంతి మార్గం పబ్లికేషన్ ట్రస్ట్,

హైదరాబాద్



https://teluguislam.net

# Basic Lessons for Every Muslim

Compiled by : Abdul Aziz Saleh Al Shoumar

Translated by : **Muhammad Azeezur Rahman** & **Shanti Margam Publication's Translation Division**

Edited by : **S.M Rasool sharfi**

**Manzoor Ahmed Omari**

*© All Rights Reserved with Publishers*

First Edition : December 2011

2nd Edition : July 2012

Copies : 2000

**Hadya** (వెల) : **Fee Sabeelillah** (ఉచితం)

DTP & Printing : Al-Baseer Graphics, Hyd.
9441055065

Published by : Shanti Margam Publication Trust
**16-2-867/10, Akbar Bagh,**
**Sayeedabad, Hyderabad-500 059.**
**Cell : 9676144697, 7386785012**
E-mail: shantimargam@gmail.com
website: www.islamintelugu.com

https://teluguislam.net

బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్

# ధార్మిక విద్య ప్రతి ముస్లిం ప్రాథమిక హక్కు

ఇస్లాం సంపూర్ణ ఆచరణాత్మక ధర్మం. అది ఆచరణతో మొదలవుతుంది. ఆచరణతోనే పూర్తవుతుంది. ఆచరణకు వీలుకాని తాత్విక వాదనలకు ఇస్లాంలో విలువ లేదు. ఆచరణకు మూలం జ్ఞానం. జ్ఞానం లేకుండా చేసే ఆచరణ స్వీకృతి పొందుతుందన్న గ్యారంటీలేదు. కనుకనే అందరూ ధార్మిక విద్యను నేర్చుకోవాలని దైవప్రవక్త (స) పదేపదే బోధిస్తుండేవారు. ధర్మానికి సంబంధించిన కనీస జ్ఞానాన్ని కలిగివుండటం ప్రతి ముస్లిం ప్రాథమిక హక్కు.

ఈ పుస్తకంలో ఒక ముస్లిం తప్పకుండా కలిగివుండవలసిన కనీస జ్ఞానాన్ని అందించటం జరిగింది. ముస్లిం వ్యక్తిత్వ వికాసానికి మార్గాలు, విశ్వాసాలు, సిద్ధాంతాలు, శుచీశుభ్రతలు, ఆచరణలు, ఆరాధనలు, అంత్యక్రియలు, చేయవలసినవి, చేయకూడనివి అన్నీ క్లుప్తంగా, మనోహరమైన పద్ధతిలో బోధించబడ్డాయి. చివర్లో స్త్రీల కోసం ఒక ప్రత్యేక అధ్యాయాన్ని కేటాయించి వారి నెలవారీ, ప్రసవానంతర సమస్యల గురించి విపులంగా చర్చించటం జరిగింది.

మొదటి నుంచీ ముస్లింలుగా వున్నవారితోపాటు కొత్తగా ఇస్లాం స్వీకరించేవారు, ఇస్లాం పట్ల ఆసక్తి ఉన్నవారు సైతం ప్రయోజనం పొందేలాగా ఒక ప్రత్యేక తరహాలో రూపొందించబడిన అరుదైన పుస్తకం ఇది.

మేము చేసిన ఈ చిరుకృషిని ఆమోదించి ఇహపర లోకాల్లో మనందరికి ఉత్తమ ప్రతిఫలాన్ని ప్రసాదించాలని అల్లాహ్‌ను వేడుకుంటున్నాము.

**– ఎస్.ఎమ్.రసూల్ షర్ఫీ**

https://teluguislam.net

# విషయ సూచిక

## అధ్యాయం - 1 : ముస్లిం వ్యక్తిత్వం, వికాసం


1. 'అల్లాహ్' అంటే ఎవరు? 8
2. ఇస్లాం ధర్మం ఎందుకు? 11
3. మీ విశ్వాసం వికసించటానికి విలువైన చిట్కాలు 14
4. 'కలిమా'లోని కోణాలన్నీ మీకు తెలిసి వుండాలి 19
5. మీ విశ్వాసం పదిలమే కదా?! 24
6. "ముహమ్మద్ (స) మన చిట్ట చివరి ప్రవక్త" 28
7. ముస్లిం అంటే ఇలా ఉండాలి 33
8. ముస్లిం మహిళ 35
9. ఇస్లాం కారుణ్యాన్ని యావత్ ప్రపంచానికి పంచుదాం 38
10. యూద, క్రైస్తవ సోదరులకూ మీరు బోధించగలరు 42


## అధ్యాయం - 2 : ఆచరణాత్మక సిద్ధాంతాలు


11. ఇస్లాం మూల స్తంభాలు 53
12. విశ్వాసం (ఈమాన్)లోని ముఖ్య అంశాలు 54
13. "అల్లాహ్ ఒక్కడే" అనగానేమి? 65
14. ఆరాధనలో అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించటం.. 70
15. కీడు నుండి రక్షణకై తాయెత్తులు... ధరించటం 75
16. మంత్రించి ఊదటం, తాయెత్తులు వాడటం నిషిద్ధం 78
17. చెట్టుపుట్ట, రాయి రప్పల ద్వారా శుభాన్ని ఆశించటం 80
18. దైవేతరుల పేర జంతు బలి 84
19. అల్లాహ్ తప్ప ఇతరుల పేర మొక్కుబడి షిర్కే 88


https://teluguislam.net

| | | |
|---|---|---|
| 20. | అల్లాహ్ తప్ప ఇతరుల శరణు కోరటం కూడా షిర్కే | 90 |
| 21. | అల్లాహ్‌ను తప్ప ఇతరుల సహాయం అర్థించటం ... | 91 |
| 22. | పుణ్యాత్ముల, ప్రబోధకుల సమాధుల వద్ద ఆరాధన చేయటం నిషిద్ధం | 95 |
| 23. | సజ్జనుల సమాధుల విషయంలో హద్దులుమీరటం, వాటిని బహుదైవారాధనకు అనువుగా మార్చటం | 100 |
| 24. | మహాప్రవక్త (స) తౌహీదును స్థాపించారు షిర్క్ మార్గాలన్నింటినీ మూసివేశారు | 103 |
| 25. | నిజమైన అల్లాహ్ మిత్రులు (ఔలియాలు) ఎవరు? | 105 |


## అధ్యాయం - 3 : శుచీశుభ్రతలు


| | | |
|---|---|---|
| 26. | నీళ్ల రకాలు | 110 |
| 27. | వుజూ చేసే విధానం, సాక్సుల మీద మసహ్ చేయడం | 112 |
| 28. | వుజూ నియమాలు | 115 |
| 29. | వుజూలో తప్పనిసరిగా చేయవలసిన పనులు | 116 |
| 30. | వుజూను భంగపరిచే విషయాలు | 117 |
| 31. | తయమ్ముమ్ | 118 |
| 32. | గుసుల్ (స్నానం)ను అనివార్యం చేసే విషయాలు | 119 |
| 33. | గుసుల్ (ధర్మప్రకార స్నానం) చేసే విధానం | 120 |


## అధ్యాయం - 4 : ఆచరణలు, ఆరాధనలు


| | | |
|---|---|---|
| 34. | నమాజు, ప్రార్థనలు మనం ఎందుకు చేస్తాం? | 123 |
| 35. | నమాజులోని విధులు (అర్కాన్) | 125 |
| 36. | నమాజ్ నియమాలు | 127 |


https://teluguislam.net

37. నమాజ్‌లోని తప్పనిసరి కార్యాలు,
తషహ్హుద్ చదివే విధానం 129
38. నమాజ్‌లోని సున్నత్‌లు 131
39. నమాజ్‌ను భంగపరిచే విషయాలు 133
40. నమాజ్‌లో మరచిపోయినప్పుడు చేసే సజ్దా (సహూ) 134
41. నమాజ్‌లో పఠించటానికి మచ్చుకు కొన్ని సూరాలు 138
42. రోజువారీ ప్రత్యేక ప్రార్థనలు 142
43. ఉపవాసం ఆదేశాలు 146
44. జకాత్ 157
45. హజ్ యాత్ర 166

**అధ్యాయం - 5 : అంత్యక్రియలు**

46. ముస్లిం శవానికి స్నానం (గుస్ల్) చేయించే పద్ధతి 171
47. జనాజా నమాజ్ చేసే విధానం 174

**అధ్యాయం - 6 : నిషిద్ధాలు, చేయకూడనివి**

48. ఇస్లాంలో నిషిద్ధాలు (ముహర్రమాత్) 178

**అధ్యాయం - 7 : స్త్రీలకు ప్రత్యేకం**

49. బహిష్టు, పురిటి రక్తస్రావం 183

**అనుబంధం:**

- వుజూ చిత్రపటాలు 193
- నమాజ్ చిత్ర పటాలు 196
- వివిధ పబ్లికేషన్ల వివరాలు 198

https://teluguislam.net

అధ్యాయం - 1

# ముస్లిం వ్యక్తిత్వం, వికాసం

1వ పాఠం

# 'అల్లాహ్' అంటే ఎవరు?

మీ చుట్టూ వున్న ఈ భూప్రపంచంలోని వస్తువులను పరిశీలించండి. మొక్కలు, వృక్షాలు, జంతువులు, పక్షులు, చేపలు అన్నిటిపై యోచన చేయండి. ఏం అర్థమవుతోంది? అన్నీ తమదంటూ వున్న ఒక నిర్ణీత పద్ధతిలో జీవితం గడుపుతున్నట్లు కనిపించటం లేదూ?! ఆకాశంలోని సూర్య చంద్ర నక్షత్రాలను, మేఘాలను ఓసారి గమనించండి. అన్నీ సవ్యం గానే పని చేస్తున్నాయి కదా! అవి సవ్యంగా పనిచేయకపోతే ఈ భూమ్మీద మనిషికి మనుగడ ఉండేదా? అవన్నీ మన కోసమే పని చేస్తున్నట్లు ఉన్నాయి కదూ?!

ఎంతో దూరం ఎందుకు? మిమ్మల్ని మీరే పరిశీలించుకోండి. మీ దేహాల్ని, మీ శరీర అవయవాలను, ఇంకా మీ శరీరంలోని జీవన ప్రక్రియ లను గురించి కాస్తంత లోతుగా ఆలోచించండి. ఆరోగ్యవంతమైన మీ జీవితాన్ని కాపాడేందుకు అవి తపనపడిపోతున్నట్లు లేదూ? మిమ్మల్ని క్షేమంగా బతికించి ఉంచేందుకు మీ దేహంలోని వివిధ వ్యవస్థలు పరస్పరం ఎంత సమన్వయంగా పనిచేస్తున్నాయో చూడండి!

ఈ అద్భుత వస్తువులను ఎవరు సృష్టించారు? క్షణం కూడా ఆగకుండా సక్రమంగా పనిచేస్తున్న ఈ అంతుబట్టని వ్యవస్థకు సృష్టికర్త ఎవరు? అనంత మైన, ఊహలకు సైతం అందని ఈ సువిశాల విశ్వాన్ని నడుపుతున్నది ఎవరు?

ఈ విశ్వమంతటినీ తానే సృష్టించానని ప్రకటించిన సాహసవంతుడు ఇంతవరకు ఎవరూ పుట్టలేదు? కనీసం తమలో ఆ శక్తి వుందని చెప్పిన ఘనులు కూడా లేరు?

https://teluguislam.net

ఈ విశ్వమంతటినీ సృష్టించినది, ఇంకా దీనిని నడిపిస్తున్నది ఒకే ఒక్కరు అని మాత్రం మానవ జ్ఞానానికి అర్థమవుతుంది. కారణం; ఇందులో ఒకరి కంటే ఎక్కువ మందికి భాగస్వామ్యం వున్నట్లయితే ఆకాశాల్లో, ఈ భూప్రపంచంలో ఒక రకమైన గందరగోళం, గజిబిజి నెలకొని వుండేది. ఆ ఒక్కరు ఎవరో కాదు, ఆయనే అల్లాహ్. ఒకే ఒక్క నిజ ఆరాధ్య దేవుడు.

మరి అలాంటప్పుడు దేవుడు అసలు లేడని గాని, అనేక దేవుళ్ళు ఉన్నారని గాని అనటానికి ఎక్కడ వీలుంది?

దేవుడు ఉన్నాడు. ఆయన ఒకే ఒక్కడు. ఆయన పేరే అల్లాహ్. ఈ అంతులేని విశ్వాన్ని సృష్టించిన ఏకైక సృష్టికర్త. సకల లోకాలను నడిపిస్తున్న వాడు. కనుక మనం ఆయన పట్ల కృతజ్ఞులుగా మసలుకోవాలి. మన ఆత్మల్ని ఆయనకు సమర్పించుకోవాలి. అంటే మన చేతలు, ఆఖరికి మన మనసుల్లో మెదిలే భావాలు, భావనలు, కోరికలను సైతం దేవుడు నిర్ణయించిన విధానానికి అనుగుణంగా మలచుకోవాలి. మనిషి ఆలోచించేవాటిలో అత్యంత తెలివైన, వివేచన గల ఆలోచన ఇదే!

అల్లాహ్ మనందరికి సవ్యంగా ఆలోచించి, సక్రమంగా అర్థం చేసుకునే మంచి బుద్ధిని ప్రసాదించాడు. అంతేకాదు, ఆ తర్వాత మంచి మార్గాన్ని ఎన్నుకునే స్వేచ్ఛనూ అనుగ్రహించాడు. తన ప్రవక్తలను పంపించి మానవులకు సన్మార్గం అందించాడు. ఈ ప్రవక్తల పరంపర అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (స)తో ముగిసింది. మనుషులకు సత్యం బోధపరచటానికి ఆకాశగ్రంథాలను కూడా అల్లాహ్ అవతరింపజేశాడు. చిట్టచివరగా వచ్చిన దివ్యఖుర్ఆన్‌తో ఆ గ్రంథావతరణ అనుగ్రహం కూడా పూర్తి అయింది.

ఇక మనముందు రెండే రెండు మార్గాలున్నాయి. ఒకటి; ఇహపర లోకాల్లో సంతోషాన్ని, సాఫల్యాన్ని సాధించటం. అది ఇస్లాం ద్వారానే సాధ్యమవుతుంది. రెండోది; ఇహలోకంలో మనోవాంఛల వెంటపడి, అవస

https://teluguislam.net

రాలు, కోరికలు తీరనందుకు ఈ లోకంలో అసంతృప్తితో, దుఃఖ దాయక జీవితం గడపటం, పరలోకంలో శాశ్వత నరక శిక్షలకు గురవటం.

నిర్ణయం మన చేతుల్లోనే ఉంది. దేన్ని ఎంచుకుందాం? అల్లాహ్ మనందరికీ మంచిమార్గం, తిన్నటి మార్గం చూపించుగాక! ఆమీన్.

## మోడల్ ప్రశ్నలు

1. అల్లాహ్ ఉనికికి సంబంధించిన నిదర్శనాలు ఏవి?
2. విశ్వాన్ని సృష్టించిన ఏకైక సృష్టికర్త అల్లాహ్ అని ఎలా నిరూపిస్తారు?

## తప్పు - ఒప్పులు

1. చిట్టచివరి గ్రంథం జబూర్ ( )
2. అల్లాహ్ మనందరికీ సక్రమంగా ఆలోచించే బుద్ధినిచ్చాడు. ( )
3. ఏదో ఒక మార్గం ఎంచుకునే స్వేచ్ఛను కూడా ఇచ్చాడు.( )
4. విశ్వాన్నంతటిని తానే సృష్టించానని చెప్పుకునే సాహసవంతుడున్నాడు. ( )

https://teluguislam.net

## 2వ పాఠం

# ఇస్లాం ధర్మం ఎందుకు?

ఎందుకంటే, మానవులందరి కొరకు అల్లాహ్ నిర్ణయించిన ధర్మం అదే కనుక. మానవుల విషయంలో అల్లాహ్ ఇస్లాంను మాత్రమే ఆమోదిస్తాడు.

మొట్టమొదటి మానవుడు ఆదం (అలైహి) నుంచి చిట్టచివరి ప్రవక్త ముహమ్మద్ (స) వరకు ప్రపంచంలో గతించిన ప్రవక్తలందరూ ఆ ధర్మాన్నే పాటించారు. ఆ విధంగా ఇస్లాం–సృష్టి ప్రారంభం నుంచీ వున్న ధర్మం.

విశ్వమంతటా వ్యాపించి వున్న ఏకైక ధర్మం ఇస్లాం మాత్రమే. అసలు ఇస్లాం అంటేనే 'ఆత్మ సమర్పణ', 'అల్లాహ్ ఆజ్ఞలకు కట్టుబడి జీవించటం'. దివ్యఖుర్ఆన్‌లో అల్లాహ్ ఏమంటున్నాడో చూడండి:

**ఆకాశాలలోనూ, భూమిలోనూ ఉన్నవారంతా (సజీవులు, నిర్జీవులు అంతా) – తమకు ఇష్టమున్నా లేకపోయినా అల్లాహ్ విధేయతకు కట్టుబడి (ఇస్లాం స్వీకరించి) ఉండగా, వీరు (అవిశ్వాసులు) అల్లాహ్ ధర్మాన్ని కాకుండా మరో ధర్మాన్ని వెతుకుతున్నారా? ఆఖరికి వారంతా అల్లాహ్ వైపునకే మరలించబడతారు.** ***(ఖుర్ఆన్ 3:83)***

**ఎవరయినా ఇస్లాంను కాకుండా మరో ధర్మాన్ని అన్వేషిస్తే అతని ధర్మం స్వీకరించబడదు. అలాంటి వ్యక్తి పరలోకంలో నష్టపోయిన వారిలో చేరిపోతాడు.** ***(ఖుర్ఆన్ 3:85)***

## ఇస్లాం ఎవరి కోసం?

ఎవరికైతే అల్లాహ్ జీవితాన్ని, బుద్ధిని అనుగ్రహించాడో వారికోసం..

అల్లాహ్ అనుగ్రహాలను చూడగలుగుతున్న వారందరి కోసం.... అల్లాహ్ మాటలను వినగలిగేవారందరి కోసం.... అల్లాహ్ నిదర్శనాలను,

https://teluguislam.net

అనగా మనం రోజూ చూస్తూ ఉండే ప్రకృతి నియమాలు, రేయింబవళ్ళు, సూర్యచంద్రులు, ఆకాశం, నక్షత్రాలు మొదలగువాటిపై యోచన చేయ గలిగేవారందరి కోసం...

అల్లాహ్ పట్ల ప్రేమతో, కృతజ్ఞతా భావంతో పొంగిపొర్లుతున్న శుభాత్మల కోసం.... సత్యం కోసం సదా తెరుచుకొని వుండే అదృష్ట హృదయం కలిగివున్న మీ కోసం... నా కోసం... మనందరి కోసం.... ఇస్లాం ధర్మం కావాలి.

## ఇస్లాం ఎప్పుడు?

ఇంకా ఇస్లాం స్వీకరించని ఓ సోదరులారా! సత్యం బోధపడిన తరువాత ఇంకా మీన మేషాలు లెక్కపెడుతూ కాలయాపన చేయటం వివేకవంతుల పని కాదు. సమయం మించిపోక ముందే మంచి నిర్ణయం తీసుకోవాలి. గడిచిన కాలం తిరిగిరాదు. ఎవరి శ్వాస ఎప్పుడు ఆగుతుందో ఎవరికీ తెలియదు. ఇస్లాం సత్యధర్మం అన్న మీ అంతరాత్మ పిలుపుకు బదులివ్వండి. చీకటి నుంచి వెలుగు వైపుకు పయనించండి. పరలోక శాశ్వత జీవితానికి గాను మీకు లభిస్తున్న అమూల్యమైన సువర్ణావ కాశం ఇది. ఈ అవకాశం చేజారిపోతే మీ హృదయానికి మళ్ళీ ఆ అవకాశం ఎప్పుడు వస్తుందో ఏమో? అల్లాహ్ మిమ్మల్ని పిలుస్తున్నాడు.

**"అల్లాహ్ శాంతి నిలయం వైపుకు మిమ్మల్ని పిలుస్తున్నాడు."**

***(ఖుర్ఆన్ 10:25)***

ఆయన పిలుపుకు వెంటనే బదులివ్వండి. ఇప్పుడే ఇస్లాంలోకి ప్రవేశించి ఇహంలోనూ, పరంలోనూ సుఖంగా జీవించండి.

దివ్య ఖుర్ఆన్ చెబుతోంది:

**"మీ ఆరాధ్య దేవుడు ఒకే ఆరాధ్యదేవుడు. కాబట్టి మీరు ఆయన ఆజ్ఞలనే శిరసావహించండి (ఇస్లాం స్వీకరించండి). (ఓ ముహమ్మద్!) విధేయులైన వారికి శుభవార్తను వినిపించండి. (ఖుర్ఆన్ 22:34)**

https://teluguislam.net

## మోడల్ ప్రశ్నలు

1. 'ఇస్లాం' అనే పదానికి అర్థం ఏమిటి?
   లేదా 'ఇస్లాం' అనే పదాన్ని గురించి వ్రాయండి?
2. 'ఇస్లాం' ధర్మం ఎప్పుడు ప్రారంభం అయింది? ఇది ఎవరి కోసం?
3. 'ఇస్లాం' ధర్మాన్ని ఎందుకు అవలంబించాలి? వివరించండి?

## తప్పు - ఒప్పులు

1. మానవులందరి కోసం అల్లాహ్ చేసిన ధర్మం ఇస్లాం ( )
2. విశ్వమంతటా వ్యాపించియున్న ఏకైక ధర్మం ఇస్లాం ( )
3. అసలు ఇస్లాం అంటే ఆత్మ సమర్పణ ( )
4. మన ఆరాధ్య దేవుడు ఒకే ఒక్కడు ( )

https://teluguislam.net

# 3వ పాఠం
# మీ విశ్వాసం వికసించటానికి విలువైన చిట్కాలు

సరే; మొత్తానికి ఇస్లాం ధర్మం సత్యమైనదనీ, వివేకంతో నిండి ఉన్నదని మీకు అర్థం అయింది. ముక్తిదాయక జీవితం కోసం ఇస్లాంను అవలంబించాలని మీ మనసు ఉవ్విళ్ళూరింది. మీరు ఇస్లాం ధర్మాన్ని స్వీకరించారు.

మీరు ఇస్లాం స్వీకరించారంటే, ఇప్పటి వరకు మీ వల్ల జరిగిన పాపాలన్నీ సమసిపోయినట్లే. ఇకనుంచి మీ కర్మలు అల్లాహ్ సన్నిధిలో సరికొత్త రికార్డులో నమోదు చేయబడతాయి. ఇంతకు ముందు మీ వల్ల జరిగిన ఏ పాపమూ అందులో ఉండదు. మీరు ఇస్లాం స్వీకరించటం మూలంగా గతంలో మీ వల్ల జరిగిన పాపాలన్నిటినీ అల్లాహ్ మన్నించేస్తాడు. ఇస్లాం స్వీకరించటమంటే ఓ సరికొత్త జీవితాన్ని ప్రారంభించటమే. ఇస్లాంలో అడుగుపెట్టిన తర్వాత నిత్యం మీ విశ్వాసం వర్థిల్లుతూ ఉండాలి. అనుదినం మీ ఇస్లాం ధర్మం వికసిస్తూ పోవాలి.

## మరి అది ఎలా జరుగుతుంది?

క్రింది పనులను పాటిస్తే...

మొదటగా ఇస్లాం పట్ల మీ జ్ఞానాన్ని అభివృద్ధి పరచుకోండి. ధర్మం పట్ల అవగాహనను పెంచుకోండి. దానికోసం నిత్యం ఖుర్ఆన్ పఠిస్తూ ఉండండి. కేవలం అరబి పదాలు ఉచ్చరించటంతోనే సరిపెట్టుకోకూడదు. కొన్ని మంచి వ్యాఖ్యానాలను కూడా అధ్యయనం చేస్తుండాలి. తెలుగులో మీకు లభించగల ఖుర్ఆన్ వ్యాఖ్యాన పుస్తకాల వివరాలను మీ సౌలభ్యం కోసం ఇక్కడ పొందుపరుస్తున్నాం. వీటిని ప్రచురించిన పబ్లికేషన్‌ల పేర్లు,

https://teluguislam.net

వాటి చిరునామా, తదితర వివరాలు కూడా మీ సౌలభ్యం కోసం ఈ పుస్తకం చివర 183 పేజీలో పొందుపరచబడ్డాయి.

## ఖుర్‌ఆన్ గ్రంథం

(1) అంతిమ దైవగ్రంథం ఖుర్‌ఆన్ (శాంతిమార్గం పబ్లికేషన్స్)
(2) దివ్య ఖుర్‌ఆన్ సందేశం (డా. అబ్దుర్రహీమ్ మౌలానా)

## దైవప్రవక్త ప్రవచన (హదీసు) గ్రంథాలు

దైవప్రవక్త (స) పలుకుల్ని, ఆయన ఆచరణా విధానాన్ని (హదీసులను) వివరించే గ్రంథాల్ని, పుస్తకాలను మీరు నిత్యం చదువుతూ ఉండాలి. తెలుగులో మీకు లభించగల హదీసు పుస్తకాల వివరాలు:
(1) హదీసు కిరణాలు (ట్రూత్ పబ్లికేషన్స్)
(3) హదీసు మకరందం, మహితోక్తులు (అల్‌హఖ్ తెలుగు పబ్లికేషన్స్)

మొదలగునవి.

## ప్రవక్త (స) జీవిత చరిత్ర (సీరత్) గ్రంథాలు

ముహమ్మద్ (స) జీవిత చరిత్ర (సీరత్)ను మొదటి నుంచి చివరి దాకా వివిధ కోణాల్లో చదివి తరించాలి. ఈ క్రింది పుస్తకాలు మీకు చాలా ఉపయోగకరంగా ఉంటాయి.

https://teluguislam.net

(1) మహాప్రవక్త జీవిత చరిత్ర (అల్‌హాఖ్ పబ్లికేషన్స్),

(4) నేలపై నిండు చంద్రుడు (శాంతిమార్గం పబ్లికేషన్స్)

## ఇస్లామీయ చారిత్రక పుస్తకాలు

మన పూర్వీకుల్లోని సదాచార సంపన్నులైన ముస్లింలు ఎంతోమంది ఎన్నో కష్టాలను ఎదుర్కొని, బాధలకు ఓర్చుకొని ఇస్లాం ధర్మాన్ని తర్వాతి తరాలకు, యావత్ మానవాళికి అందజేశారు. స్ఫూర్తిదాయకమైన అటువంటి గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలను చదువుతూ ఉండాలి. ఉదా:-

(1) ఖుర్‌ఆన్ కథామాలిక (శాంతిమార్గం పబ్లికేషన్స్)

(3) నలుగురు ధర్మ ఖలీఫాలు (అల్‌హాఖ్ తెలుగు పబ్లికేషన్స్) మొదలగునవి.

## ధార్మిక ప్రసంగాలు (ఖుత్బాలు)

మంచి ప్రసంగాలు వినాలి. జుమా రోజు మధ్యాహ్నం సామూహిక నమాజుకు హాజరై ఇమాము ఇచ్చే ప్రసంగాన్ని (ఖుత్బాను) శ్రద్ధగా వినాలి. ఏ మస్జిద్‌లోనైతే మంచి ఖుత్బా (ప్రసంగం) ఇవ్వబడుతుందో – ఆ మస్జిద్ దూరమైనా సరే – అక్కడే జుమా నమాజ్ చేయటానికి ప్రయత్నం చేయాలి.

https://teluguislam.net

ఈదుల్ ఫిత్ర్, ఈదుల్ అజ్‌హా రెండు పండుగ నమాజులకు, ఆ రోజు జరిగే ప్రత్యేక ప్రార్ధనలకు తప్పనిసరిగా హాజరవ్వాలి.

## తోటి ముస్లింలతో కలిసి...

రోజూ ఐదుపూటల విధి (ఫర్జ్) నమాజు తోటి ముస్లింలతోపాటు మస్జిదులో చేయాలి. ఇస్లామీయ బోధనా తరగతులకు హాజరవుతూ ఉండాలి.

## పండితులతో పరిచయం

ఇస్లామీయ పండితుల్ని, విద్వాంసుల్ని, మస్జిదుల ఇమాములను, ఇస్లాం ధర్మ బోధకులు, ప్రచారకులను (దాయీలను) తరచూ సంప్రతిస్తూ ఉండాలి. వారికి మిమ్మల్ని మీరు పరిచయం చేసుకోవాలి. ఇస్లాంలో మీరు తెలుసుకోదలచిన విషయాలు వారిని అడిగి తెలుసుకోవాలి. మీరు మీ ధర్మ సందేహాలు అడిగితే సాధారణంగా ఇస్లాం ధర్మ పండితులకు సంతోషమే కలుగుతుంది.

## ఇష్టపూర్వకంగా మరిన్ని (నఫిల్) ఆరాధనలు

- విధి (ఫర్జ్) నమాజులతో పాటు మీ ఇష్టంగా మరిన్ని (నఫిల్) నమాజులు కూడా చేస్తూ ఉండండి.
- విధిగా చెల్లించవలసిన 'జకాత్'తోపాటు మీ ఇష్టపూర్వకంగా మరిన్ని దానధర్మాలు కూడా చేస్తూ ఉండండి. వీలైనంత మటుకు ఇతరుల అవసరాలను తీర్చి వారి కష్టాల్లో పాలు పంచుకుంటూ ఉండండి.
- ఒక్క రమదాన్ నెలలోనే కాదు, ఇతర మాసాల్లో కూడా అప్పుడప్పుడూ ఉపవాసం ఉండండి. షవ్వాల్ మాసంలో 6 రోజులు ఉపవాసం పాటించటం ఎంతో పుణ్యప్రదం. అలాగే జుల్‌హిజ్జ మాసం 9వ తేది (అరఫా రోజున), ఇంకా ముహర్రమ్ నెల 10వ

https://teluguislam.net

తేదిన ఉండే ఉపవాసాలకు కూడా ఎంతో ఘనత ఉంది. ఈ అదనపు ఉపవాసాల వల్ల మీ మనసు తేలికగా, ఉల్లాసంగా, ఆహ్లాదకరంగా ఉంటుంది. మనసులో అల్లాహ్ పట్ల ప్రసన్నతా భావం పెంపొందుతుంది.

## ముస్లిం సమాజ అభివృద్ధి కోసం

ముస్లిం సమాజ సంస్కరణ నిమిత్తం జరిగే సామాజిక కార్యకలాపాల్లో సంతోషంగా పాల్గొనండి. మస్జిద్‌లకు, ఇస్లామీయ ప్రోగ్రామ్స్‌కు మీ శక్తికొలది విరాళాలు ఇస్తూ ఉండండి. అది మీ మనసుకు ఎంతో తృప్తినిస్తుంది.

## ఇతరులకు ఆహ్వానం

మీ తోటివారిని కూడా ఇస్లాం ధర్మం వైపుకు ఆహ్వానిస్తూ ఉండండి. ఇస్లాం ధర్మ సత్యాన్ని వారికి బోధపరచండి. అల్లాహ్‌కృపతో వారికి ఇస్లాం భాగ్యం లభిస్తే దానివల్ల మీకూ చెప్పలేనంత పుణ్యం లభిస్తుంది.

## మోడల్ ప్రశ్నలు

1. 'ఇస్లాం' స్వీకరించడం అంటే ఏమిటి? వివరించండి?
2. ఇష్టపూర్వకంగా (నఫిల్) నమాజులు చేయడం వల్ల లాభాలు ఏమిటి?
3. జకాత్ అంటే ఏమిటి? ఎప్పుడు, ఎవరు చెల్లించాలి?
4. ముస్లిం సమాజాభివృద్ధి కోసం మీరు ఏం చేస్తారు? వివరించండి?

## ఖాళీలు పూరించండి

1. షవ్వాల్ మాసంలో............. రోజులు ఉపవాసం ఉండాలి.
2. ముహమ్మద్ ప్రవక్త (స) ప్రవచనాలను............. అంటారు.
3. సీరత్ అంటే...................................

https://teluguislam.net

4వ పాఠం

# ‘కలిమా’లోని కోణాలన్నీ మీకు తెలిసి వుండాలి

## అసలు ‘కలిమా’ అంటే ఏమిటి?

**“లా ఇలాహ ఇల్లల్లాహ్, ముహమ్మదుర్రసూలుల్లాహ్”**

**అనువాదం:** అల్లాహ్ తప్ప వేరొక నిజ ఆరాధ్య దైవం లేదు. ముహమ్మద్(స) అల్లాహ్ యొక్క ప్రవక్త, సందేశహరులు”.

– కలిమా అంటే ఇదే!

## మీ విశ్వాసానికి బలం ‘కలిమా’ భావం

ఇస్లాంలో ప్రవేశించటానికి ఏకైక ద్వారం కలిమా. ‘కలిమా’ను ఎంతగా అర్థం చేసుకుంటే అంతగా విశ్వాసం బలపడుతుంది. తద్వారా ఇతరులకు కూడా ఇస్లాం గురించి చక్కగా బోధించటానికి వీలవుతుంది.

## ఇస్లాంలో ప్రవేశించటానికి బాప్తిజం అవసరం లేదు

ఈ పాఠంలో చెప్పబడిన ప్రకారంగా కలిమా (సద్వచనం)ను మనసా, వాచా, కర్మణా పఠించిన వారెవరైనా ముస్లింలు అవుతారు. ముస్లిం కావటానికి మతపెద్దల ద్వారా బాప్తిజము పొందవలసిన అవసరం లేదు. మరే పూజలూ, ఆచారాలు ఇస్లాంలో ప్రవేశించటానికి అవసరం ఉండవు.

## సద్వచనం (కలిమా) సారాంశం

విశ్వాసానికి (ఈమాన్‌కు) మూలమైన **“లా ఇలాహ ఇల్లల్లాహ్, ముహమ్మదుర్రసూలుల్లాహ్”** అనే కలిమాలో రెండు అంశాలున్నాయి.

ఒకటి : **లా ఇలాహ ఇల్లల్లాహ్.**

రెండవది: **ముహమ్మదు ర్రసూలుల్లాహ్.**

https://teluguislam.net

**'లా ఇలాహ ఇల్లల్లాహ్'** అంటే అల్లాహ్ తప్ప వేరొక నిజ ఆరాధ్య దైవం లేదని అర్థం. ఇందులో కూడా రెండు భావనలు ఇమిడి ఉన్నాయి.

1) తిరస్కరణ (మనఃపూర్వకంగా నిరాకరించటం)

2) ధృవీకరణ (మనసారా ఒప్పుకుంటూ పైకి గట్టిగా చెప్పటం)

**మొదటిది:**

దైవత్వం అనేది మహోన్నతుడైన అల్లాహ్‌కే స్వంతం. కాబట్టి ఒక్కడైన అల్లాహ్‌ను కాదని వేరెవరికయినా దైవత్వాన్ని ఆపాదించటాన్ని కలిమా (సద్వచనం)లోని ఈ భాగం ఖండిస్తుంది. ఉదాహరణకు : దైవదూతలు, ప్రవక్తలు, పుణ్యపురుషులు, వలీలు, స్వాములు, విగ్రహాలు, ప్రపంచ రాజ్యాధికారులు– వీరెవరూ దేవుళ్ళు కారు. కాబట్టి వీరిలో ఏ ఒక్కరూ ఆరాధనలకు, సృష్టి దాస్యానికి అర్హులు కారు.

**రెండవది :**

కలిమాలోని రెండవ భాగం ప్రకారం అల్లాహ్ మాత్రమే నిజ ఆరాధ్య దైవం. కనుక ఈ మొత్తం కలిమాను అంగీకరించిన వారు అల్లాహ్‌యే నిజ ఆరాధ్య దైవమని నమ్మి నడుచుకోవాలి. తమ సమస్త ఆరాధనలను, ఉపాసనలను ఆయనకే ప్రత్యేకించుకోవాలి. దైవత్వంలో అల్లాహ్‌కు భాగస్వామిగా వేరొకరిని నిలబెట్టకూడదు. అంటే అల్లాహ్ ఆరాధనతో పాటు ఇతరులను ఆరాధించకూడదు.

## ముహమ్మదుర్రసూలుల్లాహ్ అంటే...

"ఓ అల్లాహ్! ముహమ్మద్ (సఅసం) నీ సందేశహరుడు" అని నోటితో పలకటమేగాక హృదయపూర్వకంగా ఈ వాక్కును విశ్వసించటం. అంటే అల్లాహ్ ఆజ్ఞలను శిరసావహించిన మీదట, అంతిమ దైవప్రవక్త అయిన

https://teluguislam.net

ముహమ్మద్ (స) చూపిన మార్గమే అనుసరణీయమని మీరు మాటిస్తు న్నారు.

అల్లాహ్ స్వయంగా ఇలా సెలవిచ్చాడు–

**"ముహమ్మద్ (స) మీ మగవారిలో ఎవరికీ తండ్రికారు. అయితే ఆయన అల్లాహ్ యొక్క సందేశహరుడు. ప్రవక్తల పరంపరను పరిసమాప్తం చేసే (చివరి) వారు. అల్లాహ్ ప్రతిదీ తెలిసినవాడు."** ***(ఖుర్ఆన్ 33 : 40)***

**"దైవప్రవక్త మీకు ఇచ్చిన దానిని (సంతోషంగా) పుచ్చుకోండి. ఆయన ఏ విషయం నుండైనా మిమ్మల్ని వారిస్తే, దాన్ని వదిలి పెట్టండి."** ***(ఖుర్ఆన్ 59 : 7)***

(ఓ ప్రవక్తా) వారికి చెప్పు:

**"మీకు నిజంగానే అల్లాహ్ పట్ల ప్రేమ ఉంటే మీరు నన్ను అనుస రించండి."** ***(ఖుర్ఆన్ 3 : 31)***

దివ్యఖుర్ఆన్‌లోని పై వాక్యాల ద్వారా బోధపడేదేమిటంటే ఇస్లాం ధర్మంలో అల్లాహ్ మరియు ఆయన అంతిమ ప్రవక్త (స) చెప్పినట్లుగా నడుచుకోవాలి. ఇతరత్రా వ్యక్తుల అభిప్రాయాలు అల్లాహ్‌గ్రంథానికి (ఖుర్ఆన్‌కు), దైవప్రవక్త (స) విధానానికి, ఆయన సూచించిన చట్టాలకు, ఆయన ఇచ్చిన ఆజ్ఞలకు, ఆరాధనా పద్ధతులకు, ప్రవచనాలకు (ఒక్క మాటలో చెప్పాలంటే ప్రవక్త సున్నతుకు) అనుగుణంగా ఉంటే స్వీకరిం చాలి. లేదంటే వాటిని త్రోసిపుచ్చాలి.

## 'లా ఇలాహ ఇల్లల్లాహ్' మన నుండి కోరేదేమిటి?

1. **జ్ఞానం:** అల్లాహ్‌యే సిసలైన ఆరాధ్యదైవమని మనం తెలుసుకోవాలి. మన ఆరాధనలు, ఉపాసనలు ఆయనకు మాత్రమే ప్రత్యేకించ బడాలి. అల్లాహ్ తప్ప వేరితర దేవుళ్ళంతా మిథ్య, అసత్యం,

https://teluguislam.net

బూటకం. వారిలో ఏ ఒక్కరూ లాభంగానీ, నష్టంగానీ కలిగించ లేరన్న వాస్తవాన్ని గుర్తెరగాలి.

2. **దృఢ నమ్మకం:** అల్లాహ్ ఒక్కడే నిజదైవమనీ, దైవత్వం ఆయనకే సొంతమని విశ్వసించటంలో ఎలాంటి సందేహానికి, సంకోచానికి, ఊగిసలాటకు తావు ఉండరాదు.

3. **సమ్మతి, అంగీకారం:** ఈ ప్రకటనతో ముడిపడి ఉన్న నియమ నిబంధనలను, షరతులన్నింటినీ ఒప్పుకోవాలి.

4. **సమర్పణ :** అల్లాహ్‌యే ప్రభువు, పోషకుడనీ, ముహమ్మద్ (సఅసం) అల్లాహ్ తరఫున మానవ మార్గదర్శకత్వం నిమిత్తం పంపబడిన ఆఖరి ప్రవక్త అనే విషయానికి కట్టుబడి ఉంటానని మాట ఇవ్వాలి. ఆ మాటను కడదాకా నిలబెట్టుకోవాలి. దానిపట్ల ఆత్మసమర్పణా భావంతో మసలుకోవాలి.

5. **నిజాయితీ:** కలిమా కోరే అంశాలను మనస్ఫూర్తిగా, నిజాయితీగా నెరవేర్చాలి.

6. **చిత్తశుద్ధి :** అల్లాహ్‌ను ఆరాధించే విషయంలో ఎలాంటి కల్మషం, కపటత్వం ఉండకూడదు. నిష్కల్మషమైన మనసుతో ధర్మాన్ని అల్లాహ్‌కే ప్రత్యేకించుకుని మరీ ఆరాధించాలి. అన్ని రకాల ఆరాధనలను కేవలం అల్లాహ్‌కు మాత్రమే అంకితం చేయాలి.

7. **ప్రేమ:** మహోన్నతుడైన అల్లాహ్‌ను, ఆయన ప్రవక్త (స)ను, వారికి విధేయులై ఉండే సాటి సోదరులందరినీ, అనగా ముస్లింలందరినీ హృదయపూర్వకంగా ప్రేమించాలి.

మొత్తమ్మీద అర్థమయ్యేదేమిటంటే అల్లాహ్‌కు ఆజ్ఞాబద్ధులై నడుచు కోవాలి. ఆయనకు విధేయత చూపాలి. ఆయన చేయమన్న దానిని

https://teluguislam.net

చేయాలి. చేయకూడదన్న దానికి దూరంగా ఉండాలి. అప్పుడే మన మనస్సుల్లో విశ్వాస (ఈమాన్) బీజం నాటుకుంటుంది. అల్లాహ్‌కు విధేయత చూపటమంటే ఆయన్ని ప్రేమించటం, ఆయన విధించే శిక్షలకు భయపడటం, ఆయన ప్రతిఫలం ఇస్తాడని ఆశపడటం, క్షమాపణకై ఆయన్ని వేడుకోవటం, మహాప్రవక్త ముహమ్మద్ (స) ఉపదేశాలను, ఆదేశాలను ఖచ్చితంగా అనుసరించటం.

అల్లాహ్ ముహమ్మద్ (స)కు షరీఅతును (ఇస్లామీయ చట్టాలను, ధార్మిక నియమావళిని) ఇచ్చి పంపాడు. ముహమ్మద్ (స) షరీఅతు రాకతో గతకాలపు చట్టాలు, ధార్మిక నిబంధనలు అన్నీ రద్దయిపోయాయి. ఇప్పుడు ఈ షరీఅతు అన్ని విధాలుగా గత షరీఅతులన్నిటి కంటే సమున్నతంగా, సంపూర్ణంగా ఉంది.

## మోడల్ ప్రశ్నలు

1. 'లా ఇలాహ ఇల్లల్లాహ్' మన నుండి ఏం కోరుతున్నది?
2. సద్వచనం (కలిమా) సారాంశాన్ని (అర్థాన్ని) వ్రాయండి?
3. మన మనస్సుల్లో విశ్వాస (ఈమాన్) బీజం దృఢంగా నాటుకోవాలంటే ఏమి చేయాలి?

## ఖాళీలు పూరించండి

1. ముహమ్మద్ ప్రవక్త (స) షరీఅత్...... గా ఉంది.
2. దైవత్వంలో అల్లాహ్‌కు............గా వేరొకరిని నిలబెట్టకూడదు.
3. ......................... అనేది అల్లాహ్‌కే స్వంతం.

https://teluguislam.net

## 5వ పాఠం మీ విశ్వాసం పదిలమే కదా?!

మీరు ముస్లింలుగా జీవించటానికి నిశ్చయించుకున్నారంటే మీకు మీరు ఎంతో మేలు చేసుకున్నారని అర్థం. అపార సంపద మీ చేతికి అందినట్టుగా మీరు గర్వపడాలి.

### భద్రం సుమా!

ఒకతని వద్ద అపార ధనసంపద ఉంటే సహజంగానే అతనికి ఎంతోమంది శత్రువులు తయారవుతారు. అలాగే మీ వద్ద వున్న విశ్వాస (ఈమాన్) సంపదను దోచుకెళ్ళటానికి కూడా ఎంతోమంది దోపిడీ దొంగలు దారి కాచుకొని ఉంటారని మరిచిపోకండి. ఈమాన్ సంపద మిమ్మల్ని వరించింది. మిమ్మల్ని విశ్వాస మార్గం నుంచి తప్పించటానికి కొంతమంది సదా ప్రయత్నిస్తుంటారు. కనుక కలలో కూడా అజాగ్రత్త వద్దు సుమా!

### సత్యంపై స్థిరంగా నిలబడండి

అలాంటివారు అల్లాహ్ విరోధులు. సత్యానికి శత్రువులు. షైతానులు. వారు మన కళ్ళకు కనిపించని జిన్నుల్లోనూ ఉండవచ్చు. తోటి మనుషుల్లో కూడా ఉండవచ్చు. మానవుల్లోని షైతానులు మీ విశ్వాసాన్ని ఎగతాళి చేస్తారు. వీలైతే ధనంతో మిమ్మల్ని లోబరచుకొని మిమ్మల్ని సత్యమార్గం నుంచి వెనక్కి తీసుకురావటానికి శతవిధాలా ప్రయత్నిస్తారు. ఇస్లాం ధర్మంలో దోషాలు, లోపాలు ఉన్నట్లుగా, ఇస్లాం ధర్మం పాతబడిపోయి నట్లుగా, వెనుకబడిపోయినట్లుగా మాట్లాడుతారు. ఇస్లాం పట్ల మీలో అపార్థాలు రేకెత్తిస్తారు.

https://teluguislam.net

అల్లాహ్ దివ్యఖుర్‌ఆన్‌లో అంటున్నాడు:

**(ఓ విశ్వాసీ!) వారు (అనగా ఇస్లాం పట్ల సందేహాలు రేకెత్తించే వారు) నీ వద్దకు ఏ సందేహాన్ని తీసుకువచ్చినా దానికి సత్యంతో కూడిన సమాధానాన్నీ, అత్యుత్తమమైన వివరణను నీకు తెలియ జేస్తాము.** ***(ఖుర్‌ఆన్ 25 : 33)***

## దీటుగా బదులివ్వండి

ఇలాంటి సందర్భాలు ఎదురైనప్పుడు దివ్యఖుర్‌ఆన్‌లో వాటికి సంబంధించి ఏముందో పండితుల్ని అడిగి తెలుసుకొని వారికి తగిన సమాధానం చెప్పండి. జాకిర్ నాయక్‌గారి "ఇస్లాం గురించి మీ అపార్థాలను దూరం చేసుకోండి"అన్న పుస్తకం, ఎస్.ఎమ్ మలిక్‌గారి "సందేహాలు – సమాధానాలు" అన్న పుస్తకం, ఇంకా జాకిర్ నాయక్‌గారి ఉర్దూ, ఇంగ్లీషు సి.డి.లు మొదలగునవి మీకు బాగా ఉపయోగపడతాయి.

## చెడు ఆలోచనలపై అదుపు

ఇకపోతే జిన్నుల్లోని షైతానులు. అవి మీ మనసుల్లో సందేహాలు, అనుమానాలు రేపుతుంటాయి. ఏమిటీ, మీ తాతముత్తాతల ధర్మాన్ని వదలిపెడ్తావా? మతం మారటమంటే కన్నతల్లిని అమ్ముకున్నట్టే తెలుసా? ఇస్లాం నియమాలు చాలా కఠినంగా ఉంటాయి. నమాజులు చేయాలి. ఉపవాసాలు ఉండాలి. నీ సొంత ధనాన్ని ఇతరుల కోసం ఖర్చుపెట్టాలి. అలాంటి కఠిన మతాన్ని ఎందుకు ఎంచుకుంటావు? ఇస్లాం స్వీకరించావంటే ఇక నీవు బ్రాందీ, విస్కీలకు గుడ్ బై చెప్పాల్సిందే.

## స్వచ్ఛమైన ఏకదైవారాధన గల ధర్మం ఇస్లాం ఒక్కటే

సాధారణంగా పిల్లలు పెరిగి పెద్దవారై ఊహ తెలిసినప్పటికి తాము

https://teluguislam.net

తమ తల్లిదండ్రుల బాటలోనే నడుస్తుంటారు. వారి నమ్మకాలపైనే విశ్వాసం కలిగివుంటారు. తమ తల్లిదండ్రుల విశ్వాసాల పట్ల, నమ్మకాల పట్ల ఎనలేని గౌరవాన్ని ప్రదర్శిస్తారు. సత్యధర్మాన్ని అనుసరించేవారైనా, బూటకపు ధర్మాన్ని అనుసరించేవారైనా అందరి పరిస్థితి దాదాపు ఇలాగే ఉంటుంది. అయితే వాటిలో సత్యధర్మం ఏది? అసత్య ధర్మం ఏది? అని కనుగొనటమే సమస్య.

సందేహం లేదు. ఇస్లామే ఆ నిజధర్మం. ఏమాత్రం కల్పన, అతిశయం లేని, బహుదైవారాధన, విగ్రహారాధనలు లేని ధర్మం, స్వచ్ఛమైన ఏకదైవా రాధన గలిగిన ధర్మం ఈ లోకంలో ఇస్లాం ఒక్కటే.

## కలిగిన నమ్మకాన్ని కడదాకా నిలుపుకోండి

పైన పేర్కొనబడినట్లు జిన్నులు, షైతానులు మీ మనసుల్లో కుశంకలు రేపితే వెంటనే ఇలా స్పందించండి:

**“రబ్బి అవూజు బిక మిన్ హమజాతిష్ షయాతీన్, వ అవూజు బిక రబ్బి ఐఁ య్యహ్‌జురూన్”**

**“ఓ నా ప్రభూ (అల్లాహ్)! షైతానులు కలిగించే దుష్ట ప్రేరణల నుంచి నేను నీ శరణుకోరుతున్నాను. ప్రభూ! వారు నా వద్దకు రావటం నుంచి నీ శరణు వేడుతున్నాను.”**

***(ఖుర్ఆన్ 23:97-98)***

ఫలఖ్ సూరా, నాస్ సూరాలు కూడా పఠిస్తూ ఉండండి. (ఈ పుస్తకం లోనే 127వ పేజీలో ఫలఖ్, నాస్ సూరాలు ఉచ్చారణ, అనువాదంతో సహా లభిస్తాయి).

https://teluguislam.net

## మోడల్ ప్రశ్నలు

1. సత్యధర్మం ఇస్లాంపై స్థిరంగా నిలబడటం కోసం మీరు ఏం చేస్తారు?
2. స్వచ్ఛమైన ఏకదైవారాధన ఏదో (వివరంగా వ్రాయండి?) లేదా (నిరూపించండి?)
3. చెడు ఆలోచనలను అదుపు చేయడం కోసం మీరు ఖుర్ఆన్ హదీసులోని ఏ భాగాలు చదువుతారు?
4. "స్వచ్ఛమైన ఏకదైవారాధన గల ధర్మం ఇస్లాం ఒక్కటే" నిరూపించండి?

## ఖాళీలు పూరించండి

1. ఇస్లాం మాత్రమే ..................... మతం.
2. స్వచ్ఛమైన............................ కలిగిన ధర్మం
3. జిన్నులు షైతానులు మీలో ............., ............ రేపుతుంటాయి.
4. మిమ్మల్ని ........... మార్గం నుండి తప్పించటానికి కొంతమంది ................. ప్రయత్నిస్తుంటారు.

https://teluguislam.net

6వ పాఠం

# "ముహమ్మద్ (స) మన చిట్ట చివరి ప్రవక్త"

ఈ విషయం ఇంతకు ముందే మనం చెప్పుకున్నాం. ఒకతని వద్ద అపార ధనసంపద ఉంటే సహజంగానే అతనికి ఎంతోమంది శత్రువులు తయారవుతారు. మిమ్మల్ని విశ్వాస మార్గం నుంచి తప్పించటానికి కొంత మంది సదా ప్రయత్నిస్తుంటారు. కనుక ధర్మం విషయంలో అజాగ్రత్త అస్సలు ఉండకూడదు.

## ముహమ్మద్ (స) మన చివరి ప్రవక్త

ముహమ్మద్ (స) చిట్టచివరి దైవప్రవక్త. ఆయన మరణంతో ఈ లోకంలో వహీ (దైవవాణి) పరంపర ఆగిపోయింది. ఈ విషయం ఖుర్ఆన్ చెబుతుంది. ఇస్లాం ధర్మ తొలి నినాదమైన కలిమా భావమూ అదే. ముహమ్మద్(స) స్వయంగా కూడా తన గురించి అలాగే చెప్పారు. ఆయన సహచరులు (సహాబా) కూడా ఈ విషయాన్ని ధృవీకరించారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు దీనిగురించి ముస్లింల విశ్వాసం చెక్కుచెదర లేదు. ప్రళయం వరకూ ముస్లింలు ముహమ్మద్ (స)ను చిట్టచివరి దైవప్రవక్తగానే నమ్ముతారు. దీనిపై నమ్మకం లేనివారు ముస్లింలుగా పిలువబడటానికి అర్హులు కారు.

అయితే ముస్లిం సమాజ ఐక్యతను దెబ్బతీయటానికి–ఇస్లాం అవతరించిన తొలినాటి నుంచే దైవ విరోధులు తీవ్రమైన ప్రయత్నాలు చేస్తూ వచ్చారు. ఇస్లాంకు నష్టం చేకూర్చటానికి వారు చేయని ప్రయత్న మంటూ లేదు. అటువంటి కుటిల పన్నాగాల్లో భాగమే బూటకపు దైవప్రవక్తల ప్రకటనలు.

అయితే, అన్ని కాలాల్లోనూ ముస్లింలు విశ్వాస (ఈమాన్) శక్తితో అటువంటి కుట్రలన్నిటినీ తిప్పి కొట్టారు. అటువంటి ఒక ఉపద్రవమే ఈనాడు ఖాదియానీల (లేక అహ్మదీల) రూపంలో మళ్ళీ మన ముందుకు వచ్చింది.

అయినా సందేహం లేదు, ముస్లింలు ఈ ఉపద్రవాన్ని కూడా మునుపటి కంటే మేలైన రీతిలో దివ్య ఖుర్ఆన్ బలంతో, తమ విశ్వాస (ఈమాన్) శక్తితో తిప్పికొట్టగలరు.

ఈ విషయంలోని నిజానిజాలను తెలుసుకోవటానికి అత్యంత విశ్వస నీయమైన, ఏకైక మార్గం ముహమ్మద్ (స)వారి ప్రబోధనలు (హదీసులు).

ప్రవక్త మహనీయులు (స) ఇలా సెలవిచ్చారు:

**నాకూ, నాకు పూర్వం గతించిన ప్రవక్తలకు గల ఉదాహరణ ఎటువంటిదంటే, ఒక వ్యక్తి ఒక కట్టడాన్ని నిర్మించాడు. దాన్ని బాగా అందంగా, కనుల పండుగగా రూపొందించాడు. కాని ఒక మూలన ఒక ఇటుక మందం స్థలం వదలిపెట్టాడు. జనం ఆ కట్టడాన్ని చుట్టూ తిరిగి చూస్తారు, దాని చక్కదనానికి ఆశ్చర్య పోతారు. కాని, "అక్కడ ఇటుక ఎందుకు పెట్టలేదూ?" అని అడుగు తారు. ఆ ఇటుకను నేనే. నేను "ఖాతమున్నబియ్యీన్" (ప్రవక్తల పరంపరను పరిసమాప్తం చేసినవాణ్ణి. నా రాకతో ప్రవక్తల పరంపర కట్టడం పూర్తయింది. మరెవరైనా వచ్చి నింపడానికి ఇక ఈ కట్టడంలో చోటు ఏమీ మిగిలి లేదు.)**

*(సహీహ్ బుఖారి, కితాబుల్ మనాకిబ్, ఖాతమున్నబియ్యీన్ అధ్యాయం)*

## ఖుర్ఆన్‌లోనే ఉంది కదా!

ముహమ్మద్ (స) దైవప్రవక్తల పరంపరలో చిట్ట చివరివారన్న సంగతి

https://teluguislam.net

ఖుర్ఆన్ గ్రంథంలో సైతం అత్యంత స్పష్టంగా ఇలా ఉంది:

**“ప్రజలారా! ముహమ్మద్ మీలోని ఏ పురుషునికీ తండ్రికారు. కాని ఆయన అల్లాహ్ సందేశహరులు. దైవప్రవక్తల పరంపరను సమాప్తం చేసిన చిట్టచివరివారు. అల్లాహ్ ప్రతి విషయ జ్ఞానమూ ఉన్నవాడు.”**

***(ఖుర్ఆన్ 33 : 40)***

## ఇక ఏ ప్రవక్తా రారు

ముహమ్మద్(స) ఇలా ప్రబోధిస్తుండేవారు: దైవ దౌత్యక్రమం, ప్రవక్తల పరంపర నాతో అంతమై పోయింది. నా తరువాత ఏ దైవసందేశహరులూ లేరు, **ఇంకా ఏ దైవప్రవక్తా రారు.** (తిర్మిజీ–కితాబుర్రూయా – జహాబున్నుబువ్వ అధ్యాయం; ముస్నద్ అహ్మద్: అనస్–బిన్–మాలిక్ (ర) ఉల్లేఖనాలు).

## ఆఖరి సమాజం - ఆఖరి ప్రవక్త

మరో సందర్భంలో దైవప్రవక్త ముహమ్మద్ (స) ఇలా సెలవిచ్చారు: “నా తరువాత **మరే ప్రవక్తా లేరు.** నా అనుచర సమాజం తరువాత మరో అనుచర సమాజం (కొత్తగా వచ్చే ప్రవక్త అనుచర సమాజం) అంటూ ఏదీ ఉండబోదు.” *(బైహకీ, కితాబుర్రూయా, తబ్రానీ)*

## కపటవేషధారుల పట్ల కాస్తంత జాగ్రత్త సుమా!

శతాబ్దాల తర్వాత ఇస్లాం ధర్మప్రచారం (దావత్ ఇలల్లాహ్) ప్రపంచ వ్యాప్తంగా నేడు మళ్ళీ ఊపందుకున్నట్లు అనిపిస్తోంది. కాని విచారకర మైన విషయం ఏమంటే, ఆ పరిణామమే బూటకపు ప్రవక్త ప్రకటనలను నమ్మేవారికి (ఖాదియానీలకు లేక అహ్మదీలకు) ఒక వరమయింది. ఈ వేడి వాతావరణంలో వారూ తమ పని కానిచ్చుకుంటున్నారు.

https://teluguislam.net

## ముస్లింల ముసుగులో

ధర్మ ప్రచారకుల(దాయీల) మాదిరిగానే ఖాదియానీలు లేక అహ్మదీలు కూడా ముస్లిం వేషధారణలో ఉండటం, ముస్లింపేర్లు కలిగివుండటం వల్ల సత్యధర్మ ప్రచారకులెవరో, ఖాదియానీ పగటి వేషధారులెవరో కనిపెట్టటం సామాన్య ముస్లింలకు కష్టమైపోతోంది. చాలా సందర్భాల్లో ఖాదియానీలూ ముస్లింలతో పోటాపోటీగా ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

## ఇలా గుర్తించవచ్చు

ఇలాంటి ఇబ్బందికర పరిస్థితుల్లో సామాన్య ప్రజలు ఖాదియానీలను సులువుగా గుర్తించగలిగేందుకుగాను మేము ఇక్కడ కొన్ని విషయాలను ప్రస్తావిస్తున్నాము. వీటిని దృష్టిలో పెట్టుకుంటే అటువంటివారి నుంచి మీ విశ్వాసాన్ని రక్షించుకోవచ్చు.

**మొదటి విషయం:** ముహమ్మద్ (స) చిట్టచివరి దైవప్రవక్త. ఆయన తర్వాత ఇక ప్రళయం వరకూ మరే ప్రవక్తా రారు.

**రెండవ విషయం:** యేసు ప్రవక్త చనిపోలేదు. ఆయన శిలువపైకి కూడా ఎక్కలేదు. అల్లాహ్ ఆయన్ను అంతకుముందే ఆకాశాలపైకి ఎత్తుకున్నాడు. ప్రళయానికి పూర్వం ఆయన మళ్లీ ఈ భూమ్మీదకు దిగుతారు. అప్పుడు ఆయన్ని 'మసీహ్ మౌవూద్' (మళ్ళీ వచ్చిన మసీహ్) అంటాం. ఇవి ముహమ్మద్ ప్రవక్త (స) బోధించిన సత్యాలు. కాని ఆయన(స) చెప్పిన గుర్తులతో ఇప్పటి వరకు ఆ 'మసీహ్ మౌవూద్' ప్రపంచంలో ఎక్కడా దిగలేదు.

**మూడవ విషయం:** ముహమ్మద్ (స) మరణంతో ఈ ప్రపంచంలో వహీ (దైవవాణి అవతరణ) పరంపర ఆగిపోయింది. రెండవసారి యేసు(అలైహి) ఈ ప్రపంచంలో అవతరించినప్పుడు ఆయనపై కూడా

https://teluguislam.net

వహీ అవతరించదు. అసలు ఆయన ప్రవక్తగా రారు. ముహమ్మద్ (స) వారి షరీఅత్ (ధర్మశాస్త్రం)లో ఎలాంటి మార్పులు చేర్పులు చేయరు. తనను ప్రవక్తగా విశ్వసించమని కూడా ప్రజలకు చెప్పరు. కేవలం మహా కల్లోల కారకుడైన దజ్జాల్‌ను సంహరించటానికి, ఇంకా కొన్ని ప్రత్యేక పనులను నిర్వర్తించటానికి మాత్రమే ఆయన ఆకాశం నుంచి దిగివస్తారు.

**నాలుగవ విషయం:** మొట్టమొదటి మానవుడు ఆదం నుంచి చిట్టచివరి ప్రవక్త ముహమ్మద్ (స) వరకు ఈ లోకంలో పుట్టిన ప్రవక్తలందరూ స్వతహాగా ఎవరికి వారు అల్లాహ్ సందేశహరులేగాని ఎవరూ ఎవరికీ అవతార పురుషులు కారు. అసలు ఇస్లాంలో ఈ అవతార (బరోజీ) భావనే లేదు.

**ఐదవ విషయం:** తన తర్వాత ఎంతోమంది అబద్ధాలకోరులు తాము దైవప్రవక్తలమంటూ బూటకపు ప్రకటనలు చేసుకుంటారని ముహమ్మద్ (స) ముందే హెచ్చరించి వున్నారు. అలాగే జరిగింది. భారత దేశంలో దైవదౌత్య ప్రకటన చేసిన మిర్జా గులాం అహ్మద్ ఆ వరుసలోనివాడే.

ఈ విషయం గురించి పూర్తి వివరాలు తెలుసుకునేందుకు మా పబ్లికేషన్ తరఫు నుంచే ప్రచురించబడిన పుస్తకం "ఆఖరి ఇటుక" చదవండి.

## మోడల్ ప్రశ్నలు

1. 'ముహమ్మద్ ప్రవక్త (స) చిట్టచివరి ప్రవక్త' వివరించండి?
2. ఖాదియానీలను ఎలా గుర్తించవచ్చు?

## ఖాళీలు పూరించండి

1) చిట్టచివరి ప్రవక్త (స)కు ......... మరియు ...... పేర్లున్నాయి.

https://teluguislam.net

# 7వ పాఠం ముస్లిం అంటే ఇలా ఉండాలి

'ముస్లిం' అంటే ఈ క్రింది విధంగా ఉంటాడనీ లేక కనీసం ఇలా ఉండటానికి నిత్యం ప్రయత్నిస్తూ ఉంటాడని ఖుర్‌ఆన్ మరియు దైవప్రవక్త ముహమ్మద్ (స) ప్రవచనాల్లో చెప్పబడింది:

1) ముస్లిం ఎల్లప్పుడూ సత్యమే చెబుతాడు. అసత్యం చెప్పడు.

2) ఇచ్చిన మాటను ముస్లిం నిలబెట్టుకుంటాడు. ఎవరికీ నమ్మక ద్రోహం తలపెట్టడు.

3) ముస్లిం తన తోటి ముస్లింల పరోక్షంలో వారి గురించి చెడుగా ప్రస్తావించడు. చాడీలు చెప్పడు.

4) ముస్లిం ఎల్లప్పుడూ ధైర్యంగా ఉంటాడు. పిరికితనం చూపడు.

5) సత్యాన్ని కాపాడటం కోసం ముస్లిం ఎన్ని కష్టాలైనా ఎదుర్కొంటాడు. నిజం చెప్పటంలో చాలా కచ్చితంగా ఉంటాడు.

6) ఒక విషయం తనకు వ్యతిరేకంగా పరిణమించినా సరే ముస్లిం అందులో ఇతరులకే న్యాయం చేస్తాడు. ఇతరుల హక్కులను కొల్లగొట్టడు. ఎవరికైనా అన్యాయం జరగటాన్ని చూసి సహించడు. బలమైన వ్యక్తిత్వాన్ని కలిగివుంటాడు. అన్యాయంగా అతన్ని లోబరచు కోవటం ఎవరికీ సాధ్యం కాదు.

7) ముస్లిం తన కార్యకలాపాలన్నీ ఖుర్‌ఆన్, హదీసుల వెలుగులో ఉన్నాయో లేవో నిత్యం పరిశీలించుకుంటూ ఉంటాడు. అవసరమైన

https://teluguislam.net

విషయాల్లో తోటి ముస్లింలతో సంప్రతింపులు చేసుకుంటూ ఉంటాడు. ఏదైనా పని చేయవలసి ఉంటే శక్తిమేరకు కృషి చేస్తాడు. ఆ తర్వాతే అల్లాహ్‌పై భారం మోపుతాడు.

8) ముస్లిం అంటే వినయం, కరుణ కలిగినవాడు. తాను మంచి చేస్తాడు. ఇతరులకు కూడా మంచిని గురించే ఆదేశిస్తాడు. ముందు తాను చెడులకు దూరంగా ఉండి, ఆ తరువాత ఇతరులను కూడా చెడులకు దూరంగా ఉండమని ప్రబోధిస్తూ ఉంటాడు.

9) ప్రపంచంలో అల్లాహ్ మాట చెల్లుబాటు అవటం కోసం, అల్లాహ్ ధర్మం అత్యున్నతంగా ఉండటం కోసం, ఇస్లాం విజయం సాధించటం కోసం, ప్రపంచంలో అన్ని చోట్లా సత్యధర్మం వ్యాప్తి చెందటం కోసం ముస్లిం అనునిత్యం కృషి చేస్తూ ఉంటాడు. ఆ మార్గంలో నిరంతరం ప్రయత్నిస్తూ ఉంటాడు. అవసరమైతే దాని అడ్డంకులతో పోరాడు తాడు కూడా.

## మోడల్ ప్రశ్నలు

1) ప్రతి ముస్లింలో ఉండాల్సిన కొన్ని మంచి లక్షణాలను వివరించండి?
2) ముస్లిం ఇహ, పర లోకాల సాఫల్యం కొరకు ఎవరిని అనుకరించాలి? ఎందుకు?
3) ఇస్లాం ధర్మ వ్యాప్తి కొరకు ప్రతి ముస్లిం యొక్క కర్తవ్యం ఏమిటి?

## ఖాళీలు పూరించండి

1) ముస్లిం ఎల్లప్పుడూ.... చెబుతాడు.
2) ముస్లిం ఎల్లప్పుడూ .............. గా ఉంటాడు.
3) ముస్లిం ...................... నిలబెట్టుకుంటాడు.

8వ పాఠం

# ముస్లిం మహిళ

ఇస్లాంలో స్త్రీ తోటి పురుషునికి సోదరి లాంటిదే, మానవులంతా ఒకే ఆది దంపతుల (ఆదం, హవ్వాల) సంతానమే కాబట్టి. స్త్రీ కూడా పురుషుని లాంటిదే. మానవతా రీత్యా స్త్రీపురుషుల మధ్య ఎలాంటి భేదాలు లేవు. స్త్రీలైనా పురుషులైనా ఇరువురూ అల్లాహ్ దాసులే.

పురుషుల మాదిరిగా స్త్రీ కూడా ఇస్లాం సందేశానికి హక్కుదారు. కనుక స్త్రీలను సైతం సముచిత పద్ధతుల్లో ఇస్లాం ధర్మం వైపు ఆహ్వానిస్తూ ఉండాలి. అల్లాహ్‌ను విశ్వసించి, అల్లాహ్ పట్ల ప్రేమను కలిగివుండాలన్న ఆజ్ఞ స్త్రీలకు కూడా వర్తిస్తుంది.

స్త్రీలు కూడా ముహమ్మద్ (స)ను అంతిమ దైవప్రవక్తగా విశ్వసించాలి. ఆయన ఇచ్చిన సందేశంపై దృఢమైన నమ్మకాన్ని కలిగివుండాలి. ఇస్లాంకు అనుగుణంగా ఆచరించాలి. నమాజులు చేయాలి. ఉపవాసాలు పాటించాలి. స్తోమత ఉంటే జకాత్ చెల్లించాలి. హజ్‌యాత్ర చేయాలి. అల్లాహ్ ఆరాధనలన్నిటిని పాటించాలి. పురుషుల మాదిరిగానే స్త్రీలు కూడా ఇస్లామీయ షరీఅతును (ధర్మశాస్త్రాన్ని) కచ్చితంగా పాటించాలి.

స్త్రీలు తమ పిల్లలను ఇస్లామీయ వాతావరణంలో, నైతిక విలువలతో పెంచి పోషించాలి. పిల్లల్లో ధార్మిక స్పృహను కలిగించాలి. ధర్మం పట్ల అభిమానాన్ని జనింపజేయాలి. భావితరాల కోసం ఇస్లాం ధర్మాన్ని సంరక్షించటంలో స్త్రీలు నిర్వహించవలసిన పాత్ర ఎంతో ఉంది.

https://teluguislam.net

అయితే కొన్ని విషయాల్లో మాత్రం స్త్రీ పురుషుల మధ్య సహజంగానే భేదాలున్నాయి. అవి:

- బహిష్టు, పురిటి రక్తస్రావ కాలాల్లో స్త్రీ నమాజులకు, ఉపవాసాలకు దూరంగా ఉండాలి. ఆ కాలంలో మస్జిదులకు కూడా పోరాదు.
- బహిష్టు, పురిటి రక్తస్రావాల నుంచి తిరిగి శుద్ధ స్థితిలోకి రాగానే తలంటుస్నానం (గుస్ల్) చేయాలి. బహిష్టు, పురిటి రక్తస్రావ స్థితి మూలంగా ఉపవాసాలు ఏమైనా తప్పిపోతే వాటిని పూర్తిచేయాలి. అయితే ఆ కాలంలో చేయలేకపోయిన నమాజులను తిరిగి చేయ వలసిన అవసరం మాత్రం ఉండదు.

  గమనిక: బహిష్టు, పురిటి రక్తస్రావానికి సంబంధించిన పూర్తి వివరాలు 171వ పేజీలో పొందుపరచబడ్డాయి.
- శుక్రవారం నాడు సామూహిక ప్రార్థనలకు హాజరవటం ఆమెకు విధి కాదు.
- తాను వివాహమాడటానికి వీలున్న పర పురుషుల సమక్షంలో ఉన్నప్పుడు ముస్లిం మహిళ నిండు ఇస్లామీయ వస్త్రధారణలో సౌశీల్యవతిగా మసలుకుంటుంది. ఆ సమయంలో ఆమె ముఖం, అరచేతులు మినహా మిగతా దేహమంతా వస్త్రంతో సంపూర్ణంగా కప్పబడి ఉంటుంది.
- యూద, క్రైస్తవ, నాస్తిక పురుషులు ఎవరైనా సరే; తాము చిత్తశుద్ధితో ఇస్లాం ధర్మాన్ని అవలంబిస్తున్నామని వారు ప్రకటించనంత వరకూ ముస్లిం స్త్రీలు వారిని వివాహమాడరాదు.

## మోడల్ ప్రశ్నలు

1) ముస్లిం మహిళ తన పిల్లల పట్ల ఎలాంటి బాధ్యతలు కలిగి ఉంది?

2) ఉపవాసాలు, నమాజులకు ఏయే సందర్భాలలో మహిళలు దూరంగా ఉండాలి.

3) సమాజం పట్ల ముస్లిం మహిళ యొక్క కనీస బాధ్యతలు ఏవి?

## ఖాళీలు పూరించండి

1) బహిష్టు, పురిటి రక్తస్రావాల సమయంలో వదలివేయబడిన ఉపవాసాలు..............

2) బహిష్టు, పురిటి రక్తస్రావాల సమయంలో వదలివేయబడిన నమాజులు..............

3) మానవతా రీత్యా స్త్రీ పురుషుల మధ్య ఎలాంటి........ లేవు.

4) శుక్రవారం నాడు సామూహిక ప్రార్థనలకు హాజరవటం ముస్లిం మహిళలకు ....................... కాదు.

5) భావితరాల కోసం ఇస్లాం ధర్మాన్ని......................స్త్రీల పాత్ర ...........................

6) కొన్ని విషయాల్లో స్త్రీ పురుషుల మధ్య ............. భేదాలున్నాయి.

https://teluguislam.net

9వ పాఠం

# ఇస్లాం కారుణ్యాన్ని యావత్ ప్రపంచానికి పంచుదాం

## అది ఎంతో పుణ్యప్రదం

మన ప్రియప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచించారు:

**"ఏ ఒక్క వ్యక్తినైనా అల్లాహ్ మీ ద్వారా ఇస్లాం వైపు నడిపిస్తే అది మీ పాలిట ఒక మహా సంపదను కలిగివుండటం కంటే ఎంతో గొప్పది."**

ఆయన ఇంకా ఇలా ప్రబోధించారు:

**"సన్మార్గం వైపు ఆహ్వానించేవారికి కూడా దానిని అనుసరించే వారికి లభించేటంత పుణ్యఫలం లభిస్తుంది. దానివల్ల అనుసరించే వారి పుణ్యఫలంలోనూ ఎలాంటి కోత ఉండదు."**

## మొదటగా మీ దగ్గరి బంధువులను

కనుక మీకు తెలిసిన ముస్లిమేతరుల్ని తప్పకుండా ఇస్లాం వైపుకు ఆహ్వానించండి. ఈ ఆహ్వానం మీ సన్నిహితులతోనే మొదలయితే మరీ మంచిది. తల్లిదండ్రులు, భార్యపిల్లలు, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు, బాబాయి పెదనాన్నలు, పిన్ని పెద్దమ్మలు మొదలగు దగ్గరి బంధువులు మీరు ఇచ్చే ఇస్లాం సందేశానికి మొట్టమొదటి అర్హులు.

**"నీ సమీప బంధువులను హెచ్చరించు"** అని అల్లాహ్ స్వయానా ముహమ్మద్ (స)కే ఆదేశించి వున్నాడు సుమా! (ఖుర్ఆన్ 26:214).

https://teluguislam.net

## బోధనా విధానం

సత్యధర్మాన్ని గురించి వారికి తెలియజెప్పండి. బోధపరచండి. దానిపట్ల వారిలోనూ ఆసక్తిని కలిగించండి.

ఇస్లాం స్వీకరించేవారికి అల్లాహ్ ఇచ్చిన శుభవార్తలను గురించి వారికి తెలియజేయండి. ఇస్లాంను అనుసరిస్తే, ఇహలోకంలో, పరలోకంలో అల్లాహ్ వారికి ఎలాంటి వరాలు ప్రసాదించనున్నాడో, వారిపై ఎలాంటి అనుగ్రహాలు కురిపించనున్నాడో చెప్పండి.

మానవాళి మార్గదర్శనం కోసం అల్లాహ్ దివ్యఖుర్ఆన్ గ్రంథాన్ని అవతరింపజేశాడు. ముహమ్మద్ (స)ను సర్వలోకాల కోసం కారుణ్య ప్రవక్తగా పంపాడు. కనుక ఖుర్ఆన్‌పై, ముహమ్మద్ ప్రవక్త (స)పై విశ్వాసం ఉంచనివారు అల్లాహ్ ఆగ్రహానికి పాత్రులవుతారని మీ మిత్రు లను ఆప్యాయతతోనే హెచ్చరించండి. ప్రేమతో, చిత్తశుద్ధితో వారిని ఇస్లాం వైపుకు ఆహ్వానించండి.

## మీరు ఇతరులకు ఆదర్శం కావాలి

ఇంత గొప్పకార్యాన్ని నిర్వర్తించే ముందు మీరు స్వయంగా సుగుణ వంతులై, మంచి నడవడిక కలవారై ఉండాలి సుమా!

సత్కార్యాలు చేయటంలో, ఇతరులకు సహాయపడటంలో మీరు అందరికంటే ముందుండాలి. అలాచేస్తే మీరు మీ మాటలతో, చేతలతో ఇస్లాంను ప్రచారం చేసినవారవుతారు. మీ నిజాయితీని, మీ నైతికతను చూసి మీ స్నేహితులు, మీ ఇరుగుపొరుగువారు మీ ఇస్లాం ఆహ్వానాన్ని అందుకోవటానికి వెంటనే సిద్ధమవుతారు. తర్వాత వారిని సన్మార్గంలో నడిపించే పని అల్లాహ్ చూసుకుంటాడు.

https://teluguislam.net

మీరు స్వయంగా ఆచరించినప్పుడే సందేశం అందుకునేవారికి మీ సందేశంలోని నిజాయితి బోధపడుతుంది. ఫలితంగా వారు ఇస్లాం ధర్మాన్ని స్వీకరిస్తారు. ఇస్లాంను ప్రేమిస్తారు. మిమ్మల్ని కూడా అభిమాని స్తారు.

## విజ్ఞతతో వ్యవహరించండి

ఇస్లాం ధర్మాన్ని ఇతరులకు విజ్ఞతతో ప్రబోధించే విధానం మీరు బాగా గ్రహించాలి. సమయానుగుణంగా సత్య సందేశాన్ని ఎలా అందిం చాలో గుర్తెరగాలి. దివ్యఖుర్‌ఆన్‌లో అల్లాహ్ అంటున్నాడు:

**నీ ప్రభువు మార్గం వైపు జనులను వివేకంతోనూ, చక్కని ఉపదేశం తోనూ పిలువు. అత్యుత్తమ రీతిలో వారితో సంభాషణ జరుపు. నిశ్చయంగా తన మార్గం నుంచి తప్పిన వారెవరో నీ ప్రభువుకు బాగా తెలుసు. సన్మార్గాన ఉన్నవారెవరో కూడా ఆయనకు బాగా తెలుసు.** ***(ఖుర్‌ఆన్ 16:125)***

## అరబీ మూలంతో మీ మాటలు మరింత అమూల్యం!

మీకు అరబీ భాష రాకపోతే వెంటనే మీరు ఆ భాష నేర్చుకునే ప్రయత్నాలు మొదలుపెట్టండి. దానివల్ల ఇస్లాం ధర్మాన్ని నేరుగా మూలాధా రాల ద్వారా అర్థం చేసుకునే అవకాశం లభిస్తుంది. అప్పుడు మీరు ఇస్లాం గురించి గట్టినమ్మకంతో మాట్లాడగలుగుతారు. ఎందుకంటే అల్లాహ్ వాక్యాలను, దైవప్రవక్త ముహమ్మద్ (స) ప్రబోధనలను, ముస్లిం విద్వాంసుల వివరణలను మీరు నేరుగా నేర్చుకొని ఉంటారు.

## కరపత్రాలు, పుస్తకాల పంపిణీ

మీరు ఇస్లాం సందేశం ఇవ్వదలచుకున్నవారికి కేవలం నోటితో చెప్పటమే కాకుండా మంచి కరపత్రాలను, పుస్తకాలను కూడా పంచి పెట్టండి. ఇస్లాం ధర్మవ్యాప్తికి ఈ విధానం ఎంతగానో తోడ్పడుతుంది.

https://teluguislam.net

శాంతిమార్గం పబ్లికేషన్స్‌వారు ఈ లక్ష్యం కోసం ఎన్నో పుస్తకాలను ఉచితంగానే పంపిణీ చేస్తున్నారు. అలాగే ఇతర పబ్లికేషన్‌లలో సైతం ప్రయోజనకరమైన పుస్తకాలు, సి.డి.లు ఎన్నో లభ్యమవుతున్నాయి. వివిధ పబ్లికేషన్ల వివరాలు పుస్తకం చివరి పేజీలో ఇవ్వబడ్డాయి, చూడండి.

## మోడల్ ప్రశ్నలు

1) ఇస్లాంను గురించి బోధనా విధానం ఎలా ఉండాలి?
2) ఇస్లాంను గురించి మొదట ఎవరికి వివరించాలి? ఎందుకు?
3) ఇస్లాం గురించి బోధించేటప్పుడు మీరు ఎలా వ్యవహరిస్తారు?
4) ఇస్లాంను బోధించేటప్పుడు అరబీ మూలం అవసరమా?

## ఖాళీలు పూరించండి

1) మీ దగ్గరి..............లు ఇస్లాం సందేశానికి మొట్టమొదటి అర్హులు.
2) ఇస్లాం కారుణ్యాన్ని యావత్ ప్రపంచానికి తెలియజేయడం మన .........
3) ముస్లిమేతర సోదరుల్ని ............. వైపునకు ఆహ్వానించాలి.

## తప్పు - ఒప్పులు

1) సత్కార్యాలు చేయడంలో మనం ఇతరులకు ఆదర్శం కావాలి ( )
2) మానవాళి మార్గదర్శం కోసం అల్లాహ్ ఖుర్‌ఆన్ గ్రంథాన్ని అవతరింపజేశాడు ( )
3) సత్య ధర్మం గురించి ఎవరికీ చెప్పకూడదు ( )
4) మీరు స్వయంగా ఆచరించవలసిన అవసరంలేదు ( )

https://teluguislam.net

# 10వ పాఠం యూద, క్రైస్తవ సోదరులకూ మీరు బోధించగలరు

## క్రైస్తవం గురించి తెలుసుకోదగిన విషయాలు

తీర్పుదినాన మానవులను మళ్ళీ బ్రతికించడం జరుగుతుందన్న విషయానికి ఒక నిదర్శనంగా యేసు ప్రవక్తను తండ్రి లేకుండా సృష్టించడం జరిగింది. దైవప్రవక్త యేసు పుట్టుకకు ముందు యూదుల ఒక గ్రూపు మరణానంతరం మళ్ళీ బ్రతికించడం జరగదని వాదించేది.

గత కాలాలకు చెందిన ప్రవక్తలపై అవతరించిన గ్రంథాలతో పాటు యేసు ప్రవక్తపై అవతరించిన ఇంజీల్ (సువార్త) గురించి కూడా మన దివ్య ఖుర్‌ఆన్‌లో ప్రస్తావనలు ఉన్నాయి. ప్రస్తుత బైబిల్ వీటినుంచి (తౌరాతు లేక తౌరా, జబూర్ లేక డేవిడ్ కీర్తనలు, సువార్తల నుంచి) ఏర్పడిందే! బైబిల్‌లో పాత నిబంధన, కొత్త నిబంధనలు ఉన్నాయి. యూద మతానికి సంబంధించిన పాత నిబంధనను మాత్రమే యూదులు అంగీకరిస్తారు. దైవప్రవక్త యేసు (అస) యూద ప్రవక్తలలో చివరి వారయినప్పటికీ కొత్త నిబంధనను వాళ్ళు అంగీకరించరు.

ప్రస్తుతం మనకు అందుబాటులో ఉన్న బైబిల్ ఎన్నో మార్పులకు, చేర్పులకు గురైంది. మత పెద్దల వ్యాఖ్యానాలూ అందులో చోటు చేసుకున్నాయి. అయితే ఈ గ్రంథాల్లోని కొన్ని భాగాలు మాత్రమే దొరుకుతున్నాయి. ఈ గ్రంథాలు సంపూర్ణంగా, మార్పులు లేకుండా ఉన్నాయని చెప్పే పరిస్థితి లేదు. ఇందులో అనేక వైరుధ్యాలు మనకు కనబడతాయి. కాని దివ్యఖుర్‌ఆన్ నేటికి 1400 సంవత్సరాలుగా ఎలాంటి మార్పులు లేకుండా యథాతథంగా భద్రంగా ఉంది.

కొత్త నిబంధనకు సంబంధించి ఇద్దరు మార్క్, లూకాలు నిజానికి

https://teluguislam.net

ప్రవక్త యేసును ఆయన జీవితకాలంలో అనుసరించిన పన్నెండు మంది శిష్యులలోని వారు కాదు. (గోస్పెల్ ఆఫ్ బార్నబాస్‌తో సహా) యేసు శిష్యులలో కొందరి రచనలను తదుపరి కాలాల క్రయిస్తవులు సందేహాస్పదమైన రాతలుగా తిరస్కరించారు.

ప్రవక్త యేసు ప్రత్యక్ష శిష్యుల్లో ఒకరు రాసిన 'గోస్పెల్ ఆఫ్ బార్నబాస్'ను కొత్త నిబంధన నుంచి తొలగించడం అన్నది యేసు తర్వాత చాలా శతాబ్దాలకు జరిగింది. ఈ పుస్తకం 481వ పేజిలో ఈ విషయం స్పష్టంగా రాయబడింది. జూడా అనబడే వ్యక్తి రూపు రేఖలు ఆ సమయంలో పూర్తిగా ప్రవక్త యేసును పోలి ఉన్నందువల్ల అతన్ని యేసుకు బదులు శిలువ వేయడం జరిగిందని బార్నబాస్ అన్నారు. ఈ మాటలు యేసు శిలువ వేయబడడాన్ని ఖండిస్తున్నాయి.

## ఈనాటి క్రయిస్తవ విశ్వాసం *(నేడు మనకు తెలిసిన విశ్వాసాలు)*

నిజానికి ప్రవక్త యేసు(అస) ఒక కొత్త మతాన్ని దేన్నీ తీసుకురాలేదు. ఆయన ఇస్రాయీల్‌కు చెందిన చెల్లాచెదరైన తెగల వద్దకు పంపబడ్డారు. ఈ విషయం క్రయిస్తవ గ్రంథాలలోను నిర్ధారితమయ్యింది. ఆయన ఎన్నడూ తాను దేవుణ్ణని చెప్పుకోలేదు. త్రిత్వాన్ని ఎన్నడూ ప్రచారం చేయలేదు. దైవం మానవ కుమారునిగా రావడం గురించి కాని, లేక 'మౌలిక పాపం' (ఒరిజినల్ సిన్) గురించి కాని ఆయన చెప్పలేదు. కాని ఆయన బోధనలను తర్వాతి కాలాల్లోని మతపెద్దలు మార్చివేశారు. ముఖ్యంగా పౌలు (Paul) ఈ మార్పులు చేశారు. పునరుజ్జీవం, దైవ సామ్రాజ్యం, శిలువ వగైరా పదాలకు ఆయన కొత్త అర్థాలు ఇచ్చారు.

## త్రిత్వం

క్రయిస్తవ విశ్వాసం ప్రకారం, త్రిత్వం అంటే దైవానికి సంబంధించిన మూడు రూపాలు. (1) దైవం, (2) దైవ కుమారుడు, (3) పరిశుద్ధాత్మ.

దేవునికి ఈ మూడు రూపాలున్నాయని విశ్వసిస్తారు. ఈ విశ్వాసం ప్రకారం యేసు దేవుని కుమారుడు. దేవుని వారసుడు. పూర్తిగా దేవుని వంటివాడు. ఇదీ క్రైస్తవుల విశ్వాసం.

కాని ఇస్లామీయ విశ్వాసం ఏమంటే, దేవుడు ఎవరికీ జన్మించలేదు. ఆయనకు సంతానం లేదు. ఆయనే సర్వస్వాన్ని సృష్టించాడు. ఆయన సాటిలేనివాడు. ఆయన ఒకే ఒక్కడు. ఆయన వంటివారు మరెవ్వరూ లేరు. దేవునికి సహవర్తులుగా లేదా భాగస్వాములుగా ఇతరులను నిలబెట్టడం మహాపాపం. దేవుని వద్ద మధ్యవర్తులు లేరు. ఎవరూ ఆయన ఎదుట ఎవరికీ సిఫారసు చేయలేరు. దైవవిశ్వాసం, మంచి పనులు తప్ప మరేవీ ఆయన సమక్షంలో మనిషికి ఉపయోగపడవు.

## దైవకుమారుడు

ప్రవక్త యేసును దేవుని కుమారునిగా క్రైస్తవులు విశ్వసిస్తారు. ఈ విశ్వాసం అనువాదాల్లో వచ్చిన పొరపాటు వల్ల జనించింది. ప్రవక్త క్రీస్తు మరణించిన తర్వాత దాదాపు ముప్పయి సంవత్సరాల వరకు గోస్పెల్స్ (సువార్తలు) సంకలనం చేయబడలేదని క్రయిస్తవ పండితులే అంగీకరిస్తున్నారు. ప్రారంభంలో గోస్పెల్స్ గ్రీకు భాషలో వ్రాయబడ్డాయి. ఇందులో కొన్ని మౌఖికంగా అందినవి, కాగా కొన్ని రాతప్రతుల ద్వారా లభించినవి. రాతప్రతుల ద్వారా లభించినవి ఆర్మాయిక్ భాషలో ఉన్నవి. ఈ భాషను అప్పటి యూదులు మాట్లాడేవారు. కాని ఇప్పుడు ఆ మూలప్రతులేవీ అందుబాటులో లేవు. కొత్త నిబంధనలో కూడా కొన్ని ప్రవక్త యేసు అనుచరులు చెప్పినవి, కొన్ని కొత్తవారు చెప్పినవి. అందువల్ల వీటి మధ్య వైరుధ్యాలున్నాయి. ప్రవక్త యేసు(అస)పై అవతరించిన అసలు గ్రంథం కానీ, బైబిలు ప్రవక్తలపై అవతరించిన దైవసందేశాలు కాని ఏవీ కూడా నేడు లభించడం లేదు.

https://teluguislam.net

గ్రీకు భాషలో ఉన్న "దైవదాసుడు" అన్న పదాన్ని (ఈ పదాన్ని ప్రవక్త యేసు ఎక్కువగా ఉపయోగించారు) పౌలు (Paul) అనువదించేటపుడు ఈ పొరపాటు దొర్లింది. ఈ పదానికి గ్రీకు భాషలో "దేవుని దాసుడు" అన్న అర్థంతో పాటు "దేవుని కుమారుడు" అన్న అర్థం కూడా ఉంది. పౌలు (Paul) ఇందులో రెండవ అర్థాన్ని స్వీకరించి అనువాదం చేశాడు. ఈ పొరపాటు తర్వాతి కాలాల్లో క్రయిస్తవ విశ్వాసాలను, దైవభావనను మార్చివేసింది.

దివ్యఖుర్ఆన్‌లోని 9:30-31 ఆయతులో దేవుడు ఈ విషయాన్ని స్పష్టంగా విశదీకరించాడు:

**"ఉజైర్ అల్లాహ్ కుమారుడు" అని యూదులు అంటారు. "మసీహ్ అల్లాహ్ కుమారుడు" అని క్రైస్తవులు అంటారు. వారికి పూర్వం అవిశ్వాసంలో పడివున్న వారి మాటలను అనుకరిస్తూ వారు తమ నోటితో అనే ఈ మాటలు నిరాధారమైనవి. వారు అల్లాహ్‌ను కాదని తమ పండితులను, తమ సన్యాసులను ప్రభువులుగా చేసుకున్నారు. వాస్తవానికి, ఒకే దేవుని దాస్యం తప్ప మరెవరి దాస్యాన్నీ చేసే ఆజ్ఞ వారికి ఇవ్వబడలేదు. ఆయన తప్ప ఆరాధనకు అర్హుడైన వాడెవరూ లేడు. ఆయన పరిశుద్ధుడు.వారు పలుకుతున్న బహుదైవత్వ మాటలకు అతీతుడు."** ***(ఖుర్ఆన్ 9 : 30 - 31)***

## పునరుజ్జీవం

క్రయిస్తవ విశ్వాసం ప్రకారం, ప్రవక్త యేసును ఉంచిన రాతి సమాధి తర్వాత ఖాళీగా కనబడింది. ఆయన మరణించి మళ్ళీ సజీవుడయ్యారు. ఆ పిదప స్వర్గానికి అధిరోహించారు. కాని ఈ సంఘటనను గురించి దివ్య ఖుర్ఆన్ ఇలా వివరించింది:

**"నిజానికి వారు ఆయన్ని చంపనూలేదు, శిలువపైకి ఎక్కించనూ**

https://teluguislam.net

**లేదు. నిజం ఏమిటంటే, వారి కొరకు ఆయన్ని పోలినవ్యక్తి రూపొందించబడ్డాడు. ఈసా విషయంలో విభేదించినవారు ఆయన వ్యవహారంలో సందేహానికి లోనయ్యారు. అంచనాలను అనుసరించటం తప్ప వారికి ఈ విషయమై ఖచ్చితంగా ఏమీ తెలియదు. అసలు వారు ఆయన్ని చంపలేదు, పైగా అల్లాహ్ ఆయన్ని తన వైపునకు ఎత్తుకున్నాడు. అల్లాహ్ సర్వాధిక్యుడు, మహావివేకి.** ***(ఖుర్‌ఆన్ 4:157, 158)***

## అసలు పాపం

"అసలు పాపం" అన్న సిద్ధాంతం ప్రకారం, యావత్తు మానవాళి పాపం కారణంగా జన్మించింది. ఆదిపురుషుడు ఆదమ్, ఆయన సంతానం శాశ్వత పాపానికి గురయ్యారు. ఎందుకంటే, ఆదమ్, ఆయన భార్య హవ్వాలు నిషిద్ధ ఫలాన్ని తిన్నారు కాబట్టి. ఈ పాపం నుంచి విముక్తి పొందాలంటే మనిషి ఒక మత పెద్ద ద్వారా బాప్తిజం పొందక తప్పదు. లేకపోతే మనిషి నరకంలో శిక్ష అనుభవించవలసి ఉంటుంది. కొన్ని చర్చీల ప్రకారం, మనిషి తన పాపాలను మత పెద్ద ముందు అంగీకరించడం కూడా తప్పనిసరి.

ఈ విషయంలో మనం ఇస్లామీయ విశ్వాసాన్ని పరిశీలిస్తే, మనిషి ఎలాంటి పాపం లేకుండా పాపరహితుడిగా జన్మిస్తాడు. మనిషి ఆచరించిన చెడు కర్మల వల్ల మాత్రమే మనిషి పాపాత్ముడవుతాడు. కేవలం దేవుడు మాత్రమే మనిషిని క్షమించగలడు. మనిషి నేరుగా దేవుణ్ణి మొరపెట్టుకో గలడు. క్షమాభిక్ష అర్థించగలడు. పశ్చాత్తాపపడడం, మంచి పనులు చేయడం వల్ల మనిషి క్షమాభిక్ష పొందగలడు. దేవుడు అపార కృపాశీలుడు, పరమ దయామయుడు. ముస్లిముకు మతపెద్దల ద్వారా బాప్తిజము పొందవలసిన అవసరంలేదు. మతపెద్దల ముందు

https://teluguislam.net

అంగీకరించవలసిన అవసరమూ లేదు. ముస్లిమ్ ఎవరైనా తన పశ్చా త్తాపం తానే స్వయంగా దేవునికి ప్రకటించవచ్చు.

## క్రయిస్తవ విశ్వాసం గురించి తలెత్తే ప్రశ్నలు

- *తల్లిదండ్రులు చేసిన పాపానికి పిల్లలకు శిక్ష విధిస్తారా?*
- *తన సృష్టి అయిన మానవుడు చేసిన ఒక చిన్న పొరపాటును ఏ మాత్రం క్షమించలేని వాడా దేవుడు?*
- *ఎందుకు అనేక సంవత్సరాల తర్వాత దేవునికి తన స్వంత కుమారుడు ఉండాలన్న ఆలోచన వచ్చింది? అనేక సంవత్సరాల తర్వాత కాని మానవాళి పాపాల ప్రక్షాళనకు కావలసిన రక్తం పారించడానికి తన స్వంత కుమారుణ్ణి అత్యంత అమానుషంగా హత్యకు గురయ్యే పరిస్థితి కల్పించవలసి వచ్చిందా?*
- *ప్రవక్త యేసు మన పాపాల కోసం మరణించి ఉన్నట్లయితే, ఆయన ద్వారానే సాఫల్యం సాధ్యమయ్యేదయితే, ఆయనకన్నా ముందు పుట్టి గతించిన మానవాళి సాఫల్యం ఎలా సాధ్యం? అంటే ఆయనకు ముందు పుట్టిన ప్రజలు, ఆయన కన్నా ముందు వచ్చిన ప్రవక్తలు అందరికీ శాశ్వత పాపం నుంచి విముక్తి లేదా?*

### పై ప్రశ్నలను గురించి ఖుర్‌ఆన్‌ను అడుగుదాం...

## తల్లిదండ్రులు చేసిన పాపానికి పిల్లలకు శిక్ష విధిస్తారా?

**సన్మార్గాన్ని పొందేవాడు తన మేలు కోసమే సన్మార్గాన్ని పొందు తాడు. పెడదారి పట్టేవాడు తన కీడుకు తానే కారకుడౌతాడు. (పాపపు) బరువు మోసే వాడెవడూ ఇంకొకరి (పాపపు) బరువును తనపై వేసుకోడు.** ***(బనీ ఇస్రాయీల్ 17: 15)***

https://teluguislam.net

## *తన సృష్టి అయిన మానవుడు చేసిన ఒక చిన్న పొరపాటును ఏ మాత్రం క్షమించలేని వాడా దేవుడు?*

మొత్తానికి ఆదం (అలైహిస్సలాం) తన ప్రభువు నుంచి (పైన పేర్కొనబడిన) కొన్ని మాటలు నేర్చుకుని (పశ్చాత్తాపం చెందారు.) అల్లాహ్ కూడా ఆయన పశ్చాత్తాపాన్ని ఆమోదించాడు. నిశ్చయంగా అల్లాహ్ పశ్చాత్తాపాన్ని స్వీకరించేవాడు, కరుణించేవాడు కూడాను. *(అల్ బఖర :2 37)*

**ఎందుకు అనేక సంవత్సరాల తర్వాత దేవునికి తన స్వంత కుమారుడు ఉండాలన్న ఆలోచన వచ్చింది? అనేక సంవత్సరాల తర్వాత మానవాళి పాపాల ప్రక్షాళనకు కావలసిన రక్తం పారించడానికి తన స్వంత కుమారుణ్ణి అత్యంత అమానుషంగా హత్యకు గురయ్యే పరిస్థితి కల్పించవలసి వచ్చిందా?**

♦ అసలు అల్లాహ్‌కు సంతానమే లేదు. అల్లాహ్‌కు సంతానం ఉందని అనటం ఈ ప్రపంచంలోకెల్లా అతి పెద్ద అబద్ధం. మరి అల్లాహ్‌కు సంతానమే లేనప్పుడు పైన అడిగిన వాటి గురించి చర్చ అవివేకం, అనవసరం.

"అల్లాహ్‌కు సంతానం కలదని వీళ్ళు అంటున్నారు. (ఇలాంటి మాటలకు) ఆయన అతీతుడు, పవిత్రుడు. పైగా భూమ్యాకాశాలలో వున్న సమస్తమూ ఆయనదే. అవన్నీ ఆయన (ఆజ్ఞల)కు తల ఒగ్గి ఉన్నాయి." *(అల్ బఖర 2: 116)*

ఇక దైవప్రవక్త ఈసా విషయమంటారా? మానవాళి పాపాల ప్రక్షాళన కోసం రక్తం పారించారన్న మాట కేవలం ఒక ఊహాగానమే గాని అది ముమ్మాటికీ వాస్తవం కాదు. దివ్య ఖుర్‌ఆన్ ఒకే ఒక్క మాటలో

https://teluguislam.net

దీనికి సమాధానం ఇచ్చేసింది.

**వారు (ఈసా ప్రవక్తను చంపదలచిన వారు) నిజానికి ఆయన్ని చంపనూలేదు, శిలువ పైకి ఎక్కించనూ లేదు. నిజం ఏమిటంటే, ఈ విషయంలో వారు భ్రమకు గురిచేయబడ్డారంతే!**

***(అన్ నిసా : 157)***

**ప్రవక్త యేసు మన పాపాల కోసం మరణించి ఉన్నట్లైతే, ఆయన ద్వారానే సాఫల్యం సాధ్యమయ్యే దయితే, ఆయనకన్నా ముందు పుట్టి గతించిన మానవాళి సాఫల్యం ఎలా సాధ్యం? అంటే ఆయనకు ముందు పుట్టిన ప్రజలకు, ఆయనకన్నా ముందు వచ్చిన ప్రవక్తలకు శాశ్వత పాపం నుంచి విముక్తి లేదా?**

♦ ఈ ప్రపంచంలో మనిషి సాఫల్యం, మన్నింపు దైవప్రవక్త ఈసా (అ) పుట్టుకతో ఏమాత్రం ముడిపడి లేదని ఖుర్ఆన్ అధ్యయనం ద్వారా మనకు బోధపడుతోంది. సర్వసామాన్యమైన, సార్వత్రికమైన ఈ దివ్యఖుర్ఆన్ ప్రకటనను గమనించండి:

**(పాప కార్యాల తరువాత) ఎవరు పశ్చాత్తాపం చెంది, విశ్వసి స్తారో, సదాచరణ చేస్తారో అలాంటి వారి పాపాలను అల్లాహ్ పుణ్యాలుగా మార్చి వేస్తాడు. అల్లాహ్ క్షమాభిక్ష పెట్టేవాడు, కరుణాకరుడు.** ***(ఖుర్ఆన్ 25 : 70)***

♦ ఈసా ప్రవక్త ఈ లోకంలోకి వచ్చినది ఎప్పుడు? నేటికి దాదాపు 2050 యేండ్ల క్రితం. అంతకుముందు మనిషి ఈ భూమిపై కాలుమోపిన నాటి నుంచి ఈ రోజు వరకు ఎంతోమందికి ఈసా ప్రవక్త (అ) ప్రమేయం లేకుండానే అల్లాహ్ క్షమాభిక్ష లభించింది. పరలోక సాఫల్యమూ ప్రాప్తించింది ఆ జాబితాలోకి మొట్ట మొదటగా ఆదం ప్రవక్త వస్తారు. ఆయన గురించి దివ్య ఖుర్ఆన్‌లో ఏమన బడిందో చూడండి:

https://teluguislam.net

**"ఆదం పశ్చాత్తాపాన్ని అల్లాహ్ ఆమోదించాడు."**

***(అల్ బఖర :2 37)***

ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉదాహరణలు మన ముందుకు వస్తాయి. వాటిలో ఎక్కడా కూడా ఈసా ప్రవక్త (అ) ప్రమేయంతో ఫలానా వారికి పరలోక సాఫల్యం లభించిందన్న ప్రసక్తి లేదు.

ఇస్లాంలో యేసు ప్రవక్త (అ) గురించి ఇంకా ఏం చెప్పబడిందో తెలుసుకోవటానికి మా పబ్లికేషన్ ద్వారా ప్రచురితమైన **'దైవప్రవక్త యేసు (అ) జీవిత గాథ'**, **'యేసు జీవిత సత్యాలు'** పుస్తకాలు చదవండి. ఈ సబ్జెక్టుకు సంబంధించి ఇంకా ఇతర పుస్తకాలు కూడా మీకు మార్కెట్లో లభ్యమవుతున్నాయి. క్లుప్తంగా వాటి వివరాలు:

1) ముహమ్మద్ (స) క్రీస్తు సహజ వారసులు (అల్ హఖ్ పబ్లికేషన్స్)

2) డైలాగ్ (అల్ ఫారూఖ్ పబ్లికేషన్స్)

3) బైబిల్ దేవుని వాక్యమా? (అల్ ఫారూఖ్ పబ్లికేషన్స్)

4) బైబిల్‌లో ముహమ్మద్ (తెలుగు ఇస్లామిక్ పబ్లికేషన్స్)

4) బైబిల్‌లో ఇస్లాం మరియు క్రైస్తవం (రియాజుద్దీన్ అలీ ట్రస్ట్) మొదలగునవి.

https://teluguislam.net

## మోడల్ ప్రశ్నలు

1) క్రైస్తవం గురించి మీకు ఏమి తెలుసు?
2) 'త్రిత్వం'ను వివరించండి?
3) ఈ రోజుల్లో క్రైస్తవ మతాన్ని అవలంబించే వారి విశ్వాసం ఏమిటి?
4) యేసు ప్రవక్త గురించి ఈనాడు క్రైస్తవ సోదరులు కలిగి ఉన్న ఒక 'వింత' అపోహ ఏది?

## ఖాళీలు పూరించండి

1) నిజానికి ప్రవక్త యేసు ఒక కొత్త ..............దేనినీ తీసుకురాలేదు.
2) ప్రవక్త యేసు .............. కు చెందిన చెల్లాచెదురైన తెగల వద్దకు పంపబడ్డారు.
3) యూద, క్రైస్తవ సోదరులకు మనం........ బోధించాలి.

## జతపరచండి

| | | | |
|---|---|---|---|
| 1) | తల్లిదండ్రులు చేసిన పాపానికి | (   ) | గతించిన మానవాళి సాఫల్యం ఎలా సాధ్యం |
| 2) | యేసు ప్రవక్త మన పాపాల కోసం మరణించినట్లయితే | (   ) | ఇస్లాం సిద్ధాంతాల ప్రకారం పూర్తిగా విరుద్ధం |
| 3) | 'అసలు పాపం' అనే సిద్ధాంతం | (   ) | అల్లాహ్ ఎవరికీ జన్మించలేదు |
| 4) | ప్రవక్త యేసు దేవుని కుమారుడు | (   ) | పిల్లల్ని శిక్షించరాదు. |
| 5) | ఇస్లామీయ విశ్వాసం ప్రకారం | (   ) | అనేది అనువాదాల్లో వచ్చిన పొరపాటు వల్ల జరిగింది. |

https://teluguislam.net

## అధ్యాయం - 2

# ఆచరణాత్మక సిద్ధాంతాలు

https://teluguislam.net

11వ పాఠం

# ఇస్లాం మూల స్తంభాలు

ఇస్లాం కట్టడానికి మూల స్తంభాలు అయిదు అవి:

1. అల్లాహ్ తప్ప వేరే ఆరాధ్య దైవం లేదని, ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) అల్లాహ్ యొక్క చిట్టచివరి ప్రవక్త అని సాక్ష్యమివ్వటం. (చూడండి పేజి నెం. 17)
2. ప్రతి రోజూ అయిదు పూటల నమాజు వ్యవస్థను నెలకొల్పటం. (చూడండి పేజి నెం. 114)
3. జకాత్‌ను విధిగా చెల్లించటం (ఆర్థిక స్థోమత కలవారు ఏడాదికొకసారి ఇవ్వవలసిన పేదల, సామాజిక హక్కు ఇది). (చూడండి పేజి నెం. 146)
4. రమజాన్ నెల ఉపవాసాలు విధిగా పాటించటం. (చూడండి పేజి నెం. 135)
5. స్థోమత ఉన్నవారు జీవితంలో కనీసం ఒక్కసారి హజ్జ్ యాత్రను విధిగా నిర్వర్తించటం. (చూడండి పేజి నెం. 154)

## మోడల్ ప్రశ్నలు

1) ............ ఇస్లాం మొదటి స్తంభం.
2) రమజాన్ నెల ఉపవాసాలు............
3) ఇస్లాంకు మూల స్తంభాలు..............

https://teluguislam.net

12వ పాఠం

# విశ్వాసం (ఈమాన్)లోని ముఖ్య అంశాలు

విశ్వాసం (ఈమాన్)లో ఆరు ముఖ్య అంశాలు ఇమిడి ఉన్నాయి. అవి :

1. అల్లాహ్‌పై విశ్వాసం
2. అల్లాహ్ దూతలపై విశ్వాసం
3. అల్లాహ్ గ్రంథాలపై విశ్వాసం
4. అల్లాహ్ ప్రవక్తలపై విశ్వాసం
5. మరణానంతరం తిరిగి లేపబడే (పునరుత్థాన) దినంపై విశ్వాసం
6. ఏది జరిగినా అల్లాహ్ తరపుననే, అల్లాహ్ తలచినదే జరుగుతుందనే విధివ్రాత (ఖజా-ఖదర్)పై విశ్వాసం

## అల్లాహ్‌పై విశ్వాసం

అల్లాహ్‌యే ఒకే ఒక్క దేవుడు అన్నది మన విశ్వాసం. ఆయనే మన ప్రభువు. సృష్టిలోని ప్రతి వస్తువుకు ప్రభువు. విశ్వంలోని ప్రతిదీ ఆయనచే సృష్టించబడినదే. ఆయన తప్ప ప్రతిదీ సృష్టితమే. అందరూ అల్లాహ్ దాసులే. దైవత్వంలో అల్లాహ్‌తోపాటు దాసులెవరికీ భాగస్వామ్యం లేదు. ఆఖరికి దైవదూతలు, దైవప్రవక్తలు కూడా అల్లాహ్‌చే సృష్టించబడి అల్లాహ్ ఆజ్ఞలకు లోబడి మసలుకునే దాసులే. వారు యేసు (అ) అయినా, ముహమ్మద్ ప్రవక్త (స) అయినా, మరెవరైనా సరే; ఎవరికీ ఏ కొంచెం కూడా దైవత్వంలో భాగస్వామ్యం లేదు. అల్లాహ్ నిత్య సజీవుడు. శాశ్వ తంగా ఉండేవాడు, ఆది, మధ్యం, అంతాలు లేనివాడు. అనంతకాలం

https://teluguislam.net

నుంచి వున్నాడు. అనంతకాలం వరకు ఉంటాడు. అయన అన్నీ వింటాడు, అన్నీ చూస్తాడు. అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు. సర్వాధిక్యుడు. తనకంటూ ప్రత్యేకమైన సుందరమైన నామాలు, దివ్యమైన గుణాలు ఆయనకు ఉన్నాయి. ఆయన మనల్ని శూన్యం నుంచి ఉనికిలోకి తీసుకువచ్చాడు. మనల్ని అత్యంత సుందరమైన ఆకృతిలో పుట్టించాడు. లెక్కలేనన్ని వరాలను, అనుగ్రహాలను ప్రసాదించాడు. కనుక మనం ఆయనను తప్ప వేరెవరినీ ఆరాధించకూడదు. అల్లాహ్‌చే ఎన్నుకోబడిన ప్రవక్తలను, అల్లాహ్ సామీప్యం పొందిన దూతలను, ఎవరినీ అల్లాహ్‌తోపాటు ఆరాధించరాదు. తమ ఆరాధనలను ఇతరులకు నివేదించుకునేవారు, ఆరాధనా భావంతో అల్లాహ్‌యేతరుల ముందు వంగేవారు, మోకరిల్లేవారు, అల్లాహ్‌యేతరుల ప్రసన్నత కోసం బలులు సమర్పించుకునేవారు అవిశ్వాసులుగా భావించబడతారు. వారు తమను ముస్లింలుగా ప్రకటించుకున్నప్పటికీ వాస్తవంలో వారు ముస్లింలు కారు.

1. ఇలా ప్రకటించమని అల్లాహ్ ప్రతి విశ్వాసినీ ప్రబోధిస్తున్నాడు:

**"నిస్సందేహంగా నా నమాజు, నా సకల ఆరాధనలు, నా జీవనం, నా మరణం – ఇవన్నీ సర్వలోకాల ప్రభువైన అల్లాహ్ కొరకే. ఆయనకు భాగస్వాములెవరూ లేరు. దీని గురించే నాకు ఆజ్ఞాపించబడింది. ఆజ్ఞాపాలన చేసే వారిలో నేను మొదటివాణ్ణి."**

***(ఖుర్ఆన్ 6:162-163)***

2. ఇస్లాం స్వచ్ఛమైన ఏకదైవారాధనను ప్రబోధించే ధర్మం. అనేక దేవుళ్ళ సిద్ధాంతాన్ని ఇస్లాం ఖండిస్తుంది. అలాగే క్రైస్తవుల ముగ్గురు దేవుళ్ళ (త్రిత్వ) సిద్ధాంతం కూడా ఇస్లాంకు విరుద్ధం. అల్లాహ్ ఒకే

https://teluguislam.net

ఒక్కడని, ఆయన అస్తిత్వంలోగాని, అధికారంలోగాని, ఆజ్ఞలోగాని వేరెవరికీ భాగస్వామ్యం లేదని ఇస్లాం బోధిస్తోంది.

3. అల్లాహ్ సెలవిస్తున్నాడు:

**(ఓ ముహమ్మద్-స! ప్రజలతో) ఇలా చెప్పండి: ఆయన అల్లాహ్ (నిజమైన ఆరాధ్యుడు) ఒక్కడు. అల్లాహ్ ఏ అవసరాలూ లేనివాడు. ఆయన (ఎవరినీ) కనలేదు. ఆయన (కూడా) ఎవరికీ పుట్టినవాడు కాదు. ఆయనకు సరిసమానులు (పోల్చదగినవారు) ఎవరూ లేరు.** ***(ఖుర్ఆన్ 112వ సూరా)***

## అల్లాహ్‌దూతలపై విశ్వాసం

తనను ఆరాధించటానికి, తన ఆజ్ఞల్ని పాటించటానికి, మానవులైన తన ప్రవక్తల వద్దకు తన సందేశాన్ని చేరవేయటానికి అల్లాహ్ ఎంతోమంది దూతలను సృష్టించాడు.

అటువంటి అల్లాహ్‌దూతల్లో అగ్రగణ్యులు జిబ్రయీల్ (అ). మన ప్రవక్త ముహమ్మద్ (స) వద్దకు అల్లాహ్ సందేశాన్ని ('వహీ'ని) చేరవేస్తూ ఉండినది ఈయనే.

మరొక దైవదూత పేరు మీకాయీల్. వర్షానికి సంబంధించిన విషయాలను ఈ దైవదూత పర్యవేక్షిస్తుంటారు.

మరొకాయన మృత్యుదూత. నిర్ణీత సమయం వచ్చినప్పుడు మనుషుల ఆత్మలను స్వాధీనపరచుకోవటం ఈయన పని. ఇలా అనేక మంది దూతలు అల్లాహ్ చేత సృష్టించబడ్డారు.

దూతలు కూడా అల్లాహ్ దాసులే. అల్లాహ్ వారిని గౌరవప్రదమైన వారిగా చేశాడు. కనుక మనం వారి గురించి గౌరవభావంతోనే మాట్లాడుకోవాలి.

https://teluguislam.net

అయితే మనం వారినెవరినీ పూజించం. వారిని అల్లాహ్ కుమారులుగా గాని, కూతుళ్ళుగా గాని భావించం. పైగా వారిని అంత అద్భుతంగా సృష్టించిన ఏకైక ప్రభువు అల్లాహ్‌ను మాత్రమే మనం ఆరాధిస్తాం.

దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా అంటున్నాడు:

**కరుణామయునికి (అల్లాహ్‌కు) సంతానం ఉందని వారు (బహు దైవారాధకులు) చెబుతున్నారు. (ఇది నిజం కాదు. ఇటువంటి లోపాల నుంచి) ఆయన పవిత్రుడు. పైగా వారంతా (దైవదూతలంతా) గౌరవించబడిన ఆయన దాసులు.**

**ఏ విషయంలోనూ వారు అల్లాహ్ కంటే ముందు మాట్లాడరు. పైగా ఆయన ఆజ్ఞను ఖచ్చితంగా పాటిస్తారు.**

**వారికి ముందున్నవాటి గురించి, వెనుక ఉన్న వాటి గురించి కూడా ఆయనకు తెలుసు. సిఫారసు వినటానికి అల్లాహ్ ఇష్టపడిన వారి విషయంలో తప్ప వారు ఎవరి గురించి కూడా సిఫారసు చేయజాలరు. వారసలు అల్లాహ్ అంటే ఎంతో భయపడుతూ ఉంటారు.**

**వారిలో ఎవరయినా, "అల్లాహ్‌తో పాటు నేనూ పూజ్యుడినే" అని అంటే మేమతన్ని నరకయాతనకు గురి చేస్తాము. మేము దుర్మార్గులకు ఇచ్చే ప్రతిఫలం ఇదే. *(ఖుర్‌ఆన్ 21:26-29)***

## అల్లాహ్‌గ్రంథాలపై విశ్వాసం

ఈ లోకంలో అనేక మంది ప్రవక్తలపై అల్లాహ్ తన గ్రంథాలను అవతరింపజేశాడు. మానవులకు సత్యాన్ని ప్రబోధించటానికి, ప్రజలను సన్మార్గంలో నడిపించటానికి అల్లాహ్ వీటిని అవతరింపజేశాడు. ఆ గ్రంథాల్లో అల్లాహ్ వాణి ఉంటుంది.

https://teluguislam.net

ఇబ్రాహీమ్ ప్రవక్త (అ)కు ఇవ్వబడిన పత్రాలు (సుహుఫ్) కూడా ఆ కోవకు చెందినవే.

మూసా ప్రవక్త (అ)కు తౌరాత్ ఇవ్వబడింది.

దావూద్ ప్రవక్త (అ)కు జబూర్ ప్రసాదించబడింది.

ఈసా ప్రవక్త (అ)కు ఇంజీల్ ఇవ్వబడింది.

**మరి బైబిలు ఏమిటి?:** ఈనాడు క్రైస్తవుల చేతుల్లో వున్న బైబిలు, ఇంజీలు గ్రంథం కాదు. కొత్త, పాత నిబంధనలను కలిపితే తయారైనదే బైబిలు. పాత నిబంధనలో మూసా (అ), దావూద్ (అ)లపై అవతరించిన దైవవాణికి సంబంధించిన కొన్ని విషయాలు ఉన్నాయి. కొత్త నిబంధనలో ఈసా ప్రవక్త (అ)పై అవతరించిన దైవవాణికి సంబంధించిన కొన్ని విషయాలు ఉన్నాయి. అయితే కాలక్రమంలో వాటిలో క్రైస్తవుల కల్పనలు, చేర్పులు, జోడింపులు కూడా అనేకం కలిసాయి. దైవవాణితోపాటు మత పెద్దల జీవిత చరిత్రలు, మహాత్ముల గాథలు, వ్యాఖ్యానాలు అన్నీ కలగాపులగం చేయబడ్డాయి. వాటిలో ఏది అసలు పుస్తకంలోని భాగమో, ఏది ఆ తర్వాత చేర్చబడినదో తేల్చుకోవటం అసాధ్యం.

ఇక అంతిమంగా ముహమ్మద్ (స)పై ఖుర్ఆన్ అవతరించింది.

యూదులు, క్రైస్తవులు తమ గ్రంథాలైన తౌరాత్, ఇంజీల్‌లలోని కొన్ని భాగాలను వక్రీకరించారు. కొన్ని భాగాల్లో మార్పులు, చేర్పులు చేశారు.

దివ్య ఖుర్ఆన్ అంతిమ దైవగ్రంథం. అందువల్ల దీనిని సంరక్షించే

https://teluguislam.net

బాధ్యతను అల్లాహ్ స్వయంగా తీసుకున్నాడు. కనుకనే ఈనాటికీ ఖుర్ఆన్ గ్రంథంలో పొల్లు కూడా మార్పు జరగలేదు. గత గ్రంథాల్లోని సత్యతను దివ్యఖుర్ఆన్ ధృవపరచటమే గాక దానిని పరిరక్షిస్తోంది. ఆయా గ్రంథాల్లో దివ్యఖుర్ఆన్ బోధనలకు విరుద్ధంగా వున్న విషయాలన్నీ తర్వాతి కాలాల్లో జరిగిన మార్పులు, చేర్పులేనని మనం స్థూలంగా అర్థం చేసుకోవచ్చు. దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా అంటున్నాడు:

**ఇంకా (ఓ ప్రవక్తా!) మేము నీ వైపుకు ఈ గ్రంథాన్ని సత్య సమేతంగా అవతరింపజేశాము. అది తనకన్నా ముందు వచ్చిన గ్రంథాలను సత్యమని ధృవీకరిస్తుంది, వాటిని పరిరక్షిస్తుంది.**

***(ఖుర్ఆన్ 5:48)***

ఖుర్ఆన్ గ్రంథాన్ని అల్లాహ్ అరబీ భాషలో అవతరింపజేసి దానిని కాపాడే బాధ్యతను కూడా తనే స్వయంగా తీసుకున్నాడు. అల్లాహ్ అంటున్నాడు:

**మేమే ఈ ఖుర్ఆన్‌ను అవతరింపజేశాము. మరి మేమే దీనిని (కల్పితాల నుంచి, మార్పులు చేర్పుల నుంచి) రక్షిస్తాము.**

***(ఖుర్ఆన్ 15:9)***

## అల్లాహ్ ప్రవక్తలపై విశ్వాసం

మానవులకు తన సందేశం అందజేయటానికి అల్లాహ్ మానవుల్లో నుంచే కొంతమంది ప్రవక్తలను ఎంపిక చేశాడు. మరి వారిలో నుంచే తన సందేశహరులను ఎన్నుకున్నాడు. తాను ఆమోదించిన చట్టాలను వారికి అందజేసి ప్రజలకు వాటిని గురించి తెలియజేయమని, వాటి ప్రకారంగా ప్రజల సమస్యలను పరిష్కరించమని ఆదేశించాడు.

https://teluguislam.net

ఆ విధంగా మానవ చరిత్రలో ఎంతోమంది ప్రవక్తలు అవతరించారు. వారు ప్రజలకు సత్యాన్ని బోధపరచటంతోపాటు తాము దానిపై స్థిరంగా ఉన్నారు. ఎన్నో కష్టాలను, బాధలను ఎదుర్కొని అల్లాహ్ ధర్మాన్ని లోకానికి తెలియజేశారు.

కొంతమంది ప్రవక్తలు ధర్మంపై నిలకడలో, కష్టాలను, బాధలను ఎదుర్కొని లోకానికి సత్యం తెలియజేయటంలో సాటిలేని మేటిగా ప్రఖ్యాతి గాంచారు. వారే ఈ ఐదుగురు: నూహ్, ఇబ్రాహీమ్, మూసా, ఈసా, ముహమ్మద్ (అల్లాహ్ వారందరిపై శుభాలను, కారుణ్యాన్ని కురిపించుగాక).

ఇస్లాంను స్వీకరించటమంటే మూసా ప్రవక్త (అ)పైనో లేక ఈసా ప్రవక్త (అ)పైనో లేక మరో ప్రవక్త పైనో అవిశ్వాసం ఉన్నట్లు కాదు. ఆ ప్రవక్తలందరినీ సరైన విధంగా ఎలా విశ్వసించాలో ఇస్లాం బోధిస్తుంది. అంతకుమించి మరేమీ లేదు. అల్లాహ్ అంటున్నాడు:

**ఇంకా (ఓ ప్రవక్తా!) మేము నీ వైపుకు ఈ గ్రంథాన్ని సత్య సమేతంగా అవతరింపజేశాము. అది తనకన్నా ముందు వచ్చిన గ్రంథాలను సత్యమని ధృవీకరిస్తుంది, వాటిని పరిరక్షిస్తుంది.**

***(ఖుర్ఆన్ 5:48)***

అంటే అలనాటి ప్రజలు వక్రీకరించిన వాస్తవాలను అది విశదీకరిస్తుంది. కొంతమంది ప్రవక్తల పేర్లను ప్రస్తావిస్తూ దివ్యఖుర్ఆన్‌లో అల్లాహ్ ఒకచోట అంటున్నాడు:

**(ముస్లిములారా!) మీరు ఇలా ప్రకటించండి :"మేము అల్లాహ్‌ను విశ్వసించాము. మాపై అవతరింపజేయబడిన దానినీ, ఇబ్రాహీం, ఇస్మాయిల్, ఇస్‌హాఖ్, యాఖూబ్ మరియు వారి సంతతిపై**

https://teluguislam.net

**అవతరింపజేయబడిన దానినీ, మూసా, ఈసా ప్రవక్తలకు వారి ప్రభువు తరఫున ఇవ్వబడిన దానిని కూడా మేము విశ్వసించాము. మేము వారిలో ఎవరి మధ్య కూడా ఎలాంటి విచక్షణ (వివక్ష)ను పాటించము. మేము ఆయనకే విధేయులము. *(ఖుర్ఆన్ 2:136)***

ఈ ప్రవక్తల పరంపరలో మొట్టమొదటివారు ఆదం (అలైహి). యావత్ మానవ జాతి పితామహుడు ఆయన. (అల్లాహ్ ఆయనపై శాంతిని కురిపించుగాక!)

ప్రవక్తల్లో చిట్టచివరివారు ముహమ్మద్ (స). ఆయన రాకతో ప్రవక్తల పరంపరకు సీలు పడిపోయింది. ఆయన తర్వాత ప్రళయం వరకూ ఇక ఏ ప్రవక్తా రారు. దీని ద్వారా అర్థమయ్యేది ఏమిటంటే, ఇక ప్రళయం వరకూ ఉండే ఏకైక సత్యధర్మం ముహమ్మద్ (స) బోధపరచిన ఇస్లాం మాత్రమే.

ముహమ్మద్ (స) కూడా మనలాగా మానవమాత్రులే. ఆయన దేవుడు కారు. ముహమ్మద్ (స) తండ్రి పేరు అబ్దుల్లాహ్. తాతగారి పేరు అబ్దుల్ ముత్తలిబ్. అరేబియాలో ఇబ్రాహీమ్, ఇస్మాయీల్ (అల్లాహ్ వారిరువురిపై శాంతిని కురిపించుగాక!) వంశధార నుంచి ఖురైషు తెగ పుట్టింది. ఆ తెగకు చెందిన హాషిమ్ వంశంలో ముహమ్మద్ (స) జన్మించారు.

ముహమ్మద్ (స) జన్మస్థలం మక్కా. క్రీ.శ 571 వ యేడు 'ఏనుగుల సంవత్సరం'గా చరిత్రలో ప్రసిద్ధికెక్కింది. ముహమ్మద్ (స) పుట్టుక కూడా ఆ యేటనే జరిగింది. 40 యేండ్ల వయస్సులో అల్లాహ్ ఆయనపై తన సందేశాన్ని (వహీని) అవతరింపజేశాడు. అప్పటి నుంచి ఆయన ప్రజలను అల్లాహ్ మార్గం వైపు పిలుస్తూ 13 యేండ్లు మక్కాలోనే గడిపారు.

https://teluguislam.net

అంత సుదీర్ఘ కాలంలోనూ కేవలం కొంతమంది మాత్రమే ఆయన పిలుపుకు సానుకూలంగా స్పందించారు. అనంతరం ఆయన మదీనా నగరానికి వలసపోయారు. అక్కడి ప్రజలను అల్లాహ్ మార్గం వైపు పిలిచారు. మదీనా ప్రజలు ఆయన సందేశాన్ని స్వీకరించారు. తిరిగి ఎనిమిదేండ్లకు మక్కా నగరాన్ని శాంతియుతంగా, ధర్మబద్ధంగా ఆయన జయించారు.

23 యేండ్లలో దివ్యఖుర్ఆన్ సంపూర్ణంగా అవతరించింది. యావత్ అరబ్బు ప్రాంతం ఇస్లాం నీడలోకి వచ్చింది. తర్వాత 63 యేండ్ల వయస్సులో మహమ్మద్ ప్రవక్త (స) మరణించారు.

## అంతిమ దినంపై విశ్వాసం

ప్రస్తుత జీవితం అనంతరం ఇంకో జీవితం ఉంటుందని మనందరి విశ్వాసం. అదే పరలోక జీవితం. ఈ ప్రపంచం గడుపు పూర్తవగానే శంఖం పూరించమని అల్లాహ్ ఒక దూతను ఆజ్ఞాపిస్తాడు. ఆ అల్లాహ్ దూత శంఖం పూరించగానే యావత్ మానవాళి, సకల సృష్టిరాశులు నశించి పోతాయి.

అల్లాహ్‌దూత మళ్ళీ శంఖం పూరిస్తాడు. అప్పుడు ఆదం (అ) నుంచి చిట్టచివరగా మరణించేవారి వరకు అందరూ సమాధుల నుంచి పైకి లేపబడతారు. అల్లాహ్ వారందరినీ సమీకరిస్తాడు. ప్రపంచంలో వారు చేసి వచ్చిన కర్మలను గురించి విచారిస్తాడు.

అల్లాహ్‌ను విశ్వసించి, అల్లాహ్ ప్రవక్తలను నమ్మి, సన్మార్గంలో నడచుకున్నవారిని అల్లాహ్ స్వర్గంలో ప్రవేశింపజేస్తాడు. స్వర్గంలో వారు శాశ్వత సుఖాలను, ఆనందాన్ని అనుభవిస్తారు. మరెవరైతే అల్లాహ్

https://teluguislam.net

ప్రవక్తలను తిరస్కరించి, అల్లాహ్ పట్ల అవిధేయతకు పాల్పడ్డారో వారు నరకానికి పోతారు. ఆ నరకాగ్నిలోనే వారు శాశ్వతంగా శిక్షలను అనుభవిస్తూ ఉంటారు.

ఓ అల్లాహ్! మాకు స్వర్గాన్ని ప్రసాదించు. నరక శిక్షల నుంచి మమ్మల్ని కాపాడు. (ఆమీన్). దివ్యఖుర్ఆన్‌లో చెప్పబడింది:

**కాబట్టి ఎవడు తలబిరుసుగా వ్యవహరించాడో, మరి ప్రాపంచిక జీవితానికే ప్రాధాన్యం ఇచ్చాడో అతని నివాసం నరకమే అవుతుంది. మరెవడు తన ప్రభువు ఎదుట నిలబడే విషయమై భయపడ్డాడో, ఇంకా తన మనసును చెడు వాంఛల నుండి ఆపుకున్నాడో, అతని నివాసం స్వర్గమవుతుంది.**

***(ఖుర్ఆన్ 79 :37-41)***

## విధివ్రాత (ఖజా-ఖదర్)పై విశ్వాసం

అనంతకాలం వరకూ జరగబోయే విషయాలన్నింటిని అల్లాహ్ ముందుగానే రాసిపెట్టాడు. దాని గురించిన జ్ఞానం అల్లాహ్‌కు తప్ప మరెవరికీ లేదు. ఏది జరిగినా ఆయన వ్రాసి ఉంచిన జ్ఞానానికనుగుణంగానే జరుగుతుంది. దీనినే “తఖ్‌దీర్” లేక ఖదర్ (విధివ్రాత) అని అంటారు. ఆ విధివ్రాతకు అనుగుణంగానే మానవులకు మంచీ చెడులు జరుగుతుంటాయి. ఉదాహరణకు ఆనందైశ్వర్యాలు, సిరిసంపదలు కలగటం, పంటల్లో అధిక దిగుబడులు రావటం లాంటి వాటిని విధివ్రాత వల్ల కలిగిన మేళ్ళుగానూ, దీనికి విరుద్ధంగా జరిగితే విధివ్రాత వల్ల కలిగిన నష్టాలు గానూ ప్రజలు భావిస్తారు. అయితే ఈ మేలు లేక కీడు అనేది మన వ్యవహారికమేగాని అల్లాహ్ ఏది చేసినా అందులో ఆయన వివేచనం దాగి ఉంటుంది. ప్రపంచంలో ప్రతి మానవుని ప్రతి కదలిక, ఆఖరికి చెట్టు నుంచి ఒక ఆకు రాలటం కూడా అల్లాహ్ నిర్ణయం(ఖదర్)

https://teluguislam.net

ప్రకారమే జరుగుతుంది.

## మరి సదాచరణ చేయటం వల్ల లాభమేమిటి?

సాధారణంగా ఈ ప్రశ్న చాలామంది మనసుల్ని తొలుస్తూ ఉంటుంది. వాస్తవం ఏమిటంటే విధివ్రాత అనేది మానవ మేధకందని విషయం. మానవుడు ఎంత ఆలోచించినా ఈ సమస్యను పరిష్కరించుకోలేడు. అందుకని విధివ్రాత విషయం అటుంచి మనం స్థూలంగా తెలుసుకోవలసింది ఏమిటంటే– అల్లాహ్ మానవులకు మంచీచెడుల మధ్య విచక్షణా జ్ఞానాన్ని, సన్మార్గ దుర్మార్గాల్లో దేన్నయినా అవలంబించగల "ఎంపిక అధికారాన్ని" ఇచ్చాడు. దాంతోపాటు సన్మార్గాన్ని అవలంబించిన వారికి దానికి తగినట్టు మంచి ప్రతిఫలం లభిస్తుందని, దుర్మార్గాలకు పాల్పడ్డ వారికి కఠిక శిక్షపడుతుందని హెచ్చరించాడు. పరలోకంలో దాని ప్రకారమే ఆయన మానవుల లెక్క తీసుకుంటాడు.

## మోడల్ ప్రశ్నలు

1) విశ్వాసం (ఈమాన్)లోని ముఖ్య అంశాలు ఏమిటి?
2) అల్లాహ్‌పై ముస్లింల విశ్వాసం ఎలా ఉండాలి?
3) అంతిమ దినం అంటే ఏమిటి? అది ఎలా? ఎప్పుడు వస్తుంది?
4) విధివ్రాతపై మన విశ్వాసం ఎలా ఉండాలి?

## ఖాళీలు

1) జరగబోయే విషయాలను అల్లాహ్ ముందుగానే.........
2) పరలోకంలో అల్లాహ్ మనందరి............ తీసుకుంటాడు.
3) ............ యేండ్లలో దివ్యఖుర్‌ఆన్ సంపూర్ణంగా అవతరించింది?

https://teluguislam.net

13వ పాఠం

# "అల్లాహ్ ఒక్కడే" అనగానేమి?

ఒక్కడైన అల్లాహ్‌ను సంపూర్ణంగా విశ్వసించి, ఆయన్ని మాత్రమే ఆరాధించటాన్ని తౌహీద్ (అల్లాహ్ ఏకత్వం, ఏకదైవారాధన) అంటారు. ఇస్లాం ధర్మానికి పునాది ఈ తౌహీద్.

**అల్లాహ్ ఏకత్వం (తౌహీద్) అనే మాటలో మూడు విషయాలు ఇమిడి వున్నాయి:**

1. సృష్టిఅంతటికీ ఒకే దేవుడు అనే ఏకత్వం (తౌహీదె రుబూబియ్యత్)
2. ఆరాధనపరంగా అల్లాహ్ ఏకత్వం (తౌహీదె ఉలూహియ్యత్)
3. నామాలు, గుణగణాల పరంగా అల్లాహ్ ఏకత్వం (తౌహీదె అస్మా వస్-సిఫాత్)

## 1. సృష్టిఅంతటికీ ఒకే దేవుడు అనే ఏకత్వం (తౌహీదె రుబూ బియ్యత్)

అఖిల జగతికి అల్లాహ్‌యే ప్రభువు (రబ్) అనీ, సృష్టికర్త, పాలకుడు, పోషకుడు, రక్షకుడు ఆయనేనని విశ్వసించటం. సమస్త సృష్టిరాశులను పర్యవేక్షించేవాడు, ప్రణాళికను రచించేవాడు కూడా ఆయనేనని మన స్ఫూర్తిగా నమ్మటం-ఇదే తౌహీదె రుబూబియ్యత్.

## 2.ఆరాధనపరమైన అల్లాహ్ ఏకత్వం (తౌహీదె ఉలూహియ్యత్)

సకల ఆరాధనలకు, ఉపాసనలకు, మొక్కుబడులకు అల్లాహ్ మాత్రమే అర్హుడని, అల్లాహ్ తప్ప వేరెవరూ వీటికి అర్హులు కారని విశ్వసించటం. ఇదే ఆరాధనపరమైన అల్లాహ్ ఏకత్వం (తౌహీదె ఉలూహియ్యత్)గా భావింపబడుతుంది. అంటే మన నమాజ్‌లు, దుఆలు (వేడుకోళ్ళు),

https://teluguislam.net

మొక్కుబడులు, నజరానాలు, సహాయం కొరకు అర్థించటం, ఖుర్బానీ (బలి) ఇవ్వటం, దాన ధర్మాలు చేయటం, ఉపవాసాలు పాటించటం, హజ్జ్ విధిని నెరవేర్చుటం – ఇవన్నీ కేవలం అల్లాహ్ కొరకే జరగాలి. ఎందుకంటే దాసుల ఆరాధనలు స్వీకరించే ఏకైక ఆరాధ్యుడు అల్లాహ్ మాత్రమే. ఒక్క అల్లాహ్‌కు మాత్రమే ఆ హక్కు ఉంది.

## 3. నామాలు, గుణ విశేషాలపరంగా అల్లాహ్ ఏకత్వం (తౌహీదె అస్మా వ సిఫాత్)

అల్లాహ్‌కు మాత్రమే ప్రత్యేకమైన ఉత్తమ నామాలను, ఆయన గుణ విశేషాలను విశ్వసించటాన్నే తౌహీదె అస్మా వ సిఫాత్ (నామాలు, గుణ విశేషాలపరంగా అల్లాహ్ ఏకత్వం) అంటారు. అంటే –

1. అల్లాహ్, ఆయన ప్రవక్త (స) తెలిపిన పేర్లు, గుణగణాలు తప్ప వేరితర పేర్లను, గుణగణాలను మనం అల్లాహ్‌కు ఆపాదించ కూడదు. ఉదా: 'విఘ్నేశ్వరుడు' అనే పదాన్ని తీసుకుందాం. షరీఅతు (ధర్మం)లో ఎక్కడా కూడా అల్లాహ్‌ను ఆ పేరుతో గుర్తుచేయబడలేదు. కనుక ఈ పేరునుగాని లేక ఇలాంటి వేరితర పేర్లనుగాని అల్లాహ్‌కు ఆపాదించరాదు. అలాగే యేసు, ముహమ్మద్, రామ, క్రిష్ణ. ఇవి అల్లాహ్ పేర్లు కావు. కనుక అల్లాహ్‌ను యేసు అనో లేక ముహమ్మద్ అనో, రామా అనో లేక క్రిష్ణా అనో పిలవటం సరికాదు. అదేవిధంగా ప్రపంచంలో గతించినవారు ఎంత గొప్పవారైనప్పటికీ వారి పేర్లతో అల్లాహ్‌ను సంబోధించటం సరి కానేకాదు.
2. అల్లాహ్ నామాలకు, గుణగణాలకు అల్లాహ్ మినహా వేరితరులు అర్హులు కారు. ఉదాహరణకు: అల్ కరీమ్ (పరమ ఉదాత్తుడు, కృపాకరుడు, పునీతుడు). ఈ గుణం ఒక్క అల్లాహ్‌కే ప్రత్యేకం.

https://teluguislam.net

3. దైవగ్రంథమైన ఖుర్‌ఆన్‌లోనూ, దైవప్రవక్త (స) ప్రవచనా (హదీసు) లలోనూ తెలుపబడిన అల్లాహ్ గుణగణాలలో ఎలాంటి మార్పులు చేర్పులు చేయకుండా, హెచ్చుతగ్గులు చేయకుండా, వాటిపట్ల అలక్ష్య ధోరణి ప్రదర్శించకుండా, వాటిలో పెడార్థాలు తీయకుండా, వాటిని సృష్టించబడినవాటికి ఆపాదించకుండా, వాటిని సృష్టితాలతో పోల్చకుండా ఉన్నది ఉన్నట్లుగా అంగీకరించాలి, వాటిని ధృవపర చాలి.

ఉదాహరణకు: "కరుణామయుడు (అయిన అల్లాహ్) తన సింహాసనం(అర్ష్)పై ఆసీనుడై ఉన్నాడు" అని ఖుర్‌ఆన్ (20 : 5)లో చెప్పబడింది.

అంటే–కరుణామయుడు (అల్లాహ్) సింహాసనము (అర్ష్)ను అధీష్టించి ఉన్నాడనేది సత్యం. అది ఏడు ఆకాశాలపైన ఉన్నది. కొన్ని ప్రత్యేక సమయాల్లో మాత్రమే ఆయన మొదటి ఆకాశానికి వస్తాడు. అరఫా దినాన (జుల్ హిజ్జా 9వ తేదీన) ఆయన భూ ఆకాశానికి వస్తాడు. మహనీయ ముహమ్మద్ (సఅసం) వారు ప్రవచించిన దాని ప్రకారం రాత్రి మూడవ జామున కూడా అల్లాహ్ మొదటి ఆకాశంపైకి వస్తాడు. అయితే ఆ రావటమనేది ఆయన జ్ఞానానికనువుగా ఉంటుంది. ఈ స్థితి మన బుద్ధికి అందనిది. కాబట్టి ఎలా? ఏమిటి? అంటూ ఆ వైనం గురించి ప్రశ్నించటం, ఊహించటం, తమదైన శైలిలో వర్ణించటం తగదు.

ఇకపోతే ఆయన జ్ఞానం యావత్ సృష్టిని ఆవరించి ఉంది. అల్లాహ్ మనతో ఉన్నాడు అంటే అర్థం ఆ జ్ఞానపరంగానే కాని నిజంగానే అల్లాహ్ అస్తిత్వం మనవెంట ఉందని అర్థం ఎంతమాత్రం కాదు.

**"ఆయన్ని పోలిన వస్తువేదీ లేదు. ఆయన అంతా వినేవాడు, అన్నీ చూసేవాడు."** ***(ఖుర్‌ఆన్ 42 : 11)***

అల్లాహ్‌కు గల కనే (చూచే), వినే గుణాల గురించి పై వాక్యంలో తెలుపబడింది. అయితే ఆ చూసే శక్తి మన చూసేశక్తి లాంటిది కాదు.

https://teluguislam.net

ఆ వినేశక్తి మనలాంటి వినేశక్తి కాదు. అల్లాహ్ మాదిరిగా ఎవరూ కనలేరు, వినలేరనే విషయం దీనిద్వారా మనకు బోధపడుతోంది. కాబట్టి ఈ కనే, వినే వైనాన్ని మనం ఇతరులతో పోలుస్తూ కాకి లెక్కలు వేయ కూడదు.

మహోన్నతుడైన అల్లాహ్ ఈ విధంగా సెలవిచ్చాడు:

**"ఎవరినయితే నేను నా స్వహస్తాలతో సృష్టించానో....."**

***(ఖుర్ఆన్ 38 : 75)***

వేరొక చోట ఇలా సెలవీయబడింది:

**"వారి చేతులపై అల్లాహ్ చెయ్యి ఉంది."** ***(ఖుర్ఆన్ 48 : 10)***

అల్లాహ్‌కు చేతులున్నాయని పై వాక్యాల ద్వారా స్పష్టంగా అర్థమవు తోంది. అయితే ఆ చేతులు ఎలా ఉంటాయి? ఆయన చేయి ఇతరుల చేతులపై ఎలా ఉంటుంది? లాంటి ఊహాగానాలకు, పోలికలకు ఎంత మాత్రం తావులేదు.

–ఇదీ నిజ విశ్వాసుల నమ్మకం. దైవప్రవక్త నూహ్ నుండి ఇబ్రాహీం, మూసా, ఈసా (అలైహిస్సలాం) వరకూ, అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం) వరకూ – దైవప్రవక్తలందరూ దీన్నే విశ్వసించారు. కొంతమంది అల్లాహ్ అక్కడున్నాడు, ఇక్కడున్నాడు, సర్వత్రా ఉన్నాడని అంటుంటారు. ఈ భావన సరైందికాదు. పైగా ఈ భావన అపమార్గానికి దారితీస్తుంది. అల్లాహ్ స్వయంగా తాను సింహాసనాన్ని అధీష్టించి ఉన్నానని చెబుతున్న ప్పుడు దాన్ని మనం యధావిధిగా నమ్మాలి. అంతేగాని, దానికి మన సొంత భాష్యాలు జోడించకూడదు.

**'లా ఇలాహ ఇల్లల్లాహ్'** (అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దైవం లేదు) అనే భావంలో తౌహీద్‌లోని పై మూడు అంశాలు కూడా ఇమిడి ఉన్నాయి.

ఇక తిన్నటిమార్గంపై నడవగోరేవారు అంతిమ దైవప్రవక్త అయిన

https://teluguislam.net

ముహమ్మద్ (సఅసం)ను అనుసరించటం తప్పనిసరి. ఆరాధనపరమైన అల్లాహ్ ఏకత్వం (తౌహీదె ఉలూహియ్యత్)లో ఇది కూడా అంతర్భాగమే.

"ముహమ్మద్ (సఅసం) అల్లాహ్ సందేశహరుడన్న విషయాన్ని నేను ధృవపరుస్తున్నాను" అని మీరు అన్నారంటే దాని అంతరార్థం ఏమిటి? అల్లాహ్ ఆజ్ఞల తరువాత, అంటే అల్లాహ్‌గ్రంథమైన ఖుర్ఆన్ తరువాత మీకు అనుసరణీయులైన వారు ఎవరైనా ఉన్నారంటే వారు ముహమ్మద్ (సఅసం) మాత్రమే. ఖుర్ఆన్‌లోని అధ్యాయం–59, 7వ ఆయత్ ద్వారా గానీ, అధ్యాయం–3: 31వ ఆయత్ ద్వారా గానీ బోధపడే విషయం ఇదే కదా!

**(ఓ ప్రవక్తా!) ప్రజలకు చెప్పండి : "మీకు నిజంగానే అల్లాహ్ పట్ల ప్రేమ ఉంటే మీరు నన్ను అనుసరించండి. (తత్ఫలితంగా) అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు. మీ పాపాలను మన్నిస్తాడు.** ***(ఖుర్ఆన్ 3:31)***

**దైవ ప్రవక్త మీకు ఇచ్చిన దానిని (సంతోషంగా) పుచ్చుకోండి. ఆయన ఏ విషయం నుండైనా మిమ్మల్ని వారిస్తే, దాన్ని వదిలి పెట్టండి. అల్లాహ్‌కు భయపడుతూ ఉండండి.** ***(ఖుర్ఆన్ 59:7)***

## మోడల్ ప్రశ్నలు

1) ఇస్లాం ధర్మానికి పునాది ఏది?
2) తౌహీద్ అంటే ఏమిటి?
3) తౌహీద్ రుబూబియ్యత్‌ను వివరించండి?
4) తౌహీద్ ఉలూహియ్యత్, తౌహీద్ అస్మా వ సిఫ్ఫాత్ గురించి వ్రాయండి?

https://teluguislam.net

## 14వ పాఠం

## ఆరాధనలో అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించటం (షిర్క్)

అల్లాహ్‌కు మాత్రమే ప్రత్యేకమైన విషయాలలో వేరితరులను సహ వర్తులుగా, భాగస్వాములుగా చేర్చటాన్ని 'షిర్క్' అంటారు. షిర్క్ రెండు రకాలు:

1) పెద్ద తరహా షిర్క్ (షిర్కె అక్బర్)

2) చిన్న తరహా షిర్క్ (షిర్కె అస్గర్)

### 1. పెద్ద తరహా షిర్క్

ప్రవక్తలను, పుణ్యపురుషులను (వలీలను), సజీవులను, నిర్జీవులను, చలనము ఉన్న వస్తువులను, చలనములేని వస్తువులను, ఇతరత్రా వాటిని అల్లాహ్‌కు భాగస్వాములుగా కల్పించటాన్నే పెద్ద తరహా షిర్క్ అంటారు. ఇది ఘోరాతిఘోరమైన నేరం. మహాపరాధం. అన్యాయం. అతిపెద్ద దుర్మార్గం. దారుణం. అల్లాహ్ ఒకే ఒక్కడని, ఆయన సాటిలేని మేటి అని తెలిసిన తరువాత కూడా ఆయనకు సహవర్తుల్ని కల్పించేవారు ఆయన ఆగ్రహానికి గురవుతారనీ, అలాంటివారు ఎన్ని సత్కార్యాలు చేసినా అల్లాహ్ సన్నిధిలో అవన్నీ వృధా అయిపోతాయని, వారు శాశ్వతంగా నరకానికి ఆహుతి కావలసిందేనని దివ్య ఖుర్‌ఆన్‌లో స్పష్టంగా చెప్ప బడింది. ఉదాహరణకు:

ఈ ఆయతులను గమనించండి-

**"ఒకవేళ వీరు (దీనికి ముందు ఆయతులో ప్రస్తావించబడిన 18 మంది ప్రవక్తలు) సయితం దైవత్వంలో భాగస్వామ్యానికి**

https://teluguislam.net

**(షిర్క్‌కి) ఒడిగట్టి ఉంటే, వారు చేసుకున్న కర్మలన్నీ వృధా అయిపోయేవి.” *(ఖుర్‌ఆన్ 6 : 88)***

**“ముష్రిక్కులు (ఒకవైపు) తాము స్వయంగా తమ అవిశ్వాసాన్ని గురించి సాక్ష్యమిస్తున్నప్పుడు వారు అల్లాహ్ మస్జిదుల నిర్వహణకు ఎంతమాత్రం తగరు. వారి కర్మలన్నీ వృధా అయిపోయాయి, శాశ్వతంగా వారు నరకాగ్నిలో ఉంటారు.” *(ఖుర్‌ఆన్ 9 : 17)***

షిర్క్ చేస్తున్న స్థితిలో చనిపోయిన వారిని క్షమించటంగానీ, వారికి స్వర్గంలో ప్రవేశం కల్పించటంగానీ జరగదు. అల్లాహ్ ఆదేశం ఇలా వుంది:

**“తనకు భాగస్వామ్యం (షిర్క్) కల్పించటాన్ని అల్లాహ్ ఎట్టి పరిస్థితిలోనూ క్షమించడు. షిర్క్ మినహా తాను కోరిన వారి ఇతర పాపాలను క్షమిస్తాడు.” *(ఖుర్‌ఆన్ 4 : 116)***

వేరొక సందర్భంలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

**“ఎవరు అల్లాహ్‌కు సహవర్తులుగా ఇతరులను కల్పించారో అలాంటి వారికోసం అల్లాహ్ స్వర్గాన్ని నిషేధించాడని తెలుసు కోండి. అలాంటివారి నివాసం నరకాగ్ని. దుర్మార్గులకు సహాయ పడే వారెవ్వరూ ఉండరు.” *(ఖుర్‌ఆన్ 5 : 72)***

చనిపోయిన వారిని, విగ్రహాలను సహాయం కొరకు అర్థించటం, వారి ముందు మొక్కుకోవటం, వారి పేరిట పశువులను బలి ఇవ్వటం- ఇలాంటివన్నీ ఈ రకమైన షిర్క్ క్రిందికి వస్తాయి.

## 2 చిన్న తరహా షిర్క్

ఈ రకమైన షిర్క్ (షిర్కె అస్‌గర్) కూడా ఉంటుందని ఖుర్‌ఆన్

https://teluguislam.net

హదీసుల ద్వారా రూఢీ అవుతున్నది. అయితే ఇది పెద్ద తరహా షిర్క్ వంటిది కాదు. కొన్ని పనుల్లో కాపట్యతను ప్రదర్శించటం, అల్లాహ్ తప్ప ఇతరులపై ప్రమాణం చేయటం, "అల్లాహ్ తలచినది, ఫలానా వారు తలచినది" అంటూ అల్లాహ్‌ను, ఇతరులను సమానులుగా చేస్తూ మాట్లాడటం మొదలగునవన్నీ చిన్న తరహా షిర్క్‌కు ఉదాహరణలు.

మహ్మూద్ బిన్ లబీద్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సఅసం), "నేను మీ విషయంలో ఎక్కువగా భయపడేది చిన్న తరహా షిర్క్ గురించే" అని అన్నారు. అందుకు అక్కడున్నవారు, 'చిన్న తరహా షిర్క్ అంటే ఏమిటి?' అని అడిగారు. "ప్రదర్శనాతత్వం (అంటే చుట్టుప్రక్కలవారు తన పుణ్యకార్యాలను చూసి మెచ్చుకోవాలన్న కాంక్ష)" అని ఆయన సమాధానమిచ్చారు. *(అహ్మద్, తబ్రానీ, బైహఖీ)*

ఇబ్నె ఉమర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సఅసం) ఇలా ప్రవచించారు: "అల్లాహ్ మీద కాకుండా వేరితరుల మీద ప్రమాణం చేసేవాడు అవిశ్వాసం (కుఫ్ర్) లేదా బహుదైవారాధన (షిర్క్)కు లోనైనట్లే." *(అబూదాబూద్, తిర్మిజీ)*

హుజైఫా బిన్ యమాన్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రబోధించారు: 'అల్లాహ్ తలచేది, ఫలానావారు తలచేది' అని (అల్లాహ్‌ను, ఇతరులను సమానంగా చేస్తూ) మాట్లాడకండి. అలా గాకుండా 'అల్లాహ్ తలచేది, ఆ తర్వాత ఫలానా వారు తలచేది' అని చెప్పండి. (అబూదావూద్)

ఈ రకమయిన షిర్క్ శాశ్వతంగా నరకాగ్నికి ఆహుతి చేయదుగాని ఇది మనిషిని అల్లాహ్ ఏకత్వం (తౌహీద్) నుండి దూరం చేసే ప్రమాదం ఉంది.

https://teluguislam.net

## కానరాని షిర్క్ (దాగివున్న షిర్క్)

ఒక రకంగా ఇది కృత్రిమమైనది. అవకాశవాదంతో కూడుకున్నది. ఇది ఒక్కోసారి మనిషిని పెద్ద షిర్క్ (షిర్కె అక్బర్)కు లోను చేస్తే ఒక్కోసారి చిన్న షిర్క్ (షిర్కె అస్గర్)కు గురి చేస్తూ ఉంటుంది. మరీ ముఖ్యంగా ఇది పెద్ద షిర్క్‌లో పడవేస్తూ ఉంటుంది. ఎందుకంటే ఇది ఎదుటి వారిని మోసగించే ఉద్దేశ్యంతో చేసే చేష్ట. తద్వారా వారు ఆత్మతృప్తికై వింత నాటకమాడతారు. ఉదాహరణకు: కపటులు, వారు తమ బూటకపు విశ్వాసము (కుఫ్ర్)ను కప్పి పుచ్చుకోవటానికి, ముస్లిములుగా నటిస్తారు.

ఈ 'కనిపించని షిర్క్' ప్రదర్శనాతత్వం (రియా) లాంటి చిన్న తరహా షిర్క్‌గా కూడా రూపాంతరం చెందుతూ ఉంటుంది. ఇంతకు ముందు ప్రస్తావించబడిన మహ్మూద్ బిన్ లబీద్ ఉల్లేఖనం ద్వారా కూడా ఈ సంగతి నిజమని రూఢీ అవుతోంది.

అబూ సయీద్ ఖుద్రీ(రజి)కథనం ప్రకారం, మహా ప్రవక్త ముహమ్మద్ (సఅసం) వేరొక సందర్భంలో, "నాకు మీ విషయంలో 'కపటాగ్రేసరుడైన మెస్సయ్య' (మసీహుద్దజ్జాల్) పీడన కన్నా ఎక్కువ ఆందోళన కలిగించే పీడన ఏదో తెలుపనా!?" అన్నారు. 'తప్పకుండా తెలుపండి ఓ దైవప్రవక్తా (స)' అన్నారు ప్రియసహచరులు. అప్పుడాయన(స) ఇలా తెలిపారు: "అదే షిర్కె ఖఫీ (దాగివుండే షిర్క్). 'ఎవరయినా ఒక వ్యక్తి నమాజుకై ఉపక్రమించినపుడు, తన నమాజును చూస్తున్న ప్రజలకు అందమైనదిగా ప్రదర్శించే ఉద్దేశంతో మరింత ఆడంబరానికి పోవటం." (ముస్నదె అహ్మద్)

ఇటువంటి హానికరమైన పోకడల నుంచి అల్లాహ్ మనల్ని రక్షించు గాక! (ఆమీన్).

https://teluguislam.net

## మోడల్ ప్రశ్నలు

1) పెద్ద తరహా షిర్క్ గురించి తెల్పండి?
2) చిన్న తరహా షిర్క్‌ను వివరించండి?
3) కానరాని షిర్క్ గురించి వ్రాయండి?

### ఖాళీలు

1) అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించటాన్ని ...... అంటారు.
2) ప్రదర్శనాతత్వం కలిగి యుండటాన్ని......... అంటారు.
3) ........ల వ్యవహారంలో అలసత్వం క్షమార్హం కాదు.

## జతపరచండి

| | | | |
|---|---|---|---|
| 1) | సజీవులను, నిర్జీవును అల్లాహ్‌కు భాగస్వాములగా చేయటం | (   ) | పరలోకంలో క్షమించడం జరుగదు. |
| 2) | షిర్క్ చేస్తున్న స్థితిలో చనిపోయిన వారిని | (   ) | అవకాశవాదంతో కూడుకున్నది |
| 3) | షిర్క్ మానవుణ్ణి చివరికి | (   ) | అవిశ్వాసం, లేదా బహు దైవారాధనకు లోనయినట్లే |
| 4) | కానిరాని షిర్క్ | (   ) | పెద్ద తరహా షిర్క్ |
| 5) | అల్లాహ్ మీద కాకుండా ఇతరుల మీద ప్రమాణం చేసేవాడు. | (   ) | నరకాగ్నికి గురి చేస్తుంది |

https://teluguislam.net

# 15వ పాఠం కీడు నుండి రక్షణకై తాయెత్తులు, కడియాలు, రక్షరేకులు ధరించటం

మహోన్నతుడైన అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

**(ఓ ప్రవక్తా ముహమ్మద్!) ఆకాశాలను, భూమినీ సృష్టించినది ఎవరు? అని నువ్వు గనక వారిని (మక్కా బహుదైవారాధకులను) అడిగితే, "అల్లాహ్" అని వారు తప్పకుండా చెబుతారు. వారితో చెప్పు: "సరే! చూడండి. మీరు అల్లాహ్‌ను వదలి ఎవరెవరిని పిలుస్తున్నారో వారు, అల్లాహ్ మీకేదన్నా కీడు చెయ్యదలిస్తే, ఆ కీడును తొలగించగలరా? పోనీ, అల్లాహ్ నన్ను కటాక్షించదలిస్తే, వారు ఆయన కృపను అడ్డుకోగలరా?" ఇలా అను: "నాకు అల్లాహ్ చాలు. నమ్మేవారు ఆయన్నే నమ్ముకుంటారు."** ***(ఖుర్‌ఆన్ 39 : 38)***

ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి) కథనం: "దైవప్రవక్త (సఅసం) ఒకసారి, తన చేతికి ఇత్తడి కడియాన్ని ధరించి, తన దగ్గరకు వచ్చిన ఒక వ్యక్తిని చూసి 'ఏమిటిది?' అని అడిగారు. దానికావ్యక్తి, 'బలహీనత (వాహినా) కారణంగా దీన్ని తొడిగాన'ని అన్నాడు. అప్పుడాయన (స), "దీనిని తీసెయ్యి దీనివల్ల (నీకెలాంటి లాభం కలగదు సరికదా) నీ బలహీనత మరింత పెరుగుతుంది. అది తొడిగి ఉండి నువ్వు గనక మరణిస్తే నువ్వు సాఫల్యం (మోక్షం) పొందలేవు' అని ఉద్బోధించారు." (ముస్నదె అహ్మద్– ప్రామాణిక పరంపరతో అందిన హదీసు)

ఉఖ్బా బిన్ ఆమిర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సఅసం) ఇలా ప్రవచించారు: "తాయెత్తులు ధరించేవారి కార్యములను అల్లాహ్ నెరవేర్చకుండుగాక! సముద్రపు శంఖ (గవ్వ)లను మాలగా వ్రేలాడదీసు కునే వారికి సుఖశాంతులు ప్రాప్తించకుండుగాక!!" (ముస్నదె అహ్మద్)

https://teluguislam.net

వేరొక హదీసులో దైవప్రవక్త (సఅసం) ఇలా చెప్పారు: "తాయెత్తు వ్రేలాడదీసేవాడు షిర్క్ (బహుదైవోపాసన)కు ఒడిగట్టినట్లే."

(ముస్నదె అహ్మద్)

హుజైఫా (రజి) గారి గురించి ఇబ్నె అబీ హాతిం ఇలా ఉల్లేఖించారు: "ఒక వ్యక్తి అనారోగ్యం కారణంగా తన చేతికి దారం చుట్టుకుని ఉండటం చూసి ఆయన (హుజైఫా) దాన్ని త్రెంచేసి ఈ ఆయత్ పఠించారు–

**"వారిలో చాలామంది అల్లాహ్‌ను విశ్వసిస్తూ కూడా ఆయనతో పాటు ఇతరులను భాగస్వాములుగా నిలబెడుతున్నారు"**

***(ఖుర్ఆన్ 12 : 106)***

## ఈ పాఠంలోని ముఖ్యాంశాలు

- కీడు నుంచి రక్షణ పొందటానికి కడియాలు, దారాలు, తాయెత్తులు తొడగటం ముమ్మాటికీ నిషిద్ధం.
- ఒకవేళ దైవప్రవక్త సహచరులు (సహాబా) అయినా సరే వాటిని తొడిగిన స్థితిలో మరణం సంభవిస్తే వారు కూడా మోక్షం పొంద జాలరు. ఆ విషయం వారికి తెలుసు కాబట్టి వారు ఏనాడూ అలాంటి తప్పులు చేయలేదు. "చిన్న షిర్క్ పెద్ద పాపాల (కబాయిర్) కన్నా కూడా ఘోరమైనది" అన్న ప్రవక్త సహచరుల మాటను ఈ విషయం మరింత బలపరుస్తోంది.
- ఈ వ్యవహారంలో అజాగ్రత్త, అలసత్వం క్షమార్హం కాదు.
- ఈ రకమయిన వస్తువులు ధరించటం వల్ల ప్రాపంచిక జీవితంలోనూ ఎలాంటి లాభం కలగదు సరికదా మరింత నష్టం (కీడు) వాటిల్లు తుంది. ఎందుకంటే, "ఇది నీ బలహీనతను మరింత పెంచుతుంది" అని దైవప్రవక్త (స) చెప్పనే చెప్పారు.
- ఎవరైనా ఇలాంటి వెకిలిచేష్టలకు పాల్పడితే వారినిగట్టిగా

https://teluguislam.net

వారించాలి.

- ఇలాంటి వస్తువును వ్రేలాడదీసినవాడు దానికే అప్పగించబడతాడు. అంటే అలాంటివారిని రక్షించే బాధ్యత అల్లాహ్ తీసుకోడు.
- తాయెత్తులు, దారపు పోగులు ధరించినవాడు ఖచ్చితంగా షిర్క్‌కు పాల్పడినట్లే.
- హుజైఫా (రజి) పఠించిన ఖుర్‌ఆన్ సూక్తిని బట్టి ప్రవక్త సహచరులు పెద్ద షిర్క్‌కు ఉద్దేశించిన సూక్తిని చిన్న తరహా షిర్క్‌ను ఖండించటానికి కూడా పఠించేవారన్న దానికి స్పష్టమైన ఆధారం లభిస్తోంది. ఇబ్నె అబ్బాస్ (రజి) గారు సయితం అల్ బఖర సూరాలోని ఆయతు (2:165)ను పఠించి ఉన్నారు.
- జ్వరం నుంచి ఉపశమనానికి, దిష్టి నుంచి విరుగుడుకు గాను తాయెత్తులు, రక్షరేకులు వాడటం కూడా షిర్క్ క్రిందికే వస్తుంది. వాటికి బదులు ఖుర్‌ఆన్ ఆయతులు, ప్రవక్త (స) దుఆలు పఠించటం ఉత్తమం, శ్రేయస్కరం.
- తాయెత్తులు, రక్షరేకులు ధరించేవారు శపించదగినవారు. వారి తలంపులను అల్లాహ్ పూర్తి చేయడు. గవ్వలు ధరించే వారికి సుఖ సౌఖ్యాలు కూడా ప్రాప్తించవు. ఎందుకంటే అల్లాహ్ అలాంటి వాళ్ళను రక్షించకుండా వాళ్ళ మానాన వదలివేస్తాడు. అల్లాహ్ వదలివేసిన వారిని మరెవరూ రక్షించలేరు.

## మోడల్ ప్రశ్నలు

1) తాయెత్తుల గురించి ప్రవక్తగారు ఏమన్నారు?
2) జ్వరం, దిష్టి మొదలగు వాటి విరుగుడు గురించి ఉత్తమ మార్గం ఏది?
3) తాయెత్తులు ధరించడం ఎంత పెద్ద పాపం? అది షిర్క్‌లోని ఏ కోవకు చెందుతుంది.

https://teluguislam.net

16వ పాఠం

# మంత్రించి ఊదటం, తాయెత్తులు వాడటం నిషిద్ధం

అబూ బషీర్ అన్సారీ (రజి) కథనం: ఒకసారి దైవప్రవక్త (సఅసం) వారి ప్రయాణంలో నేను వారివెంట ఉన్నాను. దైవప్రవక్త (స) చాటింపు వేసే ఒక వ్యక్తిని పంపించి ఈ విధంగా చాటింపు వేయించారు: "ఏ ఒంటె మెడలో కూడా (దిష్టి నివారణ కోసం) కట్టబడిన ఏ వస్తువూ ఉండకూడదు. ఒకవేళ ఉంటే తక్షణం త్రెంచివేయాలి." (బుఖారీ ముస్లిం)

అబ్దుల్లాహ్ బిన్ మస్వూద్ (రజి) కథనం:

"రుఖా (మంత్రించి ఊదటం), తమాయిమ్ (దిష్టి నివారణకై ఉపయోగించే తాయెత్తులు, త్రాళ్ళు), తివలహ్ (ఆలుమగల మధ్య ప్రేమానురాగాల పెంపుదలకై తొడిగే వస్తువులు)– ఇవన్నీ షిర్క్‌గానే పరిగణించబడతాయని దైవప్రవక్త (స) చెప్పగా నేను విన్నాను" (ముస్నదె అహ్మద్, అబూదావూద్)

**అర్రుఖా:** మంత్రాలు మొదలగువాటిని ఉచ్చరించటాన్ని అర్రుఖా అంటారు. మంత్రోచ్చారణలోని పదాల్లో గాని, దాని భావంలోగాని 'షిర్క్' లేని పక్షంలో అది సమ్మతమే. విషపురుగులు కాటు వేసినప్పుడు, దిష్టికి గురైనప్పుడు దైవప్రవక్త (స) 'రుఖా'కు అనుమతి ఇచ్చారు.

**తమాయిమ్:** దిష్టి నుంచి కాపాడటానికి పసిపిల్లల మెడల్లో వేసే తాయెత్తుల్ని తమాయిమ్ అంటారు. తాయెత్తులో గనక ఖుర్‌ఆన్ వాక్యాలు గాని, అల్లాహ్ పేరుగాని లేక అల్లాహ్ గుణవిశేషం గాని రాసి వుంటే దానిని తొడగవచ్చని 'సలఫ్' (తొలితరాల నికార్సయిన ముస్లింల)లోని కొంతమంది అభిప్రాయపడ్డారు. అయితే అత్యధికమంది దీనిని అసహ్యించుకున్నారు. దీనిని అసహ్యకరంగా భావించినవారిలో ఇబ్నె మస్వూద్ (రజి) కూడా ఉన్నారు.

https://teluguislam.net

**తివలహ్:** భార్యాభర్తల మధ్య ప్రేమానురాగాలు పుట్టించగలమని కొందరు ఇలాంటి తాయెత్తులు, దారాలు కడుతూ ఉంటారు.

అబ్దుల్లాహ్ బిన్ ఉకైమ్ ద్వారా ఉటంకించబడిన మర్ఫూ హదీసు ప్రకారం "ఎవరైనా ఏదన్నా వస్తువునుగానీ, తాయెత్తునుగానీ ధరించినట్లైతే అతను దానికే అప్పగించబడతాడు" (ముస్నదె అహ్మద్, సునన్ తిర్మిజీ)

దైవప్రవక్త (సఅసం) తనతో ఇలా చెప్పారని రువైఫీ (రజి) తెలిపారు: "ఓ రువైఫీ! నా తదనంతరం నువ్వు చాలాకాలం వరకు జీవించి ఉంటా వేమో! కాబట్టి నువ్వు జనులకు తెలియజెయ్యి – ఎవరయితే గడ్డంలో ముడులు వేసుకుంటారో, హారాలు, దారపు పోగులు చుట్టుకుంటారో, (మలమూత్ర విసర్జనానంతరం) శుద్ధి కొరకు పశువుల ఎండిన పేడను లేక ఎముకను ఉపయోగిస్తాడో అతనితో ముహమ్మద్ (స)కు ఎటువంటి సంబంధంలేదు." (అహ్మద్)

సయీద్ బిన్ జుబైర్ (రజి) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సఅసం) ఇలా ఉపదేశించారు: "తాయెత్తు (లేక అటువంటిదే మరేదన్నా త్రాడును) ధరించిన వ్యక్తి నుంచి దానిని తీసివేయించిన వానికి ఒక బానిసకు విముక్తినిచ్చిన పుణ్యం లభిస్తుంది."

వకీ (రహ్మాలై) కథనం: మహా విద్వాంసులు ఇబ్రాహీం నఖయీ (రహ్మాలై) అన్ని రకాల తాయెత్తులను – చివరికి అవి ఖుర్ఆన్ ఆయతులతో కూడిన తాయెత్తులైనా, మరే రకమైన తాయెత్తులయినా సరే– ధరించటాన్ని అసహ్యించుకునేవారు." (వకీ మరియు ఇబ్రాహీం నఖయి–రహ్మాలై– ఇరువురూ ఇబ్నె మస్వూద్ (రజి) గారి శిష్యులు).

## ఈ పాఠంలోని ప్రధానాంశం

పైన పేర్కొనబడిన మూడు రకాల చర్యలు షిర్క్ క్రిందికి వస్తాయి. అంటే (1) రుఖా (2) తమాయిమ్ (3) తివలహ్ – ఇవి మూడు కూడా బహుదైవారాధనగానే పరిగణించబడతాయి.

https://teluguislam.net

# 17వ పాఠం

# చెట్టు పుట్ట, రాయి రప్పల ద్వారా శుభాన్ని ఆశించటం

అల్లాహ్ తన గ్రంథమైన ఖుర్‌ఆన్‌లో ఈ విధంగా సెలవిచ్చాడు:

**“ఏమిటీ, మీరు లాత్, ఉజ్జాలను గాని చూశారా? మూడవది, చివరిది అయిన (అరబ్బుల ఆరాధ్య దైవం) మనాతును (కూడా చూశారా?)………”** ***(ఖుర్‌ఆన్ 53 : 19, 20)***

అరబ్బు బహుదైవారాధకులకు హెచ్చరికగా ఈ మాటలనబడ్డాయి. అరబ్బు ద్వీపంలో ఖ్యాతి గడించిన మూడు దేవతల పేర్లు ఇవి. **మొదటిది,** ‘లాత్’. అరబ్బు పూజారులు తమ మెడలను ఆ దేవతా విగ్రహం వైపుకు త్రిప్పేవారు. దాని చుట్టూ ప్రదక్షిణ చేసేవారు. **రెండవది,** ‘ఉజ్జా’. ‘గిత్ఫాన్’ ప్రాంతంలో ‘ఉజ్జా’ అనే ఒక వృక్షం ఉండేది. జనులు దాన్ని పూజించేవారు. దాన్ని మొక్కుకునేవారు. ముఖ్యంగా ఖురైషు, కినానా తెగవారు దీన్ని కొలిచేవారు.

**మూడవది,** ‘మనాత్’. ఈ దేవత మెప్పు పొందటం కోసం జనులు దాని ముందు జంతు బలి ఇచ్చి రక్తం ప్రవహింపజేసేవారు. ఈ విగ్రహం మక్కా – మదీనా ప్రాంతాల మధ్య ఉండేది (ఫత్‌హుల్ ఖదీర్). బనూ ఖుజాఆ తెగవారి ప్రత్యేక దేవత ఇది. అజ్ఞాన కాలంలో ఔస్, ఖజ్రజ్ తెగలవారు హజ్ యాత్రకు వెళ్ళినప్పుడు ఈ స్థలం (విగ్రహం) వద్దనే ‘ఇహ్రామ్’ (దీక్ష) బూనేవారు. ఆ విగ్రహం చుట్టూ వారు ప్రదక్షిణ కూడా చేసేవారు. (ఇబ్నె కసీర్, ఐసరుత్తఫాసీర్).

ఇవిగాక ఆ పరిసర ప్రాంతాల్లో మరికొన్ని చిట్టిపొట్టి దేవుళ్ళ బొమ్మలు,

https://teluguislam.net

దేవాలయాలు కూడా ఉండేవి. మక్కా విజయం తరువాత మహాప్రవక్త (సఅసం) ఈ విగ్రహాలను, విగ్రహారాధనాలయాలను నిర్మూలించారు. విగ్రహాలపై వెలసిన గుమ్మటాలను, పక్కా నిర్మాణాలను కూడా నేలమట్టం చేశారు. పూజా పునస్కారాలకు కేంద్రాలుగా మారిన చెట్లను కూడా నరికించివేశారు. విగ్రహారాధనకు ప్రతిరూపాలుగా ఉన్న ఇతరత్రా చిహ్నాలను కూడా రూపుమాపారు.

అబూ వాఖిద్ లైసీ (రజి) కథనం: “మేము దైవ ప్రవక్త (సఅసం)తో కలిసి హునైన్ యుద్ధానికి వెళుతున్నాము. మేము అప్పుడప్పుడే అవిశ్వాస స్థితి నుంచి ఇస్లాం వైపు మరలిన వాళ్ళం. ఆ కాలంలో ఒక రేగిచెట్టు ఉండేది. బహుదైవారాధకులు ఆ చెట్టును ప్రార్థించేవారు. తమ ఆయు ధాలను ఆ చెట్టుకు వ్రేలాడదీసేవారు. ఆ చెట్టు ‘జాతు అన్వాత్’గా పిలువబడేది.

మేము ప్రయాణంలో ఒక రేగి చెట్టును సమీపించాము. అప్పుడు మేము, ‘ఓ దైవప్రవక్తా (స)! బహుదైవారాధకులకు శుభం పొందేందుకు జాతె అన్వాత్ ఉన్నట్లే మా కోసం కూడా ఒక ‘జాతె అన్వాత్’ని నిర్ధారించండి’ అన్నాము. సమాధానంగా దైవప్రవక్త (సఅసం) ఇలా అన్నారు (ఆశ్చర్యంగా): “అల్లాహు అక్బర్! (అల్లాహ్ అందరికన్నా గొప్పవాడు). ఎవరి చేతిలో నా ప్రాణముందో ఆ శక్తిమంతుని సాక్షిగా చెబుతున్నా. ఇవన్నీ పూర్వీకుల పోకడలు! ప్రవక్త మూసా (అలైహిస్సలాం)ను ఆయన అనుచరులైన ఇస్రాయీల్ సంతతివారు కోరిందే (ఈనాడు) మీరూ కోరుతున్నారు – ‘ఓ మూసా! వారికి ఏ విధంగా దేవుళ్లు ఉన్నారో అదే విధంగా మాకూ ఒక దైవాన్ని (విగ్రహాన్ని) కల్పించు’ అని (గతంలో) వారు కోరివున్నారు. అప్పుడు మూసా (అలైహి), ‘నిజంగానే మీరు మూర్ఖజనులు’ అని నొచ్చుకున్నారు.

(ఆ తరువాత) దైవప్రవక్త (సఅసం), "మీరు కూడా మీకు పూర్వం గతించిన వారి అడుగుజాడల్లో నడుస్తారు" అని చెప్పారు. (తిర్మిజీ – ప్రామాణిక హదీసు)

## ఈ పాఠంలోని ప్రధానాంశాలు

- ఇస్లాంలో అప్పుడప్పుడే ప్రవేశించిన నూతన ముస్లిం సహచరులు 'జాతె అన్వాత్' లాంటిది మరేదన్నా శుభం కోసం నిర్ధారించమని విన్నవించుకున్నప్పుడు మహాప్రవక్త (సఅసం) ఆశ్చర్యంతోపాటు ఆవేదన కూడా చెందారు. అందుకే ఆయన (స), "అల్లాహు అక్బర్! ఇవి గత జాతుల పోకడలయ్యా!" అని మందలించారు – ఇది గమనార్హ విషయం.
- ఈ విధంగా చెట్టు నుండి శుభం ఆశించటం షిర్క్ క్రిందికి వస్తుందన్న సంగతి ఆ నవముస్లిం సహాబీలకు తెలీదు. అందుకే వారలా కోరారు.
- దైవప్రవక్త సహచరులే అజ్ఞానం చేత షిర్క్ కార్యాలకు ఒడిగట్టే అవకాశం వున్నప్పుడు తర్వాతి తరాల వారికి ఆ ప్రమాదం ఇంకా ఎక్కువ ఉంటుంది.
- **షిర్క్ రెండు రకాలు :** (1) చిన్న షిర్క్ (2) పెద్ద షిర్క్.
- ప్రవక్త ప్రియసహచరులు తమకు తెలియని విషయంపై సందేహ పడ్డారేగాని, దానిని అమలు పరచలేదు. "అలా చేయకూడదు" అని చెప్పిన తరువాత దాన్ని పూర్తిగా మానుకున్నారు.
- షిర్క్‌కు దారితీసే దారుల్ని మూసేయాలి. అజ్ఞానం చేత అవిశ్వాస పోకడలను అనుసరిస్తున్నవారిని జాగరూకపరచి అడ్డుకోవాలి.

https://teluguislam.net

- దైవప్రవక్త (స) తన సహచరులకు విషయాన్ని విడమరచి చెబుతున్నప్పుడు, "ఇవి గతించిన వారి పద్ధతులు" అని సర్వసాధారణ రీతిలో బోధించటం గమనించదగినది.
- అల్లాహ్ ఖుర్ఆన్ గ్రంథంలో యూదుల, క్రైస్తవుల ఏ ఏ పోకడలను గురించి హెచ్చరించాడో వాటిపట్ల మనం కూడా జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే ఆ చేష్టలు మనకు కూడా వ్యతిరేకంగా పరిణమిస్తాయి.
- చెడు భావాల నుండి సవ్యమైన భావాల వైపునకు, చెడు వాతావరణం నుండి శుభప్రదమైన వ్యవస్థ వైపునకు కొత్తగా మరలి వచ్చిన వారిలో కొన్ని పాత అలవాట్లు ఉంటాయి. అలాంటి వారు ప్రతి విషయాన్ని జాగ్రత్తగా పసిగట్టి, దిద్దుబాటలో ముందుకు సాగాలి.

## మోడల్ ప్రశ్నలు

1) అగ్రుఖా, తమాయిమ్, మరియు తివలహ్ పదాలను వివరించండి?
2) 'జాతు అన్వాత్' సంఘటనను వివరించండి?
3) మూసా ప్రవక్త తన అనుచరుల పట్ల ఎందుకు నొచ్చుకున్నారు?
4) అరబ్బు బహుదైవారాధకులు వారు సృష్టించుకున్న దేవతలను ఏ విధంగా కొలిచేవారు?

https://teluguislam.net

18వ పాఠం

# దైవేతరుల పేర జంతు బలి

పరమ ప్రభువు అల్లాహ్ ఇలా ఆదేశించాడు:

**(ఓ ప్రవక్తా!) ఈ విధంగా ప్రకటించు: "నిస్సందేహంగా నా నమాజ్, నా ఖుర్బానీ, నా జీవనం, నా మరణం – ఇవన్నీ సర్వ లోకాల ప్రభువైన అల్లాహ్ కొరకే. ఆయనకు భాగస్వాములెవరూ లేరు. దీని గురించే నాకు ఆజ్ఞాపించబడింది. ఆజ్ఞాపాలన చేసే వారిలో నేను మొదటివాడను.** ***(ఖుర్ఆన్ 6 : 162, 163)***

మరో చోట ఇలా చెప్పబడింది:

**"నువ్వు నీ ప్రభువు కోసమే నమాజు చెయ్యి. ఖుర్బానీ ఇవ్వు."** ***(ఖుర్ఆన్ 108 : 2)***

మహనీయ ముహమ్మద్ (సఅసం) తనకు నాలుగు (అల్లాహ్) తీర్పులు వినిపించారని అలీ బిన్ అబూ తాలిబ్ (రజి) చెప్పారు:

1) **"లఅనల్లాహు మన్ జబహ లిగైరిల్లాహ్"** (అల్లాహ్ తప్ప ఇతరుల పేరు మీద జంతుబలి ఇచ్చేవారిపై అల్లాహ్ శాపం పడుతుంది).

   **గమనిక:** రబీవుల్ అవ్వల్ మాసంలో 11వ తేదిన షేఖ్ అబ్దుల్ ఖాదిర్ జీలానీ (రహ్మాలై) పేరు మీద, ఆయన సామీప్యం కోసం మేకలను జిబహ్ చేయటాన్ని ఇందుకు ఉదాహరణగా పేర్కొనవచ్చు.

2) తమ తల్లిదండ్రులను శపించేవారు స్వయంగా అల్లాహ్ శాపానికి గురవుతారు.

3) ధర్మంలో లేని విషయాలను కల్పించేవారికి (బిద్అతీలకు) ఆశ్రయ మిచ్చిన వారిపై అల్లాహ్ శాపం పడుతుంది.

https://teluguislam.net

4) భూమి సరిహద్దులను తారుమారు చేసేవారిపై అల్లాహ్ శాపం పడుతుంది. (సహీహ్ ముస్లిం)

దైవప్రవక్త (సఅసం) చెప్పారని తారిఖ్ బిన్ షిహాబ్ (రజి) తెలియజేశారు. "ఒక వ్యక్తి ఈగ మూలంగా స్వర్గంలో ప్రవేశించాడు. మరొక వ్యక్తి ఈగ మూలంగానే నరకానికి వెళ్ళాడు." 'అదెట్లా ఓ దైవప్రవక్తా!' అని సహచరులు సందేహపడగా, ఆయన (స) ఇలా సమాధానమిచ్చారు: "ఇద్దరు వ్యక్తులు ఒక ప్రదేశం మీదుగా ప్రయాణం సాగించారు. అక్కడి ప్రజలు తమ విగ్రహానికి ఏదో ఒక వస్తువును సమర్పించుకునే వరకూ ఆ మార్గం గుండా ఎవరినీ వెళ్ళనిచ్చేవారు కాదు. వారు ఆ ప్రయాణీకులలో ఒకరిని నైవేద్యం కొరకు పురికొల్పారు. 'అర్పించుకోవటానికి నా దగ్గర ఏమీలేద'ని ఆ వ్యక్తి అన్నాడు. 'ఏదో ఒకటి అర్పించుకో. ఆఖరికి ఒక ఈగ అయినా సరే' అని స్థానికులు కోరారు. అతను ఒక ఈగను ఆ విగ్రహానికి సమర్పించుకున్నాడు. దాంతో వారు ఆ వ్యక్తిని విడిచిపెట్టారు. ఆ విధంగా ఆ వ్యక్తి ఈగ మూలంగా నరకానికి పోయాడు. 'నువ్వు కూడా ఏదో ఒకటి సమర్పించుకో' అని వారు రెండవ వ్యక్తిని కూడా పురమాయించారు. 'నేను ఒక్కడైన అల్లాహ్‌కు తప్ప వేరెవరికీ, ఏదీ సమర్పించనుగాక సమర్పించను' అని అతను తెగేసి చెప్పాడు. అందువల్ల వారు అతని మెడనరికి చంపేశారు. తత్ఫలితంగా ఆ వ్యక్తి స్వర్గంలో ప్రవేశించాడు." (ముస్నదె అహ్మద్)

## ఈ పాఠంలోని ప్రధానాంశాలు

- అల్లాహ్ తప్ప వేరితరుల పేర జంతుబలి (ఖుర్బానీ) సమర్పించుకునే వారు ధూత్కరించబడ్డారు.
- తమ తల్లిదండ్రులను దూషించేవాడు కూడా శాపగ్రస్తుడే. సాధార

https://teluguislam.net

ణంగా ఎవరూ తమ కన్నవారిని దూషించరు. అయితే వారు వేరొకరి తల్లిదండ్రులను దూషిస్తారు. కారణంగా వారు వీరి తల్లిదండ్రులను తిడతారు. ఆ తిట్లకూ బాధ్యులు వీరే కదా!

- ధర్మంలో లేని పోని కొత్త పనులకు, కొత్త పోకడలకు (బిద్అత్లకు) పాల్పడేవారికి సహాయపడటం, సమర్థించటం, ఆశ్రయమివ్వటం ఘోరమైన తప్పిదం. ఇలాంటి తప్పులకు ఊతమిచ్చేవారు కూడా నిందార్హులే.
- స్వార్థబుద్ధితో, పొరుగువాని భూమిని కబ్జా చేసుకునే ఉద్దేశంతో భూమి సరిహద్దురాళ్ళను మార్చివేయటం ఘోరపాతకం. ఈ ఘోరానికి ఒడిగట్టేవారు కూడా ధూర్తులే.
- ఈగ ఉపమానంతో వివరించబడిన కథ క్లుప్తమైనదే అయినా గుణపాఠంతో కూడుకున్నది.
- ఈగను విగ్రహానికి అర్పించిన వ్యక్తి వాస్తవానికి షిర్క్ చేసే ఉద్దేశ్యంతో ఆ పని చేయలేదు. తన స్వార్థం కోసం అలా చేశాడు. అయినప్పటికీ అది అతని పాలిట ప్రాణాంతకంగా పరిణమించింది.
- సిసలైన విశ్వాసులు షిర్క్ (బహుదైవోపాసన)ను అసహ్యించుకుంటారు. విపత్కర పరిస్థితుల్లో కూడా వారు అధర్మంతో రాజీపడరు.
- ఈగను విగ్రహానికి నజరానాగా సమర్పించి నరకానికి వెళ్ళిన వ్యక్తి ఎవరో కాదు, ముస్లిమే. అతను ముస్లిం అయి ఉండని పక్షంలో "కేవలం ఒక ఈగ మూలంగా అతను నరకానికి పోయాడని"ని దైవప్రవక్త(స) చెప్పి ఉండేవారే కాదు. వ్యక్తిలో విశ్వాసం లోపిస్తే అది అతన్ని నరకానికి గొనిపోతుంది.
- "స్వర్గం మీ పాదుక త్రాడు కన్నా అతి సమీపంలో ఉంది. నరకం

https://teluguislam.net

కూడా అంతే దగ్గర్లో ఉంది” అన్న దైవప్రవక్త (స) ప్రవచనానికి దీని ద్వారా సమర్థన లభిస్తోంది.

## మోడల్ ప్రశ్నలు

1) దైవేతరుల పేర జంతుబలి ఇవ్వడంపై ఖుర్‌ఆన్‌లో ఏమనబడింది?
2) ఈగ మూలంగా స్వర్గ, నరకాలకు వెళ్ళిన సంఘటనను వివరించండి?

## అవును / కాదు

1) నిస్సందేహంగా నమాజ్, ఖుర్బానీ, జీవనం, మరణం ఇవన్నీ అల్లాహ్ కొరకే ( )
2) అల్లాహ్ తప్ప ఇతరుల పేరు మీద జంతు బలి ఇవ్వడం సరైనదే ( )
3) తల్లిదండ్రులను శపించేవాడు అల్లాహ్ శాపానికి గురవుతాడు. ( )
4) పొరుగువారి భూమిని కబ్జా చెయ్యడం ఘోర పాతకం ( )
5) వ్యక్తిలో విశ్వాసం లోపిస్తే అది అతన్ని నరకానికి గొనిపోతుంది. ( )

https://teluguislam.net

19వ పాఠం

# అల్లాహ్ తప్ప ఇతరుల పేర మొక్కుబడి షిర్కే

అల్లాహ్ తన గ్రంథంలో ఇలా సెలవిచ్చాడు:

**"వారు (విశ్వాసులు అల్లాహ్‌కు చేసుకున్న) తమ మొక్కుబడులను చెల్లిస్తుంటారు. ఏరోజు కీడు నలువైపులా విస్తరిస్తుందో ఆ (ప్రళయం) రోజు గురించి భయపడుతుంటారు."**

***(ఖుర్ఆన్ 76 : 7)***

**"మీరు అల్లాహ్‌మార్గంలో ఎంత ఖర్చు చేసినా, ఏ మొక్కుబడి చేసుకున్నా అల్లాహ్‌కు దాని గురించి పూర్తిగా తెలుసు. దుర్మార్గులకు సహాయం చేసే వారెవరూలేరు."** ***(ఖుర్ఆన్ 2 : 270)***

మహనీయ ముహమ్మద్ (సఅసం) ఉపదేశించారని ఆయిషా (ర.అన్హా) తెలిపారు:

"ఎవరయితే అల్లాహ్‌కు విధేయుడనై ఉంటానని (మంచి నడవడికను కలిగివుంటానని) మొక్కుకున్నాడో అతను అల్లాహ్‌కు విధేయత చూపాలి. మరెవరయితే అల్లాహ్‌కు అవిధేయత కనబరుస్తానని (చెడులకు పాల్పడతానని) మొక్కుకున్నాడో అతను ఎట్టి పరిస్థితిలోనూ అవిధేయతకు పాల్పడకూడదు." (బుఖారీ)

## ఈ పాఠంలోని ప్రధానాంశాలు

- అల్లాహ్‌తో చేసిన వాగ్దానాన్ని (మొక్కుబడిని) నెరవేర్చాలి.
- మొక్కుబడి కూడా ఆరాధనే గనక, అల్లాహ్‌యేతరులను మొక్కు

కోవటం కూడా అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించటం (షిర్క్) క్రిందికే వస్తుంది.

- అల్లాహ్ పట్ల అవిధేయతకు పాల్పడతామని చేసుకున్న మొక్కుబడులను తీర్చుకోకూడదు. ఉదా:- ఒకవేళ నా ఈ పని జరిగితే ఫలానా దర్గా దగ్గరకు వెళ్ళి అక్కడ ఒక మేకపోతును బలి ఇస్తానని మొక్కుకోవటం. ఒకవేళ తెలియక అలా మొక్కుకున్నా సరే వాటిని తీర్చుకునేందుకు అనుమతి లేదు.

## ఖాళీలు పూరించండి

1) దైవేతరుల పేర............ ఇవ్వరాదు.
2) తన తల్లిదండ్రులను శపించేవాడు స్వయంగా..... శాపానికి గురవుతాడు.

https://teluguislam.net

20వ పాఠం

# అల్లాహ్ తప్ప ఇతరుల శరణు కోరటం కూడా షిర్కే

పరమ ప్రభువు అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

**"కొందరు మనుషులు కొందరు జిన్నాతుల శరణు కోరేవారు. ఈ కారణంగా జిన్నాతుల పొగరు మరింత పెరిగిపోయింది."**

***(ఖుర్ఆన్ 72 : 6)***

## అల్లాహ్ శరణును మించినది లేదు

దైవప్రవక్త (సఅసం) ఈ విధంగా చెబుతుండగా తాను విన్నానని ఖౌలా బిన్తె హకీమ్ (ర.అన్హా) తెలియజేశారు: ఎవరయినా ఒక ప్రదేశంలోకి ప్రవేశించి, "అల్లాహ్ సృష్టించిన ప్రతి దాని కీడు నుండి నేను అల్లాహ్ యొక్క సంపూర్ణ వచనాల మూలముగా శరణు వేడుతున్నాను" ("అవూజు బి కలిమాతిల్లాహిత్తామ్మాతి మిన్ షర్రి మా ఖలఖ్") అని వేడుకున్నట్లయితే, వారు ఆ స్థలాన్ని వదలి వెళ్ళేనంత వరకూ ఏదీ వారికెలాంటి హాని కల్గించజాలదు" (ముస్లిం)

## ఈ పాఠంలోని ప్రధానాంశాలు

- అల్లాహ్‌యేతరుల శరణు వేడటం అంటే దైవత్వంలో అల్లాహ్‌కు సహవర్తుల్ని (భాగస్వాముల్ని) కల్పించటమే (షిర్క్‌కు ఒడిగట్టడమే).
- 'అల్లాహ్ యొక్క సంపూర్ణ వచనాలు' 'సృష్టి' క్రిందికి రావు. ఒకవేళ అవి 'సృష్టి' అయివుంటే ప్రవక్త(స) వాటి మూలంగా వేడుకునేవారేకాదు. సృష్టిలో దేనినయినా శరణుకోరటమంటే షిర్క్‌కు పాల్పడటమే.
- ఏదైనా తప్పుడు విధానం ద్వారా ప్రాపంచిక జీవితంలో లబ్ధి పొందటం లేదా చెడు నుంచి రక్షణ పొందేందుకు ప్రయత్నించటం షిర్క్ కాదులే అని అనుకోవటం కూడా పొరపాటే.
- దైవప్రవక్త (స) ప్రబోధించిన ఈ శరణు వచనాలు చాలా చిన్నవి అయినప్పటికీ భావం రీత్యా మహోన్నతమైనవి.

https://teluguislam.net

21వ పాఠం

# అల్లాహ్‌ను తప్ప ఇతరుల సహాయం అర్థించటం కూడా షిర్కే

మహోన్నతుడగు అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

**"అల్లాహ్‌ను వదలిపెట్టి నీకు ఎలాంటి లాభాన్నిగానీ, కీడునుగానీ కలిగించలేని దానిని నువ్వు ఆరాధించకు. ఒకవేళ అలాంటి పని చేశావంటే నువ్వు కూడా దుర్మార్గుల్లో ఒకడివవుతావు"(అని హెచ్చరించబడింది). ఒకవేళ అల్లాహ్ నిన్ను ఏదైనా బాధకు గురి చేస్తే ఆయన తప్ప మరొకరెవరూ దానిని దూరం చేయలేరు. ఒకవేళ ఆయన నీకు ఏదైనా మేలు చెయ్యగోరితే ఆయన కృపను అడ్డుకునేవారు కూడా ఎవరూలేరు. ఆయన తన కృపను తన దాసులలో తాను కోరిన వారిపై కురిపిస్తాడు. ఆయన అమితంగా క్షమించేవాడు, అపారంగా కనికరించేవాడు"**

***(ఖుర్‌ఆన్ 10 : 106, 107)***

**"మీరు అల్లాహ్‌ను వదలి ఈ విగ్రహాలను పూజిస్తున్నారే! మీ అంతట మీరు అసత్యాలను అల్లుతున్నారు. వినండి! అల్లాహ్‌ను కాదని మీరు వేటినయితే పూజిస్తున్నారో, మీకు ఉపాధిని సమకూర్చే అధికారం వాటికిలేదు. కాబట్టి జీవనోపాధి కోసం మీరు అల్లాహ్ సమక్షంలోనే అర్థించండి. ఆయన్ను మాత్రమే ఆరాధించండి. ఆయనకే కృతజ్ఞతలు చెల్లించండి. ఎట్టకేలకు మీరు ఆయన వద్దకే మరలించబడతారు."*(ఖుర్‌ఆన్ 29 : 17)***

**"అల్లాహ్‌ను వదలి ప్రళయదినం వరకూ తన మొరను ఆమోదిం**

https://teluguislam.net

**చలేని వారిని, పైగా తను మొరపెట్టుకున్న సంగతి కూడా తెలియని వారిని మొరపెట్టుకునే వానికన్నా పెద్ద మార్గభ్రష్టుడు ఎవడుంటాడు? మానవులంతా సమీకరించబడినప్పుడు (ఎవరైతే పూజింప బడుతున్నారో) వారు వారికి (తమ భక్తులకు) శత్రువులై పోతారు. వీళ్ళ పూజాపునస్కారాలను కూడా వాళ్లు త్రోసిపుచ్చుతారు."**

***(ఖుర్ఆన్ 46 : 5,6)***

**"కలత చెందినవాడు మొరపెట్టుకున్నప్పుడు, అతని మొరను ఆలకించి, అతని వ్యాకులతను దూరం చేసేవాడెవడు? మిమ్మల్ని భూమికి ప్రతినిధులుగా చేసేవాడెవడు? ఏమిటీ, అల్లాహ్‌తోపాటు మరో ఆరాధ్య దేవుడు కూడా ఉన్నాడా? మీరు మాత్రం గుణపాఠం గ్రహించేది బహు తక్కువ.** ***(ఖుర్ఆన్ 27 : 62)***

దైవప్రవక్త (సఅసం) కాలంలో ఒక కపట విశ్వాసి తన కపట చేష్టలతో ముస్లిములను కష్టపెట్టేవాడు. కొంతమంది సహచరులు ఈ విషయం గురించి దైవప్రవక్త(స)కు మొరపెట్టుకుందామని కూడబలుక్కుని ప్రవక్త (స) సన్నిధికి వెళ్ళారు. అప్పుడు దైవప్రవక్త (స) వారినుద్దేశించి ఇలా ఉద్బోధించారు: "చూడండి! సహాయం కొరకు నన్ను మొరపెట్టుకోకూడదు. మీకు సహాయం చేసేవాడు అల్లాహ్ మాత్రమే. కాబట్టి సహాయం కొరకు ఆయన్నే మొరపెట్టుకోండి." (తబ్రానీ)

అల్లాహ్ ఇలా అంటున్నాడు:

**(ఓ ప్రవక్తా!) నా దాసులు నా గురించి నిన్ను అడిగితే, నేను (వారికి) అత్యంత సమీపంలోనే ఉన్నాననీ, పిలిచేవాడు నన్ను ఎప్పుడు పిలిచినా నేను అతని పిలుపును ఆలకించి ఆమోదిస్తానని**

https://teluguislam.net

**(నువ్వు వారికి చెప్పు). కాబట్టి వారు కూడా నా ఆదేశాన్ని శిరసా వహించాలి, నన్ను విశ్వసించాలి (ఈ విషయం నీవు వారికి తెలియజేయి). తద్వారానే వారు సన్మార్గ భాగ్యం పొందగల్గుతారు.**
***(ఖుర్ఆన్ 2:186)***

మరోచోట ఖుర్ఆన్‌లో ఇలా చెప్పబడింది:

**మరి మీ ప్రభువు (అల్లాహ్) ఏమంటున్నాడంటే, "మీరు నన్నే ప్రార్థించండి. నేను మీ ప్రార్థనలను ఆమోదిస్తాను. నా దాస్యం పట్ల గర్వాహంకారం ప్రదర్శించేవారు త్వరలోనే అవమానితులై నరకంలో ప్రవేశించటం తథ్యం."** ***(ఖుర్ఆన్ 40 : 60)***

## ఈ పాఠంలోని ప్రధానాంశాలు

- అల్లాహ్‌ను తప్ప వేరితరులను మొరపెట్టుకోవటం పెద్ద షిర్క్‌గా పరిగణించబడుతుంది.
- ఎంతటి పుణ్యపురుషుడైనా సరే, ఒకవేళ అతనే గనక అల్లాహ్‌ను వదలి వేరితరులను సహాయం కొరకు అర్థిస్తే అతను దుర్మార్గుల్లో చేరిపోతాడు.
- అల్లాహ్‌ను కాదని వేరొకరిని మొరపెట్టుకోవటమంటే అల్లాహ్ పట్ల అవిశ్వాస ధోరణిని, ధిక్కార వైఖరిని అవలంబించటమే.
- ఉపాధి కొరకు అల్లాహ్‌ను తప్ప వేరొకరిని అడగరాదు. స్వర్గం కొరకు ఏ విధంగానైతే అల్లాహ్‌ను తప్ప వేరొకరిని అర్థించరో అదే విధంగా జీవనోపాధి కోసం కూడా అల్లాహ్‌ను తప్ప వేరొకరిని అర్థించకూడదు.
- అల్లాహ్‌ను వదలి వేరొకరిని కష్టాలు తీర్చుమని మొరపెట్టుకునే వానికన్నా పరమ మార్గభ్రష్టుడు లేడు.

https://teluguislam.net

- అల్లాహ్‌ను కాదని ఇతరులను మొరపెట్టుకునే వారికి ఒక విషయం తెలిసిరావాలి. అదేమంటే తాము ఎవరినైతే మొరపెట్టుకుంటున్నారో వారికి ప్రజలు తమను మొక్కుకుంటున్నారన్న సంగతి కూడా తెలీదు. పైగా వారు ప్రళయ దినాన తమను మొరపెట్టుకున్న వారికి శత్రువులైపోతారు. "అల్లాహ్‌ను వదలి వేరొకరిని మొరపెట్టుకునే వానికన్నా పరమ మార్గభ్రష్టుడు లేడు" అని చెప్పబడింది అందుకే.
- అల్లాహ్‌ను కాదని వేరితరులను మొరపెట్టుకోవటమంటే, ఒక రకంగా వారిని పూజించటమే. ఎందుకంటే దుఆ చేయటం, అర్థించటం, మొరపెట్టుకోవటం వంటివన్నీ ఆరాధనలో అంతర్భాగమే.
- గమనార్హమైన మరో ముఖ్య విషయం ఏమిటంటే; విగ్రహారాధకులు సయితం విపత్కర పరిస్థితులలో తమ చిల్లర దేవుళ్ళను వదిలేసి గొప్పవాడైన అల్లాహ్ వైపునకే మరలుతారు. గండం నుంచి గట్టెక్కించమని అల్లాహ్‌ను దీనతి దీనంగా ప్రార్థిస్తారు.

## మోడల్ ప్రశ్నలు

1) అల్లాహ్‌ను మాత్రమే సహాయం అర్థించాలి. దీనికి సంబంధించిన ఖుర్‌ఆన్ వాక్యాలు వ్రాయండి.
2) అల్లాహ్‌ను కాకుండా వేరొకరి ముందు ఎందుకు మొరపెట్టుకోకూడదు?

## ఖాళీలు

1) మనకు సహాయం చేసేవాడు................. మాత్రమే.
2) అల్లాహ్ దాసుడికి అత్యంత......... లో ఉన్నాడు.

https://teluguislam.net

22వ పాఠం

# పుణ్యాత్ముల, ప్రబోధకుల సమాధుల వద్ద ఆరాధన చేయటం నిషిద్ధం

ఆయిషా (ర.అన్హా) కథనం ప్రకారం ఉమ్మె సలమా (ర.అన్హా) ఒకసారి దైవప్రవక్త ముహమ్మద్(సఅసం) ముందు తాను అబిసీనియా దేశంలో  చూసిన చర్చీ గురించి, అందులోని చిత్రాలను, విగ్రహాలను గురించి ప్రస్తావించినప్పుడు దైవప్రవక్త (సఅసం) ఇలా చెప్పారు: "తమలోని సజ్జనుడో లేక పుణ్య పురుషుడో  మరణించినప్పుడు అతని సమాధిపై  వారు ఆరాధనాలయం నిర్మించేవారు.  అందులో వివిధ చిత్రాలను చిత్రీకరించి, విగ్రహాలను ప్రతిష్ఠించేవారు.  వారు అల్లాహ్ సన్నిధిలో అందరికన్నా హీనులు. వారు రెండు చెడులను ఒకేచోట చేర్చారు. (1) సమాధుల పూజ (2) చిత్రాలను, విగ్రహాలను ప్రతిష్ఠించటం." (బుఖారీ, ముస్లిం)

ఆయిషా (ర.అన్హా) గారిదే మరో కథనం : దైవప్రవక్త (సఅసం)కు మరణ ఘడియలు సమీపించినప్పుడు ఆయన(స) (తీవ్రంగా బాధపడుతూ) తమ ముఖంపై గుడ్డ కప్పుకునేవారు. (ఒక్కోసారి ముఖంపై నుంచి గుడ్డను తొలగించేవారు). ఆ సమయంలో ఆయన (స) ఇలా అన్నారు: "యూదులపై, క్రైస్తవులపై అల్లాహ్ శాపం పడుగాక! వారు తమ ప్రవక్తల సమాధులను ప్రార్థనా మందిరాలుగా చేసుకున్నారు." ఇలా చేయరాదని ఆయన (స) ప్రజలను హెచ్చరించదలిచారు. ప్రవక్తల సమాధులను ప్రజలు ప్రార్థన స్థలాలుగా చేసుకుంటారన్న భయమేగనక లేకుంటే, ఇతర సహచరుల సమాధుల మాదిరిగానే ఆయన (స) సమాధి కూడా బహిరంగ ప్రదేశంలో ఉండేది." (బుఖారీ, ముస్లిం)

https://teluguislam.net

జున్దుబ్ బిన్ అబ్దుల్లాహ్ (రజి) ఉల్లేఖించారు: దైవప్రవక్త (స) తన మరణానికి ఐదు రోజుల క్రితం ఈ విధంగా చెబుతుండగా నేను విన్నాను – "అల్లాహ్ నాకు ఎంపిక స్వేచ్ఛను ప్రసాదించగా నేను ఆ పరమోన్నత మిత్రుడే (అల్లాహ్‌యే) కావాలని కోరుకున్నాను. అల్లాహ్ ఇబ్రాహీం (అలైహిస్సలాం)ను తన ప్రియ నేస్తం (ఖలీల్)గా చేసుకున్నట్లే నన్ను కూడా తన ప్రియతమ మిత్రునిగా చేసుకున్నాడు. ఒకవేళ నేను నా సహచరులలో ఎవరినయినా నా ప్రియనేస్తంగా చేసుకోవలసి ఉంటే అబూబక్ర్ (రజి)ను నా ప్రియనేస్తంగా చేసుకునేవాణ్ణి. మీకు పూర్వం గతించినవారు తమ ప్రవక్తల గోరీలను ప్రార్థనా స్థలాలుగా చేసుకున్నారు. జాగ్రత్త! మీరు మాత్రం అలా చేయరాదు సుమా! (ముస్లిం)

ప్రవక్త (సఅసం)తన జీవితపు ఆఖరి ఘడియలలో కూడా ఈ చేష్టల నుంచి వారించారంటే, సమాధి పూజ చేసేవారు శాపగ్రస్తులవుతారని హెచ్చరించారంటే ఇదెంత ముఖ్యమైన విషయమో ఊహించవచ్చు. ప్రవక్త (సఅసం) చెప్పిన దాని ప్రకారం గోరీలపై ప్రార్థనాలయాలు నిర్మించటం, గోరీలను పూజించటం, గోరీల దగ్గర నమాజ్ లాంటి ప్రార్థనలు చేసు కోవటం– ఇవన్నీ నిషేధించబడ్డాయి. "తన సమాధిని ప్రజలు ప్రార్థనా స్థలంగా చేసుకుంటారన్న భయమే గనక లేకుంటే......" అని అనటంలోని అంతరార్థం అదే. దైవప్రవక్త ప్రియసహచరులు ఎప్పటికీ ప్రవక్త సమాధిపై మస్జిద్ నిర్మించేవారు కారు. ఎందుకంటే ఏ స్థలంలో నమాజ్ చేయబడు తుందో అది మస్జిద్ (సాష్టాంగ ప్రణామ స్థలం) అనబడుతుంది.

దైవప్రవక్త (స) ఇలా ప్రబోధించారు: **"లా తజ్అలూ ఖబ్రీ ఈదన్"** (నా సమాధిని జాతర స్థలంగా చేయకండి.)

“సమస్త భూభాగం నా కొరకు మస్జిద్‌గా, పరిశుద్ధత పొందే స్థలంగా చేయబడింది” అని దైవప్రవక్త (సఅసం) చెప్పటం గమనార్హం.

*(బుఖారీ, ముస్లిం)*

ఇబ్నె మస్‌వూద్ (రజి) ఉల్లేఖించిన మర్ఫూ హదీసులో మహనీయ ముహమ్మద్ (సఅసం) ఇలా చెప్పారు: “ప్రళయం ఎవరిపై సంభవిస్తుందో (అనగా ఎవరి విషయంలోనైతే ప్రళయ సంకేతాలు నిజం అవుతాయో) వారు జనులలోకెల్లా అధములు. సమాధులను ప్రార్థనా స్థలాలుగా చేసుకున్న వారు కూడా హీనాతిహీనులే” (ప్రామాణిక ఆధారాలతో అహ్మద్ దీనిని తన ముస్నద్‌లో పొందుపరిచారు. అబూ హాతిమ్ కూడా దీనిని ప్రమాణబద్ధంగా సంగ్రహించారు)

## ఈ పాఠంలోని ప్రధానాంశాలు

- పుణ్యపురుషుల సమాధుల దగ్గర మస్జిద్‌ను నిర్మించటం పట్ల దైవ ప్రవక్త (సఅసం) గట్టిగా హెచ్చరించారు. మస్జిద్ నిర్మాణం సదుద్దేశంతో చేసినా అది వాంఛనీయం ఎంత మాత్రం కాదు.
- విగ్రహాలను తయారు చేయటం నిషిద్ధం.
- గోరీలపై కట్టడాలను నిర్మించే చేష్ట అంతకు ముందు నుంచే నిషేధించబడి ఉన్నప్పటికీ, మహాప్రవక్త (సఅసం) తన మరణానికి ఐదు రోజుల ముందు మరోసారి దాన్ని ప్రస్తావించి, అలాంటివారిపై అల్లాహ్ శాపం పడుతుందని చెప్పటం, అలాంటి చేష్టలకు పాల్పడరాదని తన అనుచర సమాజాన్ని హెచ్చరించటం ప్రత్యేకంగా ఆలోచించదగిన విషయం. దీన్నిబట్టి ఈ చేష్ట ఎంత వికృతమయినదో అవగతమవుతోంది.

https://teluguislam.net

- మహాప్రవక్త (సఅసం) తన సమాధిని ఆరాధనాలయంగా చేసుకో రాదని గట్టిగా వారించారు.
- ఇలాంటి చర్యకు ఒడిగట్టిన యూదులను, క్రైస్తవులను ఆయన (స) అసహ్యించుకున్నారు.
- తన సమాధి పట్ల ముస్లింలు మితిమీరి ప్రవర్తించరాదన్న ఉద్దేశం తోనే మహాప్రవక్త (సఅసం) ఇంత గట్టిగా తాకీదు చేయాల్సి వచ్చింది.
- మహాప్రవక్త (సఅసం) సమాధి బహిరంగ ప్రదేశంలో లేకుండా జాగ్రత్తపడటంలోగల అంతరార్థం కూడా అదే.
- సమాధులను ఆరాధనాలయం (మస్జిద్)గా చేసుకునే పోకడ వెనుక ఏఏ కారణాలు, ఏఏ పరిస్థితులు ఉంటాయో కూడా ఈ సందర్భంగా విడమరిచి చెప్పబడింది.
- ప్రవక్తల గోరీలను ప్రార్థనాలయాలుగా చేసుకునే వారిని, ప్రళయం సంభవించబోయే వారిని ఒకేచోట చేర్చి హెచ్చరించటం కూడా గమనార్హ విషయమే. తన అనుచర వర్గంలో బహుదైవారాధన, అవిశ్వాసం ఎలా ప్రబలుతుందో, వాటి స్వభావ స్వరూపాలు ఎలా ఉంటాయో దైవప్రవక్త (సఅసం) క్షుణ్ణంగా వివరించారు.
- మహాప్రవక్త (సఅసం) తన మరణానికి అయిదు రోజుల క్రితం చేసిన హెచ్చరికను బట్టి రాఫిజా, జహ్మియా అనే రెండు వర్గాలు మార్గవిహీనతకు లోనైన వర్గాలని అర్థమవుతున్నది. కొంతమంది విద్వాంసులు ఈ రెండు వర్గాలను 72 వర్గాలలోకి చేర్చరు. సమాధిపై మస్జిద్‌ను నిర్మించే చేష్టకు ప్రప్రథమంగా పాల్పడినది రాఫిజా వర్గీయులే. వాళ్ళ వల్లనే ముస్లిం సముదాయంలో షిర్క్, బిద్అతులు చోటు చేసుకున్నాయి.

https://teluguislam.net

- దైవప్రవక్త (సఅసం) మరణానికి ముందు నొప్పితో బాధపడినట్లు తెలుస్తోంది.
- అంతిమ దైవప్రవక్త ముహమ్మద్ (సఅసం)కు అల్లాహ్ యొక్క ప్రియతమ నేస్తం (ఖలీల్) అయ్యే భాగ్యం దక్కింది.
- ప్రవక్త ప్రియసహచరులందరిలోకీ అబూ బక్ర్ (రజి) శ్రేష్ఠులన్న సంగతి కూడా విదితమవుతోంది.
- తన తదనంతరం అబూబక్ర్ (రజి) ఖలీఫా (ముస్లిం రాజ్యనేత)గా ఎన్నుకోబడతారని మహాప్రవక్త (సఅసం) సూచనాప్రాయంగా తెలియజేశారు.

## మోడల్ ప్రశ్నలు

1) ప్రవక్త (స) సమాధిని ప్రార్థన స్థలంగా మార్చకండి అని చెప్పిన ఏవైనా రెండు హదీసులు వ్రాయండి?
2) ప్రవక్త (స) యూదులను, క్రైస్తవులను ఎందుకు శపించారు?
3) సమాధులపై కట్టడాలు నిర్మించటం ఎంత వరకు సమంజసం?

## ఖాళీలు పూరించండి

1) దైవప్రవక్త (స) మరణానికి ముందు ....... తో బాధపడ్డారు.
2) సహచరులందరిలోకి ............... శ్రేష్ఠులు.
3) ప్రవక్త (స)............., ............. లను అసహ్యించుకున్నారు.
4) ప్రవక్త (స) తన ............ను ఆరాధనాలయంగా చేసుకోరాదని గట్టిగా వారించారు.

https://teluguislam.net

## 23వ పాఠం

## సజ్జనుల సమాధుల విషయంలో హద్దులుమీరటం, వాటిని బహుదైవారాధనకు అనువుగా మార్చటం

అంతిమ దైవప్రవక్త (సఅసం) ఇలా ప్రార్థించుకున్నారు: “ఓ అల్లాహ్! నా సమాధిని ప్రజలు పూజించే విగ్రహంగా చేయనీకు. ప్రవక్తల సమాధులను ప్రార్థనాలయాలు (సాష్టాంగ ప్రణామ స్థలాలు)గా చేసుకునేవారిపై అల్లాహ్ ఆగ్రహం విరుచుకుపడు గాక!” (ముఅత్తా ఇమామ్ మాలిక్)

**“అఫరఐతుముల్లాత వల్ ఉజ్జా”** (ఏమిటి, మీరు లాత్, ఉజ్జాలను గాని చూశారా?) (53 : 19) అనే ఖుర్‌ఆన్ ఆయతుకు తాత్పర్యంగా ఇబ్నె జరీర్ తబ్రీ (రహ్మాలై) సుఫియాన్, మన్సూర్‌ల ఉల్లేఖనం ద్వారా ఇలా వివరించారు–

లాత్ (అనే ఒక సత్పురుషుడు) హజ్జ్ యాత్రికులకు మంచి సేవలందించేవాడు. యవలు లేక గోధుమ పిండితో, నేతితో చేయబడిన అంబలి (సవీఖ్)ని తయారు చేసి హాజీలకు త్రాపించేవాడు. అతను మరణించిన తరువాత ప్రజలు అతని గౌరవార్థం అతని సమాధిని పటిష్టపరచి, సమాధి సేవకులు (ముజావర్లు) అయి కూర్చున్నారు. ఆ విధంగా ఆ సత్పురుషుని సమాధి కాస్తా ప్రార్థనాలయంగా మారి పోయింది.”

అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి) కథనం : సమాధులను సందర్శించే స్త్రీలు శాపగ్రస్తులవుతారని దైవప్రవక్త (స) చెప్పారు. సమాధులపై ఆరాధనాలయాలను నిర్మించి, అక్కడ దీపాలు వెలిగించేవారు కూడా శాపగ్రస్తులేనని ఆయన (స) పలికారు. (అబూ దావూద్, తిర్మిజీ, ఇబ్ను మాజా, నసాయిలు ఈ హదీసును సమర్థించారు)

https://teluguislam.net

## ఈ పాఠంలోని ప్రధానాంశాలు

- ప్రజల్లో విగ్రహారాధన ఎలా చోటు చేసుకుంటుందో ఇందులో వివరించబడింది.
- ప్రార్థనాలయాలు ఎలా పుట్టుకువస్తాయో, చిల్లర దైవాల పూజా పునస్కారాలు ఎలా మొదలవుతాయో కూడా ఇందులో విశదీకరించబడింది.
- ప్రవక్త (సఅసం) తనకు దేనివల్ల కీడు కలుగుతుందని అనుమానించారో దాన్నుండి అల్లాహ్‌నే శరణువేడారు.
- "ఓ అల్లాహ్! నా సమాధిని ప్రజలు పూజించే విగ్రహంగా చేయకు" అని ప్రవక్త (స) వారు ప్రార్థించటమేగాక, గత సమాజాల వారు తమ ప్రవక్తల సమాధులను పూజా స్థలాలుగా మార్చిన సంగతిని కూడా ప్రస్తావించటం గమనార్హం.
- ఇలాంటి పనులు చేసిన వారిపై అల్లాహ్ ఆగ్రహం విరుచుకుపడుతుందని చెప్పటం కూడా గమనించదగిన విషయమే.
- అరబ్బులలో సుప్రసిద్ధుడైన లాత్ అనే వ్యక్తి విగ్రహం ఎలా తయారయిందో, దానిపూజ అసలు ఎలా మొదలయ్యిందో వివరించటం చాలా ముఖ్యమైన అంశం.
- 'లాత్' అనేది ఒక సజ్జనుని పేరు ఆ సమాధిలో ఉన్న వ్యక్తి పుణ్యాత్ముడవటం చేత ప్రజలు దానికి పవిత్రతను ఆపాదించి సమాధి సేవలు మొదలెట్టారు. ఆ సేవలే ఆరాధనలుగా, అర్చనలుగా మారిపోయాయి. 'షిర్క్' ప్రతి చోటా వ్యాపించేది ఇలాగే.
- సమాధులను సందర్శించే స్త్రీలు, సమాధులపై దీపాలు వెలిగించే

https://teluguislam.net

వారు శాపగ్రస్తులవుతారని ప్రవక్త మహనీయులు (సఅసం) చెప్పటం గమనించదగిన విషయం.

## మోడల్ ప్రశ్నలు

1) సజ్జనుల సమాధుల విషయంలో హద్దుమీరి ప్రవర్తించటం ఎంత వరకు సమంజసం?
2) లాత్ ఎవరు? ఆయన మరణం తర్వాత ప్రజలు ఆయన సమాధి పట్ల ఎలా ప్రవర్తించారు?

## ఖాళీలు పూరించండి

1) సమాధులను సందర్శించే స్త్రీలు.......... అవుతారని ప్రవక్త(స) అన్నారు.
2) సమాధులపై........................ వెలిగించేవారు............ అవుతారు.

24వ పాఠం

## మహాప్రవక్త (స) తౌహీదును స్థాపించారు షిర్క్ మార్గాలన్నింటినీ మూసివేశారు

ఖుర్ఆన్ గ్రంథంలో అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

**మీ దగ్గరకు స్వయంగా మీలో నుంచే ఒక ప్రవక్త వచ్చాడు. మీకు కష్టం కలిగించే ప్రతిదీ అతనికి బాధ కలిగిస్తుంది. అతను మీ మేలును ఎంతగానో కోరుకుంటున్నాడు. విశ్వాసుల యెడల అతను వాత్సల్యం కలవాడు, దయామయుడు.**

**ఇక వారు గనక వైముఖ్య ధోరణిని కనబరిస్తే "నాకు అల్లాహ్ చాలు. ఆయన తప్ప వేరొక ఆరాధ్యుడు లేనేలేడు. నేను మాత్రం ఆయన్నే నమ్ముకున్నాను.ఆయన మహోన్నతమైన పీఠానికి(అర్ష్‌కు) అధిపతి" అని (ఓ ప్రవక్తా!) వారికి చెప్పు.** ***(9 ఖుర్ఆన్ : 128, 129)***

దైవప్రవక్త (స) ప్రబోధించారని అబూ హురైరా (రజి) తెలిపారు: "మీ ఇళ్ళను శ్మశానాలుగా మార్చకండి. నా సమాధిని జాతర స్థలంగా చేసుకోకండి. నా కోసం దరూద్ ప్రార్థన పంపుతూ ఉండండి. మీరు ఎక్కడ ఉన్నాసరే మీ దరూద్ ప్రార్థన నాకు చేర్చబడుతుంది."

*(అబూదావూద్–విశ్వసనీయ పరంపరతో అందిన హదీసు)*

ఒక వ్యక్తి మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం) సమాధి వద్ద ప్రార్థన చేస్తూ ఉండటాన్ని అలీ బిన్ హుసైన్ (రహ్మ.అలై) గమనించి, అలా చేయరాదని అతనిని వారిస్తూ ఇలా అన్నారు: "నేను నీకు ఆ హదీసును వినిపించనా! దానిని మా నాన్నగారు (హుసైన్–రజి) మా తాత (అలీ–రజి) గారి నుండి విన్నారు. ఆయనేమో దైవప్రవక్త (స) చెప్పగా విన్నారు. ఇంతకీ ఆ హదీసులో ప్రవక్త (స) ఏమన్నారంటే; "నా సమాధిని జాతర స్థలంగా మార్చకండి (లా తజ్అలూ ఖబ్రీ ఈదన్). మీ ఇళ్ళను శ్మశాన

https://teluguislam.net

వాటికలుగా చేయకండి. నాకోసం దరూద్ ప్రార్థన చేస్తూ ఉండండి. మీరెక్కడ ఉన్నా సరే మీ దరూద్ ప్రార్థన నాకు చేర్చబడుతుంది.”

(ఇమామ్ మఖ్‌దసీచే సేకరించబడిన ‘అల్ ముఖ్తారాత్’ నుండి)

## ఈ పాఠంలోని ప్రధానాంశాలు

- మహనీయ ముహమ్మద్ (సఅసం) తన అనుచర సమాజాన్ని షిర్క్ (బహుదైవారాధన) దరిదాపులకు కూడా వెళ్ళకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు.
- మహాప్రవక్త (సఅసం) వారికి మనపై అమితమైన ప్రేమ, వాత్సల్యం ఉండేది. ఆయన (స) మన బాగోగులను ఎంతగానో కోరుకునేవారు.
- సమాధులను సందర్శించటం సత్కార్యమే అయినప్పటికీ ఒక ప్రత్యేక పద్ధతిలో తన సమాధిని సందర్శించటాన్ని ఆయన (సఅసం) స్వయంగా వారించారు.
- సమాధులను ఎక్కువగా సందర్శించటాన్ని కూడా ఆయన(స) వారించారు.
- నఫిల్ నమాజులు ఇళ్ళల్లోనే చేయమని ప్రవక్త (స) ప్రోత్సహించారు. ‘మీ ఇండ్లను శ్మశాన వాటికలుగా మార్చకండి’ అని చెప్పటంలోని ఉద్దేశం అదే.
- శ్మశాన వాటికలో నమాజ్ చేయరాదన్న విషయంలో ప్రవక్త సహచరులందరి మధ్య ఏకాభిప్రాయం (ఇజ్మా) ఉండేది.
- దరూద్, సలాంలు ఎక్కడ ఉండి పంపినా అవి దైవప్రవక్త (స)కు చేర్చబడతాయి. దీనికోసం ప్రత్యేకంగా ప్రవక్త సమాధి దగ్గరకే వెళ్ళనవసరంలేదు.
- దైవప్రవక్త (స) ‘బర్జఖ్’ అవస్థలో ఉన్నారనీ, మనం ఎక్కడి నుంచి దరూద్ సలాంలు పంపినా అవి ఆయన (స)కు చేర్చబడతాయని దీని ద్వారా స్పష్టమవుతోంది.

https://teluguislam.net

25వ పాఠం

# నిజమైన అల్లాహ్ మిత్రులు (ఔలియాలు) ఎవరు?

అల్లాహ్‌ను ప్రేమించే, అల్లాహ్ ఇష్టపడే నిజమైన ముస్లింలే ఔలియాలు (అల్లాహ్ మిత్రులు). ఆ విధంగా అల్లాహ్‌పై దృఢ నమ్మకంతో, ఆయన ఆజ్ఞలను కచ్చితంగా పాటించే సదాచార సంపన్నులైన ముస్లింలు అందరూ అల్లాహ్ ఔలియాలే. అంతేగాని అద్భుతాలు (కరామత్‌లు) చేసేవాళ్ళే ఔలియాలు అనుకోవటం పొరపాటు.

అల్లాహ్‌మిత్రులకు ఇహలోకంలో శాంతియుతమైన, సంతృప్తికరమైన జీవితం, అల్లాహ్ ప్రసన్నత లభిస్తుంది. పరలోకంలో అల్లాహ్ సాన్నిధ్యం, స్వర్గసుఖాలు ప్రాప్తిస్తాయి.

ఇహలోక జీవితంలో వారు ఇతర మానవుల్లాగానే ఎవరికైనా ఏదైనా చేయగలుగుతారు. ఇక మరణించిన తర్వాత ఎవరికీ ఎలాంటి శక్తులు ఉండవు. ఆఖరికి ఔలియాలకు కూడా ఉండవు. దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ సెలవిస్తున్నాడు:

**వినండి! అల్లాహ్ స్నేహితు (ఔలియా)లకు భయము గానీ, దుఃఖంగానీ ఉండదు. వారు విశ్వసించిన వారై, (చెడుల విషయంలో అల్లాహ్‌కు) భయపడేవారై ఉంటారు. ప్రాపంచిక జీవితంలోనూ, పరలోకంలోనూ వారికి శుభవార్త కలదు. అల్లాహ్ వాక్కుల్లో మార్పు ఉండదు. ఇదే గొప్ప విజయం.** ***(ఖుర్ఆన్ 10:62-64)***

కాబట్టి బోధపడిందేమంటే నిజమైన ముస్లింలుగా జీవిస్తే ఎవరైనా

https://teluguislam.net

అల్లాహ్ మిత్రులు (ఔలియా అల్లాహ్) కాగలరు.

నిజానికి 'ఔలియా' అనేది 'వలీ' అన్న పదానికి బహువచనం. ఇది ఓ ఇస్లామీయ పారిభాషిక పదం. దీనికి ప్రత్యేక అర్థం ఉంది. చిత్తశుద్ధితో, అంకితభావంతో, నిజాయితీగా, సమగ్రంగా అల్లాహ్ ధర్మాన్ని ఆచరించే ముస్లింనే వలీ అంటారు. ముస్లిమేతర భావజాలానికి దాసోహమైన కొందరు ముస్లింలు దీని భావాన్ని వక్రీకరించారు. అద్భుతాలు, మహిమలు ప్రదర్శించగల వేదాంతికులే 'వలీలు' అంటూ ఈ పదానికి తప్పుడు భాష్యాలు చెప్పటం మొదలుపెట్టారు. కాని ఇది పూర్తిగా ఇస్లాం ధర్మానికి విరుద్ధమైన భావన.

దివ్యఖుర్ఆన్‌లో మరోచోట అల్లాహ్ అంటున్నాడు:

**ఎవరయితే అల్లాహ్‌కు, ప్రవక్త (సఅసం)కు విధేయత కనబరుస్తారో వారే (పరలోకంలో) అల్లాహ్ అనుగ్రహం పొందిన ప్రవక్తలతోనూ, సత్యసంధులతోనూ, షహీదులతోనూ, సజ్జనులతోనూ ఉంటారు. వీరు ఎంతో మంచి స్నేహితులు. *(ఖుర్ఆన్ 4:69)***

అల్లాహ్ మిత్రుల (ఔలియా అల్లాహ్) జాబితాలో అగ్రశ్రేణివారు దైవప్రవక్తలు. ఆ దైవప్రవక్తలను చిత్తశుద్ధితో, నిజాయితీగా అనుసరించే వారు కూడా అల్లాహ్ మిత్రుల (ఔలియా అల్లాహ్) కోవలోకే వస్తారు. దైవప్రవక్త ముహమ్మద్ (స) గారి సహచరులు (సహాబా), సతీమణులు (విశ్వాసుల మాతృమూర్తులు) అందరూ వలీలే.

దైవప్రవక్త ముహమ్మద్ (స) చేత ఇహలోకంలోనే స్వర్గ శుభవార్తలు పొందిన పదిమంది ఆయన సహచరులు (అషరయె ముబష్షరహ్) ఇతర సహచరులందరిలోకెల్లా అగ్రగణ్యులు. ధర్మ స్థిరత్వంలో, ఇస్లాం కోసం

https://teluguislam.net

త్యాగం చేయటంలో వీరు ఎన్నడూ ముందుండేవారు. మరి ఆ పది మందిలోనూ అగ్రగణ్యులు నలుగురు ధర్మ ఖలీఫాలు. ముహమ్మద్ (స) మరణానంతరం ముస్లిం రాజ్యాన్ని పరిపాలించటానికి అప్పటి ముస్లిం సమాజం వారిని ఒకరి తరువాత ఒకరిగా ఎన్నుకుంది. ఆ నలుగురు వరుసగా:

1. అబూబక్ర్ సిద్దీఖ్ (రజి) (క్రీ.శే. హి.శ.13)
2. ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) (క్రీ.శే. హి.శ.23)
3. ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (రజి) (క్రీ.శే. హి.శ.35)
4. అలీ బిన్ అబూ తాలిబ్ (రజి) (క్రీ.శే. హి.శ.40)

ఆ పదిమందిలో మిగతా 6గురు వీరు.

5. జుబైర్ బిన్ అవ్వామ్ (రజి)
6. సాద్ బిన్ వఖ్ఖాస్ (రజి)
7. తల్హా బిన్ ఉబైదిల్లాహ్ (రజి)
8. అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి)
9. అబూ ఉబైదహ్ ఆమిర్ బిన్ జర్రాహ్ (రజి)
10. సయీద్ బిన్ జైద్ (రజి)

(అల్లాహ్ వారి పట్ల, ఇంకా ఇతర సహచరులందరి పట్ల ప్రసన్నుడగు గాక!)

వీరికన్నా గొప్ప ఔలియాలు ఇంకెవరు కాగలరు చెప్పండి?

https://teluguislam.net

## మోడల్ ప్రశ్నలు

1) 'ఔలియాలు' అంటే ఎవరు? ఖుర్ఆన్‌లో వీరి గురించి ఇచ్చిన నిర్వచనం ఏమిటి?
2) దైవప్రవక్త (స) చేత ఇహలోకంలోనే స్వర్గశుభవార్తలు పొందిన పది మంది సహచరుల పేర్లు వ్రాయండి?

## ఖాళీలు పూరించండి

1) అల్లాహ్ మిత్రుల జాబితాలో....... కలవారు దైవప్రవక్తలు.
2) అల్లాహ్‌ను ఇష్టపడే, ప్రవక్తను ప్రేమించే వారే నిజమైన........
3) అల్లాహ్ మిత్రుల కోసం ఇహలోకంలో ...................... జీవితం లభిస్తుంది.
4) మరణించిన తర్వాత ఎవరికీ ఎలాంటి ................ ఉండవు.
5) "ఔలియా" అనేది. ................ అన్న పదానికి బహువచనం.
6) ఇహ లోకంలో స్వర్గ శుభవార్త పొందిన వారి సంఖ్య.............

https://teluguislam.net

అధ్యాయం - 3

# శుచీశుభ్రతలు

https://teluguislam.net

26వ పాఠం

# నీళ్ల రకాలు

నీళ్ళను రెండు రకాలుగా వర్గీకరించవచ్చు

1. పరిశుభ్రమైన నీరు – దీంతో వుజూ చేయవచ్చు.
2. అపరిశుభ్రమైన నీరు – ఇది వుజూ కొరకు పనికిరాదు.

## పరిశుభ్రమైన నీరు

1. ముత్‌లఖ్ నీరు–అంటే సహజమైన నీరు అని అర్థం. అంటే వర్షపు నీరు, సముద్రపు నీరు, నిల్వ ఉన్న నీరు.
   నిల్వ ఉన్న నీరు అంటే ఒకే సరస్సు లేదా జలాశయంలో చాలా కాలంగా ఆగి ఉన్న నీరు అన్నమాట!
2. నీళ్ళలో ఒక్కోసారి సబ్బు, ఉప్పు, పువ్వు, పిండిలాంటి కొన్ని పరిశుభ్రమైన వస్తువులు పడతాయి. దానివల్ల ఆ నీళ్లలో తీవ్రమైన ప్రభావం ఏమీ ఉండదు. కాబట్టి అట్టి నీరు సాధారణ నీరుగానే పరిగణించ బడుతుంది.
3. రెండు తొట్టెలకు సమానంగా లేదా అంతకంటే ఎక్కువ మోతాదులో ఉన్న నీళ్ళలో అశుద్ధ పదార్థం పడినప్పటికీ దాని రంగు, రుచి, వాసనలో ఎలాంటి మార్పు రాకుండా ఉన్నట్లయితే ఆ నీరు కూడా పరిశుభ్రమైన నీరుగానే భావించబడుతుంది.

ఇక్కడ తొట్టె నీరు అంటే దాదాపు 95.62 లీటర్లు అన్నమాట.

## అపరిశుభ్రమైన నీరు

రెండు తొట్టెల కన్నా తక్కువ పరిమాణంలో ఉన్న నీటిలో ఏదైనా

https://teluguislam.net

మలిన పదార్థం పడినట్లయితే అది అపరిశుభ్రంగా పరిగణించబడుతుంది – ఒకవేళ దాని రంగు, రుచి, వాసనలో మార్పు రాకపోయినాసరే అది అపరిశుద్ధం (నజస్) గానే భావించబడుతుంది. కాబట్టి అలాంటి నీరు 'వుజూ' కొరకు పనికిరాదు.

## అశుద్ధ వస్తువులు

1. మనిషి మలం 2. అతని మూత్రం 3. స్రవించిన రక్తం, 4. కుక్క చొంగ 5. నిషిద్ధ జంతువుల మలము, మూత్రం. 6. పంది

7. మృత జంతువులు, క్రింద పేర్కొనబడినవి తప్ప:

అ) సముద్రపు మృత జంతువులు, మిడతలు

ఆ) రక్త ప్రసరణ జరగని మృత జంతువులు ఉదా: ఈగ

ఇ) బ్రతికి ఉన్నప్పుడు తినే అనుమతి గల మృత జంతువుల వెంట్రుకలు, ఉన్ని, ఈకలు, ఎముకలు, కొమ్ములు, గిట్టలు.

## మోడల్ ప్రశ్నలు

1) ఏవి అశుద్ధమైనవి?
2) నీళ్ళలోని రకాలు ఎన్ని? వివరించండి?
3) పరిశుభ్రమైన, అపరిశుభ్రమైన నీరు అని ఎప్పుడు అనబడుతుంది?
4) ఏవి మృత జంతువుల క్రిందికి రావు?
5) అశుద్ధ వస్తువులను కొన్నింటిని తెల్పండి?

## ఖాళీ పూరించండి

1) తొట్టె నీరు అంటే దాదాపు ..... లీటర్లు.

https://teluguislam.net

27వ పాఠం

# వుజూ చేసే విధానం మరియు సాక్సుల మీద మసహ్ చేయడం

దైవప్రవక్త ముహమ్మద్(స) తెలిపిన వుజూ విధానం :

1. వుజూ చేసే ముందు సంకల్పం (నియ్యత్) చేసుకోవాలి. మనస్సులోని భావననే 'సంకల్పం' అంటారు.

2. వుజూ ప్రారంభించే ముందు "బిస్మిల్లాహ్" (అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను) అని పలకాలి.

3. రెండు చేతుల్ని మణికట్టు వరకూ 3 సార్లు కడుగుతూ వ్రేళ్ళ మధ్యలో రుద్దుతూ, వ్రేళ్ళ మధ్యలో నీటిని పోనివ్వాలి.

4. మూడు సార్లు నోట్లో నీళ్ళు తీసుకుని పుక్కిలించాలి. మిస్వాక్ (పను దోము పుల్ల)తో లేదా టూత్ బ్రష్‌తో లేదా చేతి వ్రేళ్ళతో పళ్ళను, చిగుళ్లను శుభ్రపరుచుకోవాలి.

   మిస్వాక్ ప్రాముఖ్యాన్ని గురించి దైవప్రవక్త(స) ఇలా సెలవిచ్చారు: "నా అనుచర సమాజానికి కష్టం కలుగుతుందనే ఆలోచనే నాకు లేకపోతే ప్రతిసారీ వుజూ సమయంలో మిస్వాక్ విధిగా చేయాలని ఆదేశించేవాణ్ణి." (ఇమామ్ మాలిక్)

5. మూడుసార్లు ముక్కులోనికి నీరు ఎక్కించుకొని చీదాలి.

6. రెండు చేతులతో మూడుసార్లు ముఖాన్ని కడుక్కోవాలి. కడిగేటప్పుడు నీటిని పై నుండి గడ్డం వరకూ, ఒక చెవి నుండి మరో చెవి వరకూ పోనివ్వాలి.

https://teluguislam.net

7. చేతులను మోచేతుల సమేతంగా మూడుసార్లు కడగాలి. మొదటగా కుడి చెయ్యిని, తరువాత ఎడమ చెయ్యిని కడగాలి. కడిగేటప్పుడు చేతులను రుద్దాలి.

8. రెండు చేతులను తడిపి తల ముందు భాగం నుండి స్పర్శిస్తూ మెడ వరకు చేతుల్ని తీసుకెళ్ళాలి. అక్కడి నుండి చేతుల్ని తిరిగి మొదలు పెట్టిన చోటుకి తీసుకురావాలి. మెడను తడపకూడదు.

9. చేతులను మళ్ళీ తడపకుండానే తల నుండి తీసి చెవి దొప్పల లోపలి భాగాన్ని చూపుడు వ్రేళ్ళతోనూ, చెవి దొప్పల బయటి భాగాన్ని బొటన వ్రేళ్ళతోనూ స్పర్శింపజేయాలి.

10. రెండు కాళ్ళు మూడుసార్లు చీలమండల సమేతంగా కడగాలి. మొదట కుడికాలు తరువాత ఎడమకాలు కడుక్కోవాలి. కాలివ్రేళ్ళ మధ్యన నీరు ప్రవహించే విధంగా వ్రేళ్ళ మధ్యలో రుద్దాలి.

## సాక్సులపై మసహ్ చేయడం (తడిచేత్తో స్పర్శించటం)

1. ఎవరి వుజూ అయినా భంగమైనట్లైతే, వారు మళ్లీ వుజూ చేసుకోవాలి. అప్పుడు రెండు కాళ్ళను కడగకుండా సాక్సుల మీద నుండి తడి చేతులతో మసా చేస్తే సరిపోతుంది. ఇది కేవలం వుజూ చేసిన తరువాత సాక్సులు ధరించిన సందర్భంలోనే వర్తిస్తుంది.

2. ప్రయాణికుడికి మూడు పగళ్ళు, మూడు రాత్రులు (72 గంటలు) వరకూ 5 పూటల నమాజ్ చేసుకోవడానికి సాక్సులపై మసహ్ చేసుకునే అనుమతి ఉంది. కాని స్థానికుడికి కేవలం ఒక పగలు, ఒక రాత్రి (24 గంటలు) మాత్రమే అనుమతి కలదు.

https://teluguislam.net

## సాక్సుల పై మసా చేసే పద్ధతి

దైవప్రవక్త(స) సాక్సులపై క్రింది విధంగా మసహ్ చేశారు:

“బూట్లను తొలగించి, తడి చేతులను సాక్సులపై ఉపరితల భాగాన్ని స్పర్శించారు.” (కింది భాగాన్ని స్పర్శించలేదు).

## మసహ్ భంగమయ్యే సందర్భాలు

1. పైన పేర్కొన్న గడువు ముగిసినప్పుడు.
2. సాక్సులు తీసివేసినప్పుడు.
3. గుసుల్ చేయటం అనివార్యమయ్యే పరిస్థితుల్లో.

## మోడల్ ప్రశ్నలు

1) వుజూ చేసే విధానాన్ని వ్రాయండి?
2) సాక్సులపై మసహ్ చేసే దానిని గురించి తెల్పండి?
3) సాక్సులపై చేసిన మసహ్ భంగం అయ్యే సందర్భాలు ఏవి?
4) వుజూలోని సున్నత్‌లను తెల్పండి?

## ఖాళీలు పూరించండి

1) వుజూ చేసుకునే ముందు .......... చేసుకోవాలి?
2) వుజూ చేసే ముందు........... అని పలకాలి.
3) సాక్సులపై ........ చేసుకోవచ్చు.
4) ............ తీసివేసినపుడు మసహ్ భంగం అవుతుంది.

https://teluguislam.net

28వ పాఠం

# వుజూ నియమాలు

1. ఇస్లాం పట్ల విశ్వాసం కలిగి ఉండటం.
2. గుస్ల్ చేసిన (పరిశుద్ధ) స్థితిలో ఉండటం.
3. మతి స్థిమితం కలిగి (స్పృహలో) ఉండటం
4. సంకల్పం (నియ్యత్) చేసుకోవటం. సంకల్పాన్ని ఉచ్చరించాల్సిన అవసరం లేదు. చేసే పనిని మనస్సులో తలచుకోవటాన్నే సంకల్పం అంటారు.
5. మలమూత్ర విసర్జన తరువాత నీటితోగాని లేదా మట్టిపెడ్డతోగాని లేదా టిష్యూ పేపర్‌లతో గాని శుభ్రపరుచుకోవాలి. ఇంకా ఇతర మాలిన్యాల నుండి కూడా పరిశుద్ధత పొంది ఉండాలి.
6. పరిశుభ్రమైన, ధర్మసమ్మతమైన నీటిని ఉపయోగించుకోవాలి.
7. చర్మం పూర్తిగా తడిసేలా నీళ్ళతో కడగాలి.

మూత్రపు చుక్కలు పడే వ్యాధి గలవారు, ఎడతెగకుండా అపాన వాయువు వెలువడుతుండేవారు, అధిక రక్తస్రావం (ఇస్తిహాజ) వ్యాధి గల మహిళలు నమాజ్ సమయంలో తప్పనిసరిగా వుజూ చేసుకోవాలి. ఇలాంటి వారు నమాజ్ చేస్తున్నప్పుడు మధ్యలో పైన పేర్కొన్న సమస్యలు ఎదురైనప్పటికీ వారి వుజూ భంగం కాదు.

## మోడల్ ప్రశ్నలు

1) వుజూ చేయడానికి గల నియమాలు తెల్పండి?
2) మూత్రపు చుక్కలు పడే వ్యాధిగల వారి వుజూ గురించి తెల్పండి?

https://teluguislam.net

29వ పాఠం

# వుజూలో తప్పనిసరిగా చేయవలసిన పనులు

1. నోరు పుక్కిలించటం, ముక్కు శుభ్రపరచుకోవడంతో పాటు పూర్తిగా ముఖాన్ని ఒకసారి కడగటం.
2. రెండు చేతులను మోచేతుల సమేతంగా కనీసం ఒకసారి కడగటం.
3. రెండు చేతులను తడిపి తల ముందు భాగం నుండి స్పర్శిస్తూ మెడ వరకు చేతుల్ని తీసుకెళ్ళాలి. అక్కడి నుండి చేతుల్ని తిరిగి మొదలుపెట్టిన చోటుకి తీసుకురావాలి. (మెడ తడవకూడదు).
4. చీలమండల సమేతంగా రెండు కాళ్ళనూ కడగటం.
5. పైన తెలుపబడిన 4 అంశాలనూ ఇచ్చిన క్రమంలోనే చేయటం.
6. వుజూ చేసేటప్పుడు అనవసరంగా జాప్యం చెయ్యకుండా నిర్ణీత పనులన్నీ–ఎడతెగకుండా – ఒకదాని తరువాత ఒకటి పూర్తి చెయ్యాలి.

## మోడల్ ప్రశ్నలు

1) వుజూలో తప్పనిసరిగా చేయవలసిన పనులు ఏవి?

## తప్పు ఒప్పులు

1) వుజూ చేసేటప్పుడు చేతులను మూడు సార్లు కడగాలి (    )
2) వుజూలో భాగంగా మెడ తడపడం అసవరం లేదు ( )
3) వుజూలో కాళ్ళు మోకాళ్ళ వరకు కడగాలి (    )
4) వుజూ వరుస క్రమంలో చేయాలి (    )

https://teluguislam.net

## 30వ పాఠం

# వుజూను భంగపరిచే విషయాలు

**వుజూ నాలుగు విషయాల వల్ల భంగమవుతుంది.**

1. మలమూత్ర మార్గాల గుండా ఏదయినా వస్తువు విసర్జింపబడటం. (బుఖారీ)
2. మత్తు లేక అపస్మారక స్థితికి లోనవటం, గాఢ నిద్ర. (అబూదావూద్)
3. వస్త్రం అడ్డం లేకుండా మర్మాంగాన్ని ముట్టుకోవటం. (తిర్మిజీ)
4. ఒంటె మాంసం తినటం వల్ల. (ముస్లిం)

**గమనిక:** ఏ కారణాల మూలంగానయితే గుసుల్ భంగమవుతుందో వాటి మూలంగా వుజూ కూడా భంగమవుతుంది. ఉదా: సంభోగం, బహిష్టు స్రావం మొదలగునవి.

## మోడల్ ప్రశ్నలు

1) వుజూను భంగపరిచే విషయాలు వ్రాయండి?

## తప్పు ఒప్పులు

1) గుసుల్ భంగం అయినపుడు వుజూ కూడా భంగం అవుతుంది( )
2) కూర్చొని నిద్రపోతే వుజూ భంగం అవదు ( )
3) ఒంటె మాంసం తినడం వల్ల వుజూ భంగం కాదు. ( )

https://teluguislam.net

# 31వ పాఠం తయమ్ముమ్

నీళ్లు దొరకనప్పుడు నీటికి బదులుగా శుభ్రమైన నేల, మట్టి, ఇసుక లేదా రాయితో 'తయమ్ముమ్' చేసుకొని పరిశుభ్రతను పొందవచ్చు.

## తయమ్ముమ్ చేసే విధానం

1. మొదటగా తయమ్ముమ్ చేస్తున్నట్లు మనస్సులో సంకల్పం చేసుకోవాలి.
2. రెండు అరచేతుల్ని నేలపై కొట్టాలి.
3. తర్వాత రెండు అర చేతులను ముఖంపై తుడుచుకోవాలి.
4. తరువాత కుడి చేతి ఉపరితలంపై మణికట్టు వరకు, ఎడమ చేత్తో తుడుచుకోవాలి. అలాగే ఎడమ చేతి ఉపరితలంపై మణికట్టు వరకు కుడి చేత్తో తుడుచుకోవాలి.

## మోడల్ ప్రశ్నలు

1) తయమ్ముమ్ ఎలా చేయాలి? ఎప్పుడు చేయాలి?

2) తయమ్ముమ్ దేనిని అంటారు?

### తప్పు ఒప్పులు

1) తయమ్ముమ్ చేసేటప్పుడు ఒక చేయిని నేలపై కొట్టాలి (    )

2) తయమ్ముమ్‌కు సంకల్పం అవసరం లేదు (  )

https://teluguislam.net

32వ పాఠం

# గుసుల్ (స్నానం)ను అనివార్యం చేసే విషయాలు

1. మేల్కొన్న అవస్థలోనైనా లేదా నిద్రావస్థలోనైనా లైంగిక కోరికల మూలంగా వీర్యస్ఖలనం జరిగితే ఆ స్థితిని అరబీలో 'జునుబ్' అని అంటారు. అప్పుడు ఒకవేళ వీర్యస్ఖలన తడి అసలు కనిపించకపోతే గుసుల్ (స్నానం) చేయవలసిన అవసరం లేదు, కాని తడిని గమనించినట్లయితే అప్పుడు గుసుల్ అనివార్యమవుతుంది.
2. సంభోగం తరువాత గుసుల్ చేయటం అనివార్యమవుతుంది. ఆ స్థితిలో వీర్యస్ఖలనం జరగకపోయిప్పటికీ స్త్రీ, పురుషుల మర్మావయవాలు కలిస్తే చాలు గుసుల్(స్నానం) చేయటం తప్పనిసరి.
3. రుతుస్రావం (బహిష్టు) ఆగిన తరువాత మహిళలు గుసుల్ చేయడం తప్పనిసరి.
4. ప్రసవానంతరం 40 రోజులకు పురిటిరక్త స్రావం ఆగిన తరువాత కూడా మహిళలు గుసుల్ చేయటం తప్పనిసరి.
5. ఎవరైనా ఇస్లాం స్వీకరించినప్పుడు గుసుల్ చేయాలి.
6. ముస్లిం మరణిస్తే అతనికి (ఆమెకు) గుసుల్ అనివార్యమవుతుంది.

## మోడల్ ప్రశ్నలు

1) గుసుల్ అనివార్యం చేసే విషయాలు తెల్పండి?

https://teluguislam.net

# 33వ పాఠం గుసుల్ (ధర్మప్రకార స్నానం) చేసే విధానం

## గుసుల్ చేసే పద్ధతి

గుస్ల్‌లో తప్పకుండా చేయవలసిన విషయాలు, స్వచ్ఛందంగా చేయదగిన పనులు అన్నీ కలిపి దైవప్రవక్త (స) విధానం ప్రకారంగా ఈ క్రింద గుస్ల్ చేసే సంపూర్ణ విధానం తెలియజేయబడింది:

1. మనసులో గుసుల్ చేస్తున్నట్లు సంకల్పించుకుని 'బిస్మిల్లాహ్' అని పలకాలి.
2. 3 సార్లు మణికట్ల వరకూ రెండు చేతులను కడగాలి.
3. తరువాత మర్మాంగాన్ని కడుక్కోవాలి.
4. ఆ తరువాత నమాజ్‌కు ముందు వుజూ చేసుకున్నట్లే వుజూ చేసుకోవాలి. కాని ఇందులో కాళ్ళు కడగకూడదు.
5. తలవెంట్రుకల మొదళ్ళ వరకూ నీరు చేరేలా తల మీద నుంచి మూడుసార్లు నీళ్ళు పోసుకోవాలి.
6. కుడివైపు నుండి మొదలుపెట్టి ఎడమవైపు వరకూ మోచేతులు, చెవులు, వేళ్ళు శరీరమంతా వెంట్రుకవాసి కూడా పొడి లేకుండా నీళ్లు పోసుకోవాలి.
7. చివర్లో కాళ్ళు కడుక్కోవాలి.

**గమనిక:**

1. మహిళలు కూడా పురుషులు చేసినట్లుగానే గుసుల్ చెయ్యాలి. కాని స్త్రీలు జుట్టు ముడివేసుకున్నట్లయితే జడను విప్పాల్సిన అవసరం లేదు. తల మీద నుంచి మూడు దోసిళ్ళు నీళ్ళు పోసుకుంటే సరి పోతుంది. (అయితే బహిష్టు, పురిటి రక్తస్రావం అనంతరం గుస్ల్

https://teluguislam.net

చేసేవారికి ఈ వెసులుబాటు ఉండదు. వారు జడలు పూర్తిగా విప్పి స్నానం చేయవలసిందే).

2. గుసుల్ చేయడం పూర్తయిన తర్వాత బాత్‌రూమ్ నుండి బయటకు వచ్చేటప్పుడు వుజూ ముగించుకున్న తరువాత పఠించాల్సిన దుఆను పఠించాలి.

3. క్రూర మృగాలు లేదా మనుషుల దాడుల వల్ల ధన ప్రాణాలకు, నష్టం కలుగుతుందన్న భయం ఉన్నప్పుడు నీళ్ళు అందుబాటులో ఉన్నప్పటికీ 'తయమ్ముమ్' చేసుకోవచ్చు.

4. త్రాగడానికి, వంట చేయడానికి మాత్రమే నీరు ఉన్న పరిస్థితిలో కూడా 'తయమ్ముమ్' చేసుకోవచ్చు.

## మోడల్ ప్రశ్నలు

1) గుసుల్ చేసే విధానాన్ని వ్రాయండి?
2) మహిళలు గుసుల్ చేసేటప్పుడు వారి వెంట్రుకల విషయంలో ఏం చేయాలి?
3) గుసుల్ చేయడం అనివార్యం అయి ఉండి నీరు దొరకనప్పుడు ఏం చేయాలి?

**అవును, కాదు**

1) గుసుల్‌లో భాగంగా వుజూ చేసినపుడు కాళ్ళు కడగాలి (     )
2) గుసుల్ చేసినపుడు మొత్తం శరీరం ఒక్క వెంట్రుక భాగం కూడా తడి లేకుండాలి (     )
3) మనసులో గుసుల్ చేసుకుంటున్నట్లు సంకల్పించుకోవాలి (     )
4) త్రాగడానికి, వంట చేసుకోవడానికి మాత్రమే నీరు ఉన్నప్పుడు తయమ్ముమ్ చేసుకోవచ్చు. (     )

https://teluguislam.net

అధ్యాయం - 4

# ఆచరణలు ఆరాధనలు

https://teluguislam.net

34వ పాఠం

# నమాజు, ప్రార్థనలు మనం ఎందుకు చేస్తాం?

తన దాసులు తన కోసం నమాజు చేస్తే, తనను ప్రార్థిస్తే అల్లాహ్ ఎంతో ఆనందిస్తాడు. ఆరాధనల్లో అత్యుత్తమమైన ఆరాధన నమాజు లేక ప్రార్థనే. వాటి ద్వారానే ఒక ముస్లిం అల్లాహ్ పట్ల తన భక్తిని, విధేయతను చాటుకుంటాడు.

అల్లాహ్ మనల్ని అత్యంత అందమైన ఆకృతిలో పుట్టించాడు. కేవలం పుట్టించి వదలిపెట్టలేదు. పైగా అత్యుత్తమ జీవన విధానం(ఇస్లాం) కూడా మనకు తెలియజేశాడు. ఆ మార్గంలో నడిపిస్తున్నాడు. అందుకు కృతజ్ఞతగా మనం అల్లాహ్ కోసం నమాజు చేస్తాం. ఆయన్ను ప్రార్థిస్తాం.

అల్లాహ్ సన్నిధిలో ఆయన మాటల్లోనే (అనగా దివ్య ఖుర్ఆన్ పారాయణం చేస్తూనే) ఒక ముస్లిం తన అవసరాలను గురించి అల్లాహ్‌ను అర్థిస్తాడు. తన మనసులో అనుకుంటున్నది వెలిబుచ్చుతాడు. మొత్తానికి అల్లాహ్ సన్నిధిలో ముస్లిం మనో వ్యక్తీకరణకు చక్కటి అవకాశం నమాజు.

నమాజు మనిషికి అల్లాహ్‌ను, అల్లాహ్ ఆజ్ఞల్ని సదా జ్ఞాపకం ఉంచుకునేలా చేస్తుంది. ఒక ముస్లిం ప్రాపంచికపు పనుల్లో ఎంత తలమునకలై ఉన్నా నమాజు అతన్ని ఏ క్షణానా అల్లాహ్‌ను మరిచిపోనివ్వదు. నమాజు ద్వారా అల్లాహ్ సహాయాన్ని కోరవచ్చు. జీవన అంధకారంలో నమాజు ముస్లింకు నిత్య మార్గదర్శనం చేస్తుంది.

ముస్లిం గుండెల్లో అల్లాహ్ పట్ల ప్రేమనూ, భీతినీ నమాజు పటిష్టపరుస్తుంది. దానివల్ల ముస్లిం సన్మార్గంపై నిలకడగా ఉండగలుగుతాడు. అల్లాహ్ నిర్దేశించిన నియమావళిని, ప్రవక్త ముహమ్మద్ (స) ప్రబోధించిన పద్ధతులను పాటించటం అతనికి ఎంతో సులువు అయి

https://teluguislam.net

పోతుంది. నమాజు, ప్రార్థనలకు అల్లాహ్ సన్నిధిలో ఎంతో పుణ్యఫలం, సత్కారం ఉంటుంది. వాటిని నిక్కచ్చిగా పాటించే దాసుల పాపాలు మన్నించబడుతూ ఉంటాయి.

నమాజు వల్ల దాసునికి పరలోకంలో గొప్ప ప్రతిఫలం లభిస్తుంది. ప్రార్థన చేసే దాసులు సుఖసంతోషాల నిలయమైన స్వర్గానికి వారసులౌ తారు. నమాజు వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడే ఓ విలక్షణమైన అభ్యాసం. ఈ ఆరాధనను ఉత్తమంగా, అంకితభావంతో గనక పాటిస్తే దీనివల్ల ముస్లింలకు ఎన్నో అమూల్యమైన ప్రయోజనాలు కలుగుతాయి. నమాజు వల్ల శారీరక, నైతిక, ఆధ్యాత్మిక లాభాలెన్నో ఉన్నాయి. పరిశుభ్రత, ఆరోగ్యం, క్రమబద్ధత, సమయపాలన, సోదరభావం, సమానత్వం, ఐకమత్యం లాంటి ఎన్నో సుగుణాలు నమాజు వల్ల సమాజంలో పెంపొందుతాయి.

## మోడల్ ప్రశ్నలు

1) నమాజ్ ఎందుకు చేయాలి? దాని విశిష్ఠతను తెల్పండి?
2) నమాజ్ చేయడం వల్ల మనలో ఎటువంటి మార్పు వస్తుంది?

## ఖాళీలు పూరించండి

1) .................. ద్వారానే ఒక ముస్లిం అల్లాహ్ పట్ల భక్తిని చాటు కుంటాడు.
2) అల్లాహ్ మనల్ని అత్యంత.........., ....... లో పుట్టించాడు.
3) జీవన అంధకారంలో నమాజు ముస్లింకు నిత్య......... చేస్తుంది.
4) నమాజు నిక్కచ్చిగా పాటించే దాసుల ...... మన్నించబడుతూ ఉంటాయి.
5) నమాజు వల్ల దాసునికి పరలోకంలో గొప్ప......... లభిస్తుంది.

https://teluguislam.net

# 35వ పాఠం నమాజులోని విధులు (అర్కాన్)

నమాజ్‌లో ఈ క్రింది అంశాలు విధులు. వాటిని నెరవేర్చటం తప్పనిసరి.

1. **ఖియామ్:** అంటే నమాజ్ కొరకు నిలబడటం.
2. నమాజ్ ప్రారంభించేటప్పుడు **తక్బీరె తహ్రీమా** అంటే **'అల్లాహు అక్బర్'** అని పలకటం.
3. దివ్య ఖుర్ఆన్ ఆరంభ సూరా **(ఫాతిహా సూరా)**ను ప్రతీ రకాత్‌లో పఠించటం.
4. **రుకూ–** తల, వీపు సమాంతరంగా ఉండేటట్లుగా వంగి చేతులతో మోకాళ్లను గట్టిగా అదిమి పట్టుకోవటం. ఆ సమయంలో చేతి వేళ్లు వెడల్పుగా ఉంచాలి.
5. **ఖౌమా –** రుకూ నుండి లేచి నిటారుగా నిలబడటం.
6. రుకూ నుండి లేచి నిలబడినప్పుడు వెన్నుముకను నిటారుగా ఉంచాలి. శరీరంలోని ఎముకలన్నీ తమ తమ స్థానాల్లోకి చేరుకోవాలి.
7. **సజ్దా–** ఏడు భాగాలను అనగా 2 చేతులు, 2 పాదాల వ్రేళ్ళు, 2 మోకాళ్ళు, ముక్కు సహితంగా నుదురును నేలకు ఆనించి సజ్దా (సాష్టాంగ ప్రణామం) చేయటం.
8. సజ్దా నుండి తలను పైకెత్తడం.
9. రెండు సజ్దాల మధ్య స్థిమితంగా కూర్చోవడం.
10. **తషహ్హుద్** వచనాలను పఠించడానికి కూర్చోవడం.
11. **తషహ్హుద్** (సాక్ష్యమిచ్చే వచనాలను) పఠించటం.

https://teluguislam.net

12. దైవప్రవక్త ముహమ్మద్(స)పై దరూద్ పఠించటం.
13. **తస్లీం– 'అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహ్'** అనే వచనాలతో నమాజ్‌ను ముగించటం.
14. నమాజ్‌లోని ముఖ్యాంశాలన్నింటిని ప్రశాంతంగా, నింపాదిగా నెరవేర్చటం.

పైన పేర్కొనబడిన నమాజ్‌లోని ముఖ్యాంశాలలో ఏ ఒక్కటి వదిలినా, ఏ నమాజ్‌లోని ఏ రకాత్‌లో వదిలివేస్తే ఆ రకాతును తిరిగి ఆ నమాజ్‌లోనే నెరవేర్చవలసి ఉంటుంది.

కాని **'తక్బీరె తహ్రీమా'** (నమాజ్‌ను ప్రారంభించే మొదటి తక్బీర్) మరచిపోతే మాత్రం మొత్తం నమాజ్ మళ్లీ చేయాల్సి వుంటుంది.

## మోడల్ ప్రశ్నలు

1) ఖియామ్, తక్బీరె తహ్రీమ్, రుకూ, ఖౌమ, సజ్దాహ్ ఈ పదాల వివరణ ఇవ్వండి?
2) నమాజ్‌లోని విధులు ఎన్ని? అవి ఏవి? వివరించండి.

## ఖాళీలు పూరించండి

1) ఖియామ్ అంటే........................... కొరకు నిలబడటం.
2) తక్బీరె తహ్రీమ్ అంటే............................. అని పలకటం.
3) తషహ్హుదు అంటే......................... వచనాలు పఠించడం.
4) తస్లీం అంటే................................ వచనాలు పఠించడం.

https://teluguislam.net

36వ పాఠం

# నమాజ్ నియమాలు

1. **ఇస్లామీయ విశ్వాసాల స్వీకరణ:** అల్లాహ్ తప్ప వేరే ఆరాధ్యుడు లేడని, ముహమ్మద్(స) దైవ సందేశహరులని సాక్ష్యమిచ్చేవారికే నమాజు. ఆ విశ్వాసం లేనివారి నమాజు సమ్మతం కాదు.

2. **నియ్యత్:** ఇది అరబ్బీ పదం. దీని అర్థం నిర్ణీత పని చేయాలని మనస్సులో సంకల్పించుకోవడం.

3. **పరిశుభ్రత:** నమాజ్ చేసే వ్యక్తి శరీరం, దుస్తులు, నమాజ్ చేసే స్థలం పరిశుభ్రంగా ఉండటం.

4. **పరిశుద్ధత:** నమాజ్ చేసే ముందు వుజూ చేయడం (లేదా గుసుల్ అనివార్యమైతే గుసుల్ చేయడం).

5. **సతర్(ఆచ్ఛాదన):** పురుషుడు కనీసం నాభి నుండి మోకాళ్ల క్రింది వరకూ గల భాగాన్ని కప్పి ఉంచడం తప్పనిసరి. మహిళలయితే ముఖం, అరచేతులు తప్ప మిగిలిన శరీర భాగమంతా కప్పి ఉంచాలి. ఒకవేళ చుట్టుపక్కల్లో పురుషులు ఉన్నట్లయితే ముఖం, అరచేతుల సమేతంగా మొత్తం శరీరాన్ని కప్పుకోవాలి.

6. **ఖిబ్లా వైపు ముఖం చేసి నిలబడటం:** నమాజ్ చేస్తున్నప్పుడు వ్యక్తి తన ముఖాన్ని ఖిబ్లా (మక్కానగరంలోని పవిత్ర కాబాగృహం) వైపునకు త్రిప్పుకోవాలి. కొత్త ప్రదేశానికి వెళ్లినప్పుడు ఖిబ్లా ఎటువైపో తెలియకపోతే ఏదయినా ఒక దిక్కును ఖిబ్లాగా భావించి అటువైపు తిరిగి నమాజ్ చేయాలి.

https://teluguislam.net

**7. సమయం:** నిర్ణీత వేళల్లోనే  నమాజ్ చేయాలి.

## మోడల్ ప్రశ్నలు

1) నమాజ్ చేయడానికి కావల్సిన నియమాలు తెల్పండి?

## ఖాళీలు పూరించండి

1) నియ్యత్ అనేది............ భాషా పదం.
2) సతర్ అంటే .....................
3) .......... వేళల్లోనే నమాజ్ చేయాలి.
4) నియ్యత్ అంటే నిర్ణీత పనిని చేయాలని .........లో అనుకోవడం.

## అవును / కాదు

1) కేవలం ముస్లింలు మాత్రమే నమాజ్ చేయాలి ( )
2) నియ్యత్ అనేది ఉర్దూ పదం ( )
3) నమాజ్ చేసే వ్యక్తి శుభ్రంగా ఉండి స్థలం శుభ్రంగా లేకున్నా ఫరవాలేదు ( )
4) పురుషుడు నమాజ్‌లో తప్పనిసరిగా పూర్తి శరీరాన్ని కప్పి ఉంచాలి. ( )
5) నిర్ణీత వేళల్లోనే నమాజ్ చెయ్యాలి. ( )

https://teluguislam.net

## 37వ పాఠం

# నమాజ్‌లోని తప్పనిసరి కార్యాలు, తషహ్హుద్ చదివే విధానం

ఇంతకు ముందు పేర్కొనబడిన నమాజ్‌లోని 14 ముఖ్యాంశాలతో పాటు నమాజ్ పూర్తి చేయడానికి తప్పనిసరిగా చేయవలసిన (వాజిబ్) కార్యాలు క్రింది విధంగా ఉన్నాయి:

1. తక్బీరె తహ్రీమా తప్ప ఇతర తక్బీర్లన్నీ పలకటం.
2. రుకూ స్థితిలో 'సుబ్‌హాన రబ్బియల్ అజీం' అని ఒకసారి పలకటం.
3. ఇతరులకు నమాజ్ చేయిస్తున్న ఇమామ్ అయినా లేక ఒంటరిగా నమాజ్ చేస్తున్నా రుకూ నుండి తల పైకి ఎత్తినప్పుడు 'సమి అల్లాహు లిమన్ హమిదహ్' అని ఒకసారి పలకటం.
4. ఇమామ్‌గాని, ముక్తదీగాని, ఒంటరిగా నమాజ్ చేస్తున్న వ్యక్తిగాని, రుకూ నుండి నిలబడినప్పుడు 'రబ్బనా వలకల్ హమ్ద్' అని (ఒకసారి) చెప్పటం.
5. సజ్దా స్థితిలో 'సుబ్‌హాన రబ్బియల్ ఆలా' అని ఒకసారి పఠించటం.
6. ప్రతీ రకాత్‌లో రెండు సజ్దాల మధ్య వచ్చే విరామంలో 'రబ్బిగ్ఫిర్లీ' పలకడం.
7. జుహ్ర్, అస్ర్, మగ్‌రిబ్ మరియు ఇషా నమాజ్‌లలో రెండు రకాతుల తరువాత మొదటి తషహ్హుద్ కొరకు కూర్చోవటం.
8. జుహ్ర్, అస్ర్, మగ్‌రిబ్ మరియు ఇషా నమాజ్‌లలో రెండు రకాతుల తరువాత తషహ్హుద్ (సాక్ష్య వచనాలు) పఠించటం

పైన పేర్కొన్న 8 విషయాలలో ఏదైనా నెరవేర్చటం మరచిపోతే నమాజ్ చివరలో 2 సజ్దాలు అదనంగా చేసి ఆ మరుపును సరిదిద్దు కోవాలి. ఒకవేళ వీటిలో ఏ ఒక్క వాజిబ్‌నైనా ఉద్దేశ్యపూర్వకంగా విడిచి పెట్టినట్లయితే ఆ నమాజ్ అవదు. మళ్లీ నమాజ్ చేయాల్సి ఉంటుంది.

https://teluguislam.net

## తషహ్హుద్

**అత్తహియ్యాతు లిల్లాహి వస్సలవాతు వత్తయ్యిబాతు అస్సలాము అలైక అయ్యుహన్నబియ్యు వ రహ్మతుల్లాహి వ బరకాతుహూ అస్సలాము అలైనా వ అలా ఇబాదిల్లాహిస్సాలిహీన్. అష్హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహు వ అష్హదు అన్న ముహమ్మదన్ అబ్దుహూ వ రసూలుహూ.**
**అల్లాహుమ్మ సల్లి అలా ముహమ్మదిన్ వ అలా ఆలి ముహమ్మదిన్ కమా సల్లైత అలా ఇబ్రాహీమ వ అలా ఆలి ఇబ్రాహీమ ఇన్నక హమీదుమ్ మజీద్. అల్లాహుమ్మ బారిక్ అలా ముహమ్మదిన్ వ అలా ఆలి ముహమ్మదిన్ కమా బారక్త అలా ఇబ్రాహీమ వ అలా ఆలి ఇబ్రాహీమ ఇన్నక హమీదుమ్ మజీద్.**

**తషహ్హుద్ అర్థం:**

శుభప్రదమైన, దేహపరమైన, ధనపరమైన ఆరాధనలన్నీ అల్లాహ్‌కే చెందుతాయి. ప్రవక్తా, మీకు శాంతి కలుగుగాక! మీకు అల్లాహ్ కారుణ్యం, ఆయన శుభాలు ప్రాప్తమవుగాక! మాకూ, సదాచార సంపన్నులైన దాసు లందరికీ శాంతికల్గుగాక! అల్లాహ్ తప్ప వేరొక ఆరాధ్యుడు లేడని నేను సాక్ష్యమిస్తున్నాను. ముహమ్మద్(స) అల్లాహ్ దాసుడని, ఆయన దైవప్రవక్త అని కూడా నేను సాక్ష్యమిస్తున్నాను. ఓ అల్లాహ్! ఇబ్రాహీం (అ)పై, ఆయన ఆప్తులపై, సంబంధీకులపై నీవు ఎలా కారుణ్యం కురిపిం చావో అలాగే ముహమ్మద్(స)పై, ఆయన ఆప్తులపై, సంబంధీకులపై కూడా కారుణ్యం కురిపించు. నిశ్చయంగా నీవు స్తుతింపదగినవాడవు, గొప్ప మహత్తు గలవాడవు. ఓ అల్లాహ్! ఇబ్రాహీం(అ)కు, ఆయన ఆప్తులకు, సంబంధీకులకు ఏ విధంగా శుభాలు ప్రసాదించావో అలాగే ముహ మ్మద్(స)కు, ఆయన ఆప్తులకు, సంబంధీకులకు కూడా శుభాలు ప్రసా దించు. నిశ్చయంగా నీవు స్తుతింపదగినవాడవు, గొప్ప మహత్తు గలవాడవు.

### మోడల్ ప్రశ్నలు

1) నమాజ్‌లో తప్పనిసరిగా చేయాల్సిన పనులు ఏవి?

https://teluguislam.net

38వ పాఠం

# నమాజ్‌లోని సున్నత్‌లు

1. ప్రారంభ ప్రార్థనా వాక్యాలు (సనా) పఠించడం:
**"సుబ్‌హానకల్లాహుమ్మ వ బిహమ్దిక వ తబారకస్ముక వ తఆలా జద్దుక వ లా ఇలాహ గైరుక".**
**అర్థం:** ఓ అల్లాహ్! నీవు అత్యంత పరిశుద్ధుడవు. పొగడ్తలన్నీ నీ కోసమే. నీ నామం శుభకరమయినది, నీవు వైభవోన్నతులు గలవాడివి, నీవు తప్ప మరో ఆరాధ్య దైవం లేదు.
2. ఎడమ చెయ్యిపై కుడి చెయ్యి పెట్టి రొమ్ములపై చేతులు కట్టుకుని నిలబడటం.
3. కింది సందర్భాలలో చేతులను భుజాలు లేదా చెవుల వరకు ఎత్తాలి.
(i) తక్బీరె తహ్రీమా పలుకుతున్నప్పుడు.
(ii) రుకూలోనికి వెళ్ళే ముందు.
(iii) రుకూ నుండి లేచినప్పుడు.
(iv) మొదటి తషహ్హుద్ తరువాత 3వ రకాతు కొరకు నిలబడినప్పుడు.
4. రుకూలో ఒకటి కంటే ఎక్కువ సార్లు **'సుబ్‌హాన రబ్బియల్ అజీం'** అని పలకడం.
5. 'ఫాతిహా' సూరా తరువాత బిగ్గరగా "ఆమీన్" పలకడం.
6. ఖుర్‌ఆన్ పఠించే ముందు **'అవూజు బిల్లాహి మినష్షయితా నిర్రజీమ్', 'బిస్మిల్లా హిర్రహ్మానిర్రహీమ్'** పఠించటం.
7. రెండు సజ్దాల మధ్య విరామంలో కూర్చున్నప్పుడు ఒకటి కంటే ఎక్కువ సార్లు **'రబ్బిగ్‌ఫిర్లీ'** అని పఠించటం.
8. తల, వీపు సమాంతరంగా ఉండేలా రుకూ చేయటం.

https://teluguislam.net

9. సజ్దా చేసేటప్పుడు చేతులు పొట్టకు, ప్రక్కటెముకలకు ఆనకుండా మరియు పొత్తికడుపుకు తొడలు, తొడలకు కాళ్ళు తగలకుండా ఎడంగా ఉంచటం.
10. సజ్దా చేసేటప్పుడు మోచేతుల్ని నేలకు తాకకుండా పైకెత్తి ఉంచాలి. మహాప్రవక్త ముహమ్మద్(స) ఇలా సెలవిచ్చారు: "మీ చేతులను కుక్కల వలే నేలపై పరచకండి".
11. సజ్దా నుండి తల పైకెత్తి తరువాత ఎడమకాలి పాదాన్ని పరచి దాని మీద కూర్చోవాలి. కుడి పాదాన్ని నిలిపి ఉంచాలి.
(అ) మొదటి తషహ్హుద్ పఠిస్తున్నప్పుడు,
(ఆ) రెండు సజ్దాల మధ్య విరామంలో కూర్చున్నప్పుడు,
(ఇ) రెండు రకాత్‌ల నమాజ్‌లో తషహ్హుద్ పఠించేటప్పుడు పైన పేర్కొన్న విధంగా కూర్చోవాలి.
12. **తవర్రుక్:** జుహ్ర్, అస్ర్, మగ్రిబ్, ఇషా నమాజుల్లోని చివరి తషహ్హుద్ కొరకు కూర్చునే సమయంలో కుడి పాదాన్ని నేలమీద నిలిపి ఉంచి వ్రేళ్ళు ఖిబ్లా దిశగా ఉంచాలి. ఎడమ పాదాన్ని కుడికాలు క్రింది నుంచి వెలుపలకు తీసి, ఎడమ పిరుదును నేలకు ఆనించి కూర్చోవాలి.

## మోడల్ ప్రశ్నలు

1) నమాజ్‌లోని సున్నత్‌లను వివరించండి?

## ఖాళీలు పూరించండి

1) ఫాతిహా సూరా తరువాత బిగ్గరగా ........ అని పలకాలి.
2) ఖుర్ఆన్‌ని పఠించే ముందు ............ చదవాలి.
3) .......... అంటే చివరి తషహ్హుద్ కోసం కూర్చునే విధానం.

https://teluguislam.net

39వ పాఠం

# నమాజ్‌ను భంగపరిచే విషయాలు

1. నమాజ్ చేసేటప్పుడు ఉద్దేశ్యపూర్వకంగా మాట్లాడటం.
2. నవ్వడం.
3. తినడం.
4. త్రాగడం.
5. సతర్ (ఆచ్ఛాదన ఉండవలసిన శరీర భాగం) మీద నుండి వస్త్రం తొలగడం. (ఆచ్ఛాదన వివరాలు 118వ పేజీలో)
6. నమాజులో కాబా దిశ నుంచి వేరే వైపుకు తిరగటం.
7. నమాజ్‌లో నమాజ్‌కు సంబంధించని పనిని ఎక్కువ సేపు చేయటం.
8. వుజూను భంగపరిచే(అపానవాయువు విసర్జన మొదలగు) విషయాలు జరగటం.
9. నమాజ్‌లోని ముఖ్యాంశాల (అర్కానె నమాజ్)లో ఏ ఒక్క అంశం తప్పిపోయినా నమాజ్ నెరవేరదు. ఉదా: ఖియామ్, ఫాతిహా సూరా పఠనం మొదలగునవి.

## మోడల్ ప్రశ్నలు

1) నమాజ్ ఏయే కార్యాల వల్ల భంగమవుతుందో వివరించండి?

## ఖాళీలు పూరించండి

1) వుజూ భంగమైతే ........... కూడా భంగమవుతుంది.
2) ............ దిశ నుండి ముఖం తిరగడం వల్ల నమాజ్ భంగమవుతుంది.
3) అర్కానె నమాజ్‌లో ఏ ఒక్క అంశం తప్పిపోయినా........ నెరవేరదు.

https://teluguislam.net

# 40వ పాఠం నమాజ్‌లో మరచిపోయినప్పుడు చేసే సజ్దా (సహూ సజ్దా)

మనిషి అన్నాక మరిచిపోవడం, పొరపాటు జరగటం సహజం. పైన పేర్కొన్నట్లుగా నమాజ్‌లోని ముఖ్యాంశాలు, వాజిబ్‌లు నెరవేర్చటంలో పొరపాటు జరిగినప్పుడు నమాజ్ చివరిలో అదనంగా రెండు సజ్దాలు చేయడాన్ని “సహూ సజ్దాలు” (మరిచిపోయినప్పుడు చేసే సజ్దాలు) అని అంటారు. ఇంకా ఏదన్నా రుకున్ (ముఖ్యాంశం) విడిచిపెడితే దానిని తిరిగి నెరవేర్చటం అవసరం.

మరుపు వల్ల జరిగే 4 ప్రధాన తప్పులు క్రింద ఇవ్వబడ్డాయి:

- ఒకవేళ నమాజ్‌లో ఏదైనా కార్యం ఎక్కువగా జరిగినప్పుడు

  ఉదాహరణకు; జుహ్ర్ నమాజ్‌లో 4 రకాతులకు బదులు 5 రకాత్‌లు చేసినప్పుడు. ‘అస్సలాము అలైకుమ్’ పలకడానికి ముందుగా 2 సహూ సజ్దాలు చేయాలి.

- చేయవలసిన రకాతుల కంటే తక్కువ సంఖ్యలో నమాజ్ చేయడం.

  ఉదాహరణకు జుహ్ర్ నమాజ్‌లో 4 రకాత్‌లకు బదులుగా 3 రకాత్‌లు చేస్తే, ఆ ఒక్క రకాత్ చేసి ‘అస్సలాము అలైకుమ్’ అని పలకడానికి ముందు సహూ (మరపు కారణంగా) రెండు సజ్దాలు చేయాలి.

- ఒకవేళ ఏదైనా కార్యం అధికంగా చేయడం, విడిచిపెట్టడం లాంటివి జరిగినప్పుడు,

https://teluguislam.net

'అస్సలాము అలైకుమ్' పలకక ముందే 2 సజ్దాలు చేయాలి.

## సందేహం కలిగినప్పుడు

నమాజులో ఏదైనా కార్యం ఎక్కువ చేశానా లేక తక్కువ చేశానా (ఉదా: ఒక సజ్దా చేశానా  లేక మూడు సజ్దాలు చేశానా) అన్న సందేహం కలిగినప్పుడు జాగ్రత్తకొద్ది దాన్ని తక్కువగా చేసినట్లుగానే పరిగణించుకొని 'అస్సలాము అలైకుమ్' పలకక ముందే 2 సహూ సజ్దాలు చేయాలి.

## సహూ సజ్దా అవసరమయ్యే కొన్ని సందర్భాలు

### (అ) నమాజ్‌లోని ఏదైనా ముఖ్యాంశాన్ని (రుకున్‌ను) విడిచినప్పుడు:

1. ఉదాహరణకు ఒక వ్యక్తి 'అల్-ఫాతిహా' సూరా పఠించడం మరిచిపోయి రుకూ చేయడానికి ముందు లేక రుకూ చేసినప్పుడు గాని అతనికి ఆ విషయం గుర్తుకొస్తే, అప్పుడు అతను వెంటనే తిన్నగా నిలబడి మామూలుగానే  అల్-ఫాతిహా సూరా మరియు ఖుర్‌ఆన్‌లోని ఇతర ఆయత్‌లు పఠించి నమాజ్ కొనసాగించాలి. కాని ఒకవేళ మరుపు మొదటి రకాతులో జరిగి రెండవ రకాత్‌లో ఆ పొరపాటును అతను గుర్తిస్తే, అప్పుడు మొదటి రకాత్ లెక్కలోనికి రాదు. రెండవ రకాతునే అతను మొదటి రకాతుగా భావించుకోవాలి. అలాంటి సమయంలో అతను ఒక రకాత్ అధికంగా చేసి నమాజ్‌ను పూర్తి చెయ్యాలి. నమాజ్ ముగించే ముందు 'అస్సలాము అలైకుమ్' పలికిన తరువాత 2 సహూ సజ్దాలు చేసి తరువాత మళ్లీ 'అస్సలాము అలైకుమ్' అని పలుకుతూ నమాజ్‌ను ముగించాలి.

https://teluguislam.net

2. ఒక వ్యక్తి ‘చివరి తషహ్హుద్’ కొరకు కూర్చున్నప్పుడు, తాను సజ్దా చేయడం మరచిపోయానని (అదే రకాత్‌లో) గుర్తుకొస్తే వెంటనే సజ్దా చేసి, కూర్చుని మరలా ‘తషహ్హుద్’ పఠించాలి. ఈ వ్యక్తి నమాజ్ ముగించే ముందు ‘అస్సలాము అలైకుమ్’ పలికిన తరువాత అదనంగా రెండు సహూ సజ్దాలు చేసి మరలా ‘అస్సలాము అలైకుమ్’ పలకాలి.

పైన పేర్కొనబడిన 2 రకాతుల పొరపాట్లలో నమాజ్‌లోని ఒక ముఖ్యాంశం (రుక్న్) తప్పిపోయినప్పుడు ఆ వ్యక్తి ఆ ముఖ్యాంశాన్ని తిరిగి నెరవేర్చటంతో పాటు 2 సహూ సజ్దాలు కూడా చేయవలసి ఉంటుంది.

## (ఆ) తప్పనిసరి అంశం (వాజిబ్)ను వదలిపెడితే

ఎవరైనా నమాజ్‌లోని వాజిబ్ కార్యాన్ని మరచిపోయినట్లైతే, అప్పుడు 2 సహూ సజ్దాలు చేస్తే సరిపోతుంది. ఇక్కడ విడిచి పెట్టిన అంశాన్ని లేదా పూర్తి రకాత్‌ను తిరిగి నెరవేర్చవలసిన అవసరం లేదు. ఒకవేళ ఎవరైనా ఏదైనా వాజిబ్ కార్యాన్ని విడిచిపెట్టినట్లు మధ్యలో గుర్తుకొచ్చినప్పుడు అతను మరలా వదిలిన కార్యాన్ని నెరవేర్చాల్సిన అవసరం లేదు. నమాజ్ ముగించడానికి ‘అస్సలాము అలైకుమ్’ పలికే ముందుగా 2 సహూ సజ్దాలు చేస్తే సరిపోతుంది.

## (ఇ) సున్నత్ కార్యాన్ని విడిచిపెట్టినప్పుడు

నమాజులో ఏదైనా సున్నత్ కార్యాన్ని మరిచిపోయి విడిచిపెట్టినప్పుడు ఆ కార్యాన్ని తిరిగి నెరవేర్చాల్సిన లేదా సహూ సజ్దా చేయాల్సిన అవసరం ఉండదు.

https://teluguislam.net

## మోడల్ ప్రశ్నలు

1) సహుసజ్దాహ్ అవసరమయ్యే సందర్భాలు ఏవి?

2) నమాజ్‌లో ఏదైనా సందేహం కలిగినప్పుడు ఏం చేయాలి?

3) సహు సజ్దాహ్ ఎప్పుడు చేయాలి? చేసే విధానం ఏమిటి?

## ఖాళీలు పూరించండి

1) నమాజ్‌లో మరిచిపోయినప్పుడు చేసే సజ్దాహ్‌ను...... అంటారు.

2) సహుసజ్దాలో ఎన్ని ................. సజ్దాలు చేస్తారు.

3) రుకున్ విడిచిపెడితే దానికి ................. అవసరం.

https://teluguislam.net

41వ పాఠం

# నమాజ్‌లో పఠించటానికి మచ్చుకు కొన్ని సూరాలు

## 1. సూరహ్ నాస్

బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్

**ఖుల్ అవూజు బిరబ్బిన్నాస్, మలికిన్నాస్. ఇలాహిన్నాస్, మిన్ షర్రిల్ వస్‌వాసిల్ ఖన్నాస్, అల్లజీ యువస్‌విసు ఫీ సుదూరిన్నాస్. మినల్ జిన్నతి వన్నాస్.**

అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

ఇలా అను: నేను మానవుల ప్రభువు, మానవుల చక్రవర్తి, మానవుల ఆరాధ్యదైవం (అయిన అల్లాహ్) శరణు కోరుతున్నాను – దుష్ట భావాలు రేకెత్తించేవాడి కీడు నుండి, వాడు మాటిమాటికీ మరలివస్తూ ప్రజల మనసుల్లో దుష్టభావాలను రేకెత్తిస్తాడు, వాడు జిన్నాతు జాతికి చెందిన వాడైనా కావచ్చు లేదా మానవ జాతికి చెందిన వాడైనా కావచ్చు.

## 2. సూరహ్ ఫలఖ్

బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్

**ఖుల్ అవూజు బిరబ్బిల్ ఫలఖ్. మిన్ షర్రి మా ఖలఖ్. వ మిన్ షర్రి గాసిఖిన్ ఇజా వఖబ్, వ మిన్ షర్రిన్నఫ్ఫాసాతి ఫిల్ ఉఖద్. వమిన్ షర్రి హాసిదిన్ ఇజా హసద్.**

అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

ఇలా అను: నేను ఉదయం ప్రభువు శరణు కోరుతున్నాను– ఆయన

https://teluguislam.net

సృష్టించిన ప్రతిదాని కీడు నుండి, కమ్ముకునే చీకటిరాత్రి కీడు నుండి, ముడులపై మంత్రించేవారి కీడు నుండి, అసూయాపరుడు అసూయ చెందేటప్పటి కీడు నుండి.

## 3. సూరహ్ ఇఖ్‌లాస్

బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్

**ఖుల్ హువల్లాహు అహద్. అల్లాహుస్సమద్. లమ్‌యలిద్ వలమ్ యూలద్. వలమ్‌యకుల్లహూ కుఫువన్ అహద్.**

అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

ఇలా చెప్పెయ్యి, ఆయన అల్లాహ్, అద్వితీయుడు. అల్లాహ్ నిరపేక్షా పరుడు. ఎవరి ఆధారమూ, ఎవరి అక్కరా లేనివాడు. అందరూ ఆయనపై ఆధారపడేవారే. ఆయనకు సంతానం ఎవరూ లేరు. ఆయన కూడా ఎవరి సంతానమూ కాదు. ఆయనకు సరిసమానులు ఎవరూ లేరు.

## 4. సూరహ్ లహబ్

బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్

**తబ్బత్ యదా అబీ లహబిం వ్వతబ్బ్. మాఅగ్‌నా అన్‌హు మాలుహూ వమా కసబ్. సయస్‌లా నారన్ జాత లహబ్, వమ్రఅతుహూ హమ్మాలతల్ హతబ్, ఫీజీదిహా హబ్‌లుమ్ మ్మిమ్మసద్.**

అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

అబూలహబ్ చేతులు విరిగిపోయాయి! అతడు సర్వనాశనం అయి పోయాడు. అతడి ఆస్తిపాస్తులు, అతడి సంపాదన అంతా దేనికీ

https://teluguislam.net

పనికిరాకుండా పోయింది. చివరికి అతడు తప్పకుండా భగభగమండే అగ్నిలో పడవేయబడతాడు. అంతేకాదు, (అతడితోపాటు) అతడి భార్య కూడ అందులో పడవేయబడుతుంది. ఆమె చాడీలు చెబుతూ కలహాలు రేపే స్త్రీ. ఆమె మెడలో బాగా పేనిన ఒక త్రాడు ఉంటుంది.

## 5. సూరహ్ నస్ర్

బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్

**ఇజా జాఅ నస్రుల్లాహి వల్ ఫత్‌హు వరఐతన్నాస యద్ఖులూన ఫీ దీనిల్లాహి అఫ్వాజా. ఫసబ్బిహ్ బిహమ్ది రబ్బిక వస్తగ్ఫిర్‌హు ఇన్నహూ కాన తవ్వాబా.**

అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

అల్లాహ్ సహాయం వచ్చినప్పుడు, విజయ భాగ్యం లభించినప్పుడు ప్రజలు తండోపతండాలుగా అల్లాహ్ ధర్మంలో ప్రవేశించటాన్ని నీవు చూసినప్పుడు (ప్రవక్తా!) నీవు నీ ప్రభువు స్తోత్రంతో పాటు ఆయన పవిత్రనామాన్ని స్మరించు. ఇంకా ఆయన మన్నింపును వేడుకో. నిస్సందేహంగా ఆయన పశ్చాత్తాపాన్ని ఎంతగానో అంగీకరించేవాడు.

## 6. సూరహ్ కాఫిరూన్

బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్

**ఖుల్ యా అయ్యుహల్ కాఫిరూన్, లా ఆబుదు మా తాబుదూన్. వలా అంతుమ్ ఆబిదూన మాఆబుద్. వలా అన ఆబిదుమ్ మ్మాఅబత్తుమ్. వలా అంతుమ్ ఆబిదూన మా ఆబుద్. లకుమ్ దీనుకుమ్ వలియదీన్.**

https://teluguislam.net

అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

ఇలా ప్రకటించు, ఓ అవిశ్వాసులారా! మీరు ఆరాధించే వాటిని నేను ఆరాధించను. అలాగే నేను ఆరాధించే ఆయన్ని మీరు ఆరాధించరు. మీరు ఆరాధిస్తున్న వాటిని నేను ఆరాధించేవాణ్ణి కాను. అలాగే నేను ఆరాధించే ఆయన్ని మీరు ఆరాధించేవారు కారు. మీ ధర్మం మీదే, నా ధర్మం నాదే.

## 7. సూరహ్ కౌసర్

బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీమ్

**ఇన్నా ఆతైనాకల్ కౌసర్, ఫసల్లి లిరబ్బిక వన్‌హర్. ఇన్న షానిఅక హువల్ అబ్‌తర్.**

అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

(ప్రవక్తా!) మేము నీకు కౌసర్‌ను ప్రసాదించాము. కనుక నీవు నీ ప్రభువు కొరకే నమాజు చెయ్యి. ఖుర్బానీ కూడా ఇవ్వు. నిస్సందేహంగా నీ శత్రువే నామరూపాలు లేకుండా పోయేవాడు.)

https://teluguislam.net

# 42వ పాఠం రోజువారీ ప్రత్యేక ప్రార్థనలు

1) ఏదైనా ఆహార పదార్థం తినేముందు, లేక ఏదైనా పానీయం తాగే ముందు **'బిస్మిల్లాహ్'** (అల్లాహ్ పేరుతో ప్రారంభిస్తున్నాను) అని చెప్పాలి.

2) కుడిచేత్తో తినాలి.

3) తినటం లేక త్రాగటం పూర్తయిన తర్వాత **'అల్‌హమ్దు లిల్లాహ్'** (సకల స్తోత్రాలూ అల్లాహ్‌కే) అనాలి.

4) తోటి ముస్లిం సోదరులు కనిపిస్తే కరచాలనం చేయాలి. **'అస్స లాము అలైకుమ్ వ రహ్మతుల్లాహ్'** (మీపై అల్లాహ్ శాంతి, ఆయన కారుణ్యం కురియుగాక!) అంటూ నగుమోముతో వారిని పలకరించాలి.

5) ఎవరైనా ముస్లిం సోదరులు ముందుగా మీకు **'అస్సలాము అలైకుమ్ వ రహ్మతుల్లాహ్'** (మీపై అల్లాహ్ శాంతి, ఆయన కారుణ్యం కురియుగాక!) అని అభివాదం చేస్తే, మీరు అంతకన్నా ఉత్తమంగా, **'వ అలైకుముస్సలామ్ వ రహ్మతుల్లాహి వ బరకాతుహూ'** (మీపై అల్లాహ్ శాంతి, ఆయన కారుణ్యం, ఆయన శుభాలు కురియుగాక!) అని బదులివ్వండి.

6) ఉదయం పూట, సాయంత్రం వేళ ఇలా ప్రార్థిస్తూ ఉండండి:

**అస్‌బహ్‌నా** (సాయంత్రమైతే **"అమ్‌సైనా"** అనాలి) **అలా ఫిత్‌రతిల్ ఇస్లామి వ అలా కలిమతిల్ ఇఖ్‌లాసి వ అలా దీని నబియ్యినా ముహమ్మదిన్ వఅలా మిల్లతి అబీనా ఇబ్రాహీం, హనీఫాం**

**మ్ముస్లిమా, వమా కాన మినల్ ముష్రికీన్.**

ఇస్లాం ధర్మ సహజత్వంపై, స్వచ్ఛమైన వచనంపై, మా ప్రవక్త ముహమ్మద్ (స) ధర్మంపై, ఏకోన్ముఖుడు, విధేయుడూ అయిన, బహు దైవారాధకులతో ఏ మాత్రం సంబంధంలేని మా పితామహుడు ఇబ్రాహీం విధానం ప్రకారం మేము తెల్లవారు జాములోకి ప్రవేశించాము (లేక సాయంకాలంలోకి ప్రవేశించాము). *(అహ్మద్)*

**7) నెలపొడుపు చూసినప్పుడు ఇలా ప్రార్థించాలి:**

**అల్లాహుమ్మ అహిల్లహూ అలైనా బిల్ అమ్ని వల్ ఈమాని వస్సలా మతి వల్ ఇస్లామి రబ్బీ వ రబ్బుకల్లాహ్.**

అల్లాహ్! ఈ నెలవంకను మా కోసం శాంతిని, విశ్వాసాన్ని, సంక్షేమాన్ని తెచ్చేదిగా చెయ్యి. (ఓ చంద్ర రేఖా!) నాకూ నీకూ ప్రభువు – అల్లాహ్యే." *(తిర్మిజీ గ్రంథం)*

**8) వ్యాధిగ్రస్తుణ్ణి పరామర్శించేటప్పుడు చేసే దుఆ:**

**"అస్అలుల్లాహల్ అజీమ రబ్బల్ అర్షిల్ అజీమి ఐంయ్యష్ఫియక వ యుఆఫియక."**

(నీకు ఉపశమనాన్ని కలుగజేయమని, ఆరోగ్యాన్ని ప్రసాదించమని నేను మహోన్నతుడు, గొప్ప అధికార పీఠానికి ప్రభువైన అల్లాహ్ను అర్థిస్తున్నాను.) (అబూదావూద్, తిర్మిజీ)

**9) మస్జిద్లోకి ప్రవేశించినప్పుడు...**

**బిస్మిల్లాహి వస్సలాతు వస్సలాము అలా రసూలిల్లాహ్, అల్లాహుమ్మఫ్తహ్లీ అబ్వాబ రహ్మతిక.**

https://teluguislam.net

అల్లాహ్ పేరుతో మస్జిద్‌లోకి ప్రవేశిస్తున్నాను. దైవప్రవక్త (స)పై శాంతీకారుణ్యాలు వర్షించుగాక! ఓ అల్లాహ్! నా కోసం నీ కారుణ్య ద్వారాలను తెరువు. *(ఇబ్నెమాజా గ్రంథం)*

**10) మస్జిద్ నుంచి బయటికి వస్తూ...**

**బిస్మిల్లాహి వస్సలాతు వస్సలాము అలా రసూలిల్లాహ్, అల్లాహుమ్మ ఇన్నీ అస్‌అలుక మిన్ ఫజ్‌లిక్. అల్లాహుమ్మ’–స్విమ్‌నీ మినష్షయితా నిర్రజీమ్**

అల్లాహ్ పేరుతో మస్జిద్ నుంచి బయటికి వస్తున్నాను. శాంతీకరుణలు దైవప్రవక్త (స)పై వర్షించుగాక! ఓ అల్లాహ్! నేను నీ నుండి నీ దయను కోరుతున్నాను. ఓ అల్లాహ్! శాపగ్రస్తుడైన షైతాన్ బారి నుండి నన్ను కాపాడు. *(ఇబ్నెమాజా గ్రంథం)*

**11) ఇంట్లోకి ప్రవేశిస్తూ...**

**అల్లాహుమ్మ ఇన్నీ అస్‌అలుక ఖైరల్ మౌలిజి వ ఖైరల్ మఖ్‌రజి బిస్మిల్లాహి వలజ్‌నా వ బిస్మిల్లాహి ఖరజ్‌నా వ అలా రబ్బినా తవక్కల్‌నా.**

అల్లాహ్! నా ప్రవేశంలో, నా నిష్క్రమణంలో శుభాన్ని ప్రసాదించు. అల్లాహ్ పేరుతోనే మేము ప్రవేశించాం. అల్లాహ్ పేరుతోనే బయటికి వెళ్ళాము. మా ప్రభువునే నమ్ముకున్నాం. *(అబూదావూద్ గ్రంథం)*

**12) ఇంటి నుంచి బయలుదేరుతూ...**

**బిస్మిల్లాహి తవక్కల్తు అలల్లాహి లా హౌల వలా ఖువ్వత ఇల్లా బిల్లాహ్.**

https://teluguislam.net

"అల్లాహ్ పేరుతో బయలుదేరుతున్నాను. అల్లాహ్‌ను నమ్ముకున్నాను. నష్టం నుండి కాపాడుకునే శక్తి, ప్రయోజనం పొందే సామర్థ్యం అల్లాహ్ తరఫు నుంచి తప్ప ఇంకెవరి తరఫునుంచీ ప్రాప్తం కావు"

*(అబూ దావూద్ గ్రంథం)*

ఈ క్రింది ప్రార్థనా పలుకులు నిత్య జీవితంలో వీలైనంత ఎక్కువగా పఠిస్తూ ఉండండి:

**"సుబ్‌హానల్లాహ్"** (అల్లాహ్ పరిశుద్ధుడు)

**"అల్‌హమ్దు లిల్లాహ్"** (సకల స్తోత్రాలూ అల్లాహ్‌కే).

**"వలా ఇలాహ ఇల్లల్లాహ్"** (అల్లాహ్ తప్ప ఇతర ఆరాధ్య దేవుడు లేడు)

**"వల్లాహు అక్బర్"** (అల్లాహ్ అందరికంటే గొప్పవాడు)

**"వలా హౌల వలా ఖువ్వత ఇల్లా బిల్లాహ్"** (అల్లాహ్ ప్రసాదిస్తే తప్ప ఎవరికీ ఎలాంటి శక్తిసామర్థ్యాలు ఉండవు)

దైవప్రవక్త ముహమ్మద్ (స) కోసం అతి ఎక్కువగా దరూద్ ప్రార్థనలు చేస్తూ ఉండండి. ముఖ్యంగా ముహమ్మద్ (స) పేరు విన్నప్పుడు, లేక ఆయన పేరును మీరే స్వయంగా చెప్పినప్పుడు, ఇంకా ఆయన (స) ప్రస్తావన వచ్చినప్పుడు కూడా ఆయన కోసం దరూద్ ప్రార్థన చేస్తూ ఉండండి. క్లుప్తంగా **"సల్లల్లాహు అలైహి వ సల్లం"** (అల్లాహ్ ఆయనపై శుభాన్ని, శాంతిని కురిపించుగాక!) అని చెప్పినా సరిపోతుంది.

https://teluguislam.net

43వ పాఠం

# ఉపవాసం ఆదేశాలు

ఇస్లాం ధర్మ మూల స్తంభాలలో నాల్గవది ఉపవాసం.

అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

**"విశ్వాసులారా! ఉపవాసం మీకు విధిగా చేయబడింది. ఏ విధంగానయితే మీకు పూర్వం ప్రవక్తలను అనుసరించేవారికి విధించబడిందో. దీనివల్ల మీరు అల్లాహ్‌కు భయపడతారని ఆశించబడుతోంది.** ***(ఖుర్‌ఆన్ 2 :183)***

## రమజాన్ మాసం విశిష్ఠత

రమజాన్ నెల ప్రారంభం కాబోతున్న ఒకానొక సమయంలో దైవ ప్రవక్త (సఅసం) ఈ విధంగా ప్రబోధించారు: ప్రజలారా! మీపై ఒక శుభప్రదమైన నెల అవతరించనున్నది. ఆ నెలలో ఉపవాసం పాటించ డాన్ని అల్లాహ్ మీకు విధిగా చేశాడు. ఆ నెలలో స్వర్గద్వారాలు తెరువ బడతాయి. నరక ద్వారాలు మూసివేయబడతాయి. షైతానుల్ని బంధిం చటం జరుగుతుంది. వేయి నెలల కంటే ఘనమైన రేయి ఒకటి ఈ నెలలోనే ఉంది. దాని శుభాలను కోల్పోయినవాడు ఎంతో దౌర్భాగ్యుడు.

*(అహ్మద్, నసాయి)*

దైవప్రవక్త (సల్లం) ఇంకా ఇలా ప్రబోధించారు: ఎవరయితే అల్లాహ్‌పై సంపూర్ణ విశ్వాసంతో, పుణ్యాన్ని ఆశిస్తూ రమజాన్ నెల ఉపవాసాలు పాటిస్తారో వారి వెనుకటి పాపాలన్నీ మన్నించబడతాయి.

*(అహ్మద్, అబూదావూద్)*

https://teluguislam.net

## ఉపవాసం ముఖ్యాంశాలు

ఉపవాసంలో రెండు ముఖ్యాంశాలున్నాయి:

**1. సంకల్పం :** ప్రతి ఒక్కరూ తాను ఉపవాసముంటున్నానని ఉషోదయానికి ముందే సంకల్పం చేసుకోవాలి. సంకల్పం అంటే మనసులో తలచుకోవటమే. దాన్ని నోటితో పలకాల్సిన అవసరం లేదు.

2. ఉషోదయం నుండి సూర్యాస్తమయం వరకు ఉపవాసాన్ని భంగ పరిచే విషయాలకు (తినటం, త్రాగటం, సంభోగించటం లాంటి వాటికి) దూరంగా ఉండటం.

**రాత్రి నలుపు రేఖలనుండి ఉషోదయపు ధవళ రేఖలు ప్రస్ఫుట మయ్యే వరకు మీరు తినండి. త్రాగండి. ఆ తర్వాత వీటన్నింటినీ త్యజించి చీకటిపడేవరకు మీ ఉపవాసం పూర్తి చేయండి.**
***(ఖుర్అన్ 2:187)***

**ఉపవాస కాలంలో రాత్రి సమయాలలో మీరు మీ భార్యల వద్దకు పోవటం మీకొరకు ధర్మసమ్మతం చెయ్యబడింది. వారు మీకు దుస్తులు, మీరు వారికి దుస్తులు.** ***(ఖుర్ఆన్ 2:187)***

## ఉపవాసం ఎవరికి విధి, మరెవరికి విధి కాదు?

వయోజనులు, ఆరోగ్యవంతులు, స్థానికులయిన ప్రతి ముస్లిం స్త్రీ పురుషులపై ఉపవాసం విధిగా నిర్ణయించబడింది. యుక్తవయసుకు చేరని పిల్లలు, ఉన్మాదులు, రోగగ్రస్తులు, ప్రయాణీకులు, రుతుస్రావం, పురిటి రక్తస్రావానికి లోనై ఉన్న స్త్రీలకు, కురువృద్ధులైన స్త్రీ పురుషులకు, గర్భిణులకు, బాలింతలకు ఉపవాసం విధికాదు.

https://teluguislam.net

## ఉపవాసానికి బదులు ఫిద్‌యా చెల్లింపు

వృద్ధాప్యం మరీ ఎక్కువయిన స్త్రీపురుషులకు, కోలుకోలేని వ్యాధిగ్రస్తులకు ఉపవాస విధి నుండి మినహాయింపు ఉంది. ఇలాంటి వారు ఉపవాసానికి బదులు తప్పనిసరిగా 'ఫిద్‌యా' ఇవ్వాలి. అంటే ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ఒక నిరుపేదకు కడుపునిండా అన్నం పెట్టాలి.

## భంగమయిన ఉపవాసాలను తిరిగి పాటించటం

ప్రయాణీకులు, వ్యాధిగ్రస్తులు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, రుతుస్రావం, పురిటి రక్త స్రావానికి లోనైె ఉన్న స్త్రీలు ఉపవాసం పాటించకున్నా ఫర్వాలేదు. వారు రమజాన్ తర్వాత ఆయా ఉపవాసాలను ఖజా చేసుకోవాలి. (బుఖారీ–ముస్లిం)

రమజాన్‌కు సంబంధించిన ఖజా ఉపవాసాలను ఏకధాటిగా పాటించనవసరం లేదు. దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: ఖజా ఉపవాసాలను ఏకధాటిగానయినా పాటించవచ్చు లేదా అప్పుడప్పుడయినా పాటించవచ్చు. *(దారెఖుత్నీ)*

## ఉపవాసం నియమాలు

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు: "సహ్‌రీ భుజించండి. సహ్‌రీ భోజనంలో శుభం ఉంది". ఆయన ఇంకా ఇలా అన్నారు : ప్రజలు ఇఫ్తార్ చేయటంలో త్వరపడుతూ, ఆఖరి వేళలో 'సహ్‌రీ' భుజిస్తూ ఉన్నంత వరకు వారు శ్రేయస్కర మార్గంపై ఉంటారు.

*(బుఖారీ–ముస్లిం)*

ఇంకో హదీసులో ఆయన (స) ఈ విధంగా ప్రవచించారు: కేవలం అన్న పానీయాలకు దూరంగా ఉండటమే ఉపవాసం కాదు. చెడులకు,

https://teluguislam.net

దుర్భాషలాడటానికి దూరంగా ఉండటం కూడా ఉపవాసంలో అంతర్భాగమే. కనుక ఎవరయినా తమను తిడితే తాము ఉపవాసం పాటిస్తున్నామని వారితో చెప్పివేయాలి. *(బుఖారీ)*

ఆయన (స) ఇంకా ఇలా అన్నారు: ఎవరయినా ఉపవాసం ఉండి కూడా చెడు మాటలు మాట్లాడటం, చెడు పనులు చేయటం వదలిపెట్టకపోతే అతను అన్నపానీయాలు వదలి పెట్టడం అల్లాహ్‌కు ఏమాత్రం అక్కరలేదు. *(బుఖారీ)*

## రమజాన్ మాసంలో ఖుర్‌ఆన్ పారాయణం

"దైవప్రవక్త (సల్లం) రమజాన్ మాసంలో అందరికన్నా ఎక్కువగా దాన ధర్మాలు చేసేవారు. ప్రతి రోజూ రాత్రి జిబ్రయీల్ దూతకు ఖుర్‌ఆన్ పారాయణం వినిపించేవారు. జిబ్రయీల్ (అలైహి) కూడా ఆయనకు ఖుర్‌ఆన్ వినిపించేవారు." *(బుఖారీ-ముస్లిం)*

"రమజాన్ మాసపు చివరి దశకం ప్రారంభం కాగానే దైవప్రవక్త (సల్లం) రాత్రివేళల్లో స్వయంగా మేల్కొనటమే గాకుండా, తమ ఇంటి వారిని కూడా మేల్కొలిపేవారు. ఆ సమయాల్లో ఆయన (స) బాగా శ్రమించి దైవారాధన చేసేవారు. *(బుఖారీ-ముస్లిం)*

## ఉపవాస స్థితిలో సమ్మతమైన విషయాలు

ఉపవాస స్థితిలో ఈ క్రింది పనులు చేయటం ధర్మసమ్మతమే:

1. తలంటు పోసుకోవటం, భార్యను ముద్దాడటం, చికిత్స నిమిత్తం శక్తినివ్వని ఇంజెక్షన్లు తీసుకోవటం, రక్తపరీక్ష చేయించుకోవటం, నీటిని గొంతు వరకు పోనిస్తూ (జాగ్రత్తగా) గరారా చేయటం, నోటిలోని ఉమ్మిని మ్రింగటం. *(బుఖారీ-ముస్లిం)*

https://teluguislam.net

2. ఉపవాస స్థితిలో సూర్మా పెట్టుకోవచ్చు. *(తిర్మిజీ)*
3. అహారం రుచిచూడటం వల్ల ఉపవాసం భంగంకాదు.
4. భావోద్రేకాలు అదుపులో ఉంటాయన్న నమ్మకముంటే, ఉపవాస స్థితిలో భార్యను కౌగిలించుకొని పడుకోవచ్చు. *(అబూదావూద్)*
5. "ఒక్కోసారి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉదయం నిద్ర మేల్కొన్నప్పుడు (సంభోగం మూలంగా) అశుద్ధావస్థలో ఉండే వారు. తరువాత గుస్ల్ చేసి ఉపవాసాన్ని కొనసాగించేవారు" అని ఆయన సతీమణి ఆయిషా(రజి.అన్హా) తెలియజేశారు. దీనిద్వారా తెలిసేదేమిటంటే కేవలం లైంగిక అశుద్ధావస్థ వల్ల ఉపవాసానికి భంగం రాదు. కనుక ఉపవాస దినాల్లో ఆలస్యంగా నిద్ర మేల్కొనే వారు సమయాన్ని బట్టి ముందు సహ్రీ భుజించి ఆ తర్వాత గుస్ల్ చేసినా తప్పులేదు. వారి ఉపవాసం నెరవేరుతుంది.
6. ఉపవాస స్థితిలో మిస్వాక్ చేసుకోవచ్చు.
7. ఉపవాస స్థితిలో ముక్కు ద్వారా నీరు గొంతులోకి దిగిపోయినా నష్టం లేదు. ఈగ దోమ లాంటివి గొంతులోకి పోయినా ఉపవాసం భంగం కాదు.
8. మరిచిపోయి తినటం, త్రాగటం వల్ల ఉపవాసం భంగం కాదు. ఆ ఆహార పదార్థం ఎంత పరిమాణంలో ఉన్నా సరే: ఉపవాసాన్ని వదలకుండా కొనసాగించాలి. మరిచిపోయి పొరపాటున తిన్న వారికి అల్లాహ్ స్వయంగా తన ఇష్టంతో తినిపించాడనుకోవాలి.
9. వాంతి చేసుకోవటం మూలంగా కూడా ఉపవాసం భంగం కాదు.

https://teluguislam.net

## ఉపవాసాన్ని భంగపరిచే విషయాలు

ఉపవాస స్థితిలో ఈ క్రింది పనులు చేస్తే ఉపవాసం భంగమవటంతో పాటు దాని ఖజా పాటించటం అనివార్యమయిపోతుంది.

1. ఉద్దేశ్యపూర్వకంగా తినటం, త్రాగటం *(బుఖారీ, ముస్లిం)*
2. ఉద్దేశ్యపూర్వకంగా వాంతి చేసుకోవటం *(తిర్మిజీ)*
3. స్త్రీలు రుతుస్రావానికిగాని, పురిటి రక్త స్రావానికి గాని లోను గావటం.
4. సంభోగించటం. ఉపవాస స్థితిలో ఉద్దేశ్యపూర్వకంగా సంభోగిస్తే ఖజాతోపాటు కప్ఫారా (మూల్యం) కూడా చెల్లించవలసి ఉంటుంది.

   **కప్ఫారా** ఏమిటంటే ఒక బానిసకు విముక్తి కల్పించాలి లేదా రెండు నెలలపాటు ఏకధాటిగా మధ్యలో ఆపకుండా ఉపవాసం పాటించాలి. అదీ చేయలేకపోతే అరవై మంది బీదవారికి అన్నం పెట్టాలి. *(బుఖారీ–ముస్లిం)*
5. ఉపవాస స్థితిలో ఉపవాసం విరమించుకుంటున్నానని గట్టిగా నిశ్చయించుకోవటం.

## ప్రయాణంలో ఉపవాసం

ప్రయాణంలో ఉపవాసం ఇష్టమయితే పాటించవచ్చు లేదా విరమించవచ్చు. అత్యంత కఠినమైన ప్రయాణంలో ఉపవాసం పాటించటం సదాచరణ మాత్రం కాదు.

ఇబ్నె అబ్బాస్ (రజి) కథనం ప్రకారం ఒకసారి దైవప్రవక్త (సల్లల్లాహు

https://teluguislam.net

అలైహి వ సల్లం) రమజాన్ మాసంలో మదీనా నుండి మక్కాకు వెళ్తున్న ప్పుడు దారి మధ్యలో సహచరుల చేత నీళ్లు తెప్పించుకొని చేయిపైకెత్తి అందరికి చూపిస్తూ తన ఉపవాసం విరమించారు. ఆ తర్వాత ఆయన మక్కా చేరుకునే వరకూ ఉపవాసం పాటించలేదు. *(బుఖారీ–ముస్లిం)*

## ఘనమైన రేయి (లైలతుల్ ఖద్ర్ )

లైలతుల్ ఖద్ర్ అంటే ఘనమైన రాత్రి అని అర్థం. రమజాన్ మాసంలోని చివరి దశకంలో ఐదు బేసి రాత్రుల్లో ఏదో ఒకదాన్ని ఇస్లామీయ షరీఅత్ ప్రకారం "లైలతుల్ ఖద్ర్" అని అంటారు. ఆ రాత్రివేళ చేసే ఆరాధన వెయ్యి నెలలపాటు (అంటే దాదాపు 83 యేండ్ల కంటే ఎక్కువ కాలం) చేసే ఆరాధన కన్నా ఉత్తమమైనది. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు –

**మేము దీని (ఖుర్ఆన్)ని ఘనమైన రాత్రిలో అవతరింపజేశాము. ఆ ఘనమైన రాత్రి ఏమిటో మీకు తెలుసా? ఆ ఘనమైన రాత్రి వెయ్యి నెలలకంటే కూడా ఎంతో శ్రేష్ఠమైనది."**

***(ఖుర్ఆన్ 97 :1-3)***

దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: ఎవరయితే సంపూర్ణ విశ్వాసంతో, పుణ్యాన్ని ఆశిస్తూ లైలతుల్ ఖద్ర్‌లో అల్లాహ్‌ను ఆరాధించారో,వారి వెనుకటి పాపాలన్నీ మన్నించబడతాయి. (బుఖారీ–ముస్లిం)

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) రమజాన్ మాసంలోని చివరి దశకంలో ఐదు బేసి రాత్రుల్లో అతి ఎక్కువగా ఆరాధనలు చేసే వారు. అంతేకాదు, ఈ రాత్రుల్లో దైవారాధన చేస్తుండమని తమ ఇంటి వారిని కూడా విపరీతంగా ప్రోత్సహించేవారు.

https://teluguislam.net

## లైలతుల్ ఖద్ర్‌లో చేయవలసిన దుఆ

ఈ ఐదు రాత్రుల్లోనూ ప్రజలు జాగారం చేసి అల్లాహ్ ఆరాధన, మన్నింపు ప్రార్థనలు, ఖుర్‌ఆన్ పారాయణాలు చేస్తూ గడపాలి. లైలతుల్ ఖద్ర్‌లో అత్యధికంగా ఈ దుఆ పఠించాలి:

**"అల్లాహుమ్మ ఇన్నక అఫువ్వున్ తుహిబ్బుల్ అఫ్వ ఫాపు అన్నీ"**

(అల్లాహ్! నీవు అమితంగా మన్నించేవాడవు. మన్నించడాన్ని యిష్టపడతావు. కనుక నన్ను మన్నించు.) *(తిర్మిజీ)*

## తరావీహ్ నమాజ్

తరావీహ్ నమాజ్ రమజాన్ మాసంలో సామూహికంగా చేయబడుతుంది. తహజ్జుద్ నమాజుకు మరో రూపమే తరావీహ్ నమాజు. ఈ రెండూ వేర్వేరు నమాజులు కావు. సాధారణంగా రాత్రి చివరి భాగంలో నిద్ర మేల్కొని చేసే నమాజుని తహజ్జుద్ అనీ, రమజాన్ మాసంలో నిద్రపోకముందు ఇషా నమాజు పూర్తయిన తర్వాత చేసే నమాజుని 'తరావీహ్' అని అంటారు.

రమజాన్ మాసంలో ప్రజలు పగలంతా ఉపవాసం ఉండి సాయంత్రానికి అలసిపోతారు. ఒంట్లో సత్తువ తగ్గుతుంది. ఇఫ్తార్, మగ్రిబ్, ఇషా నమాజుల తర్వాత నిద్రపోయి తిరిగి అర్థరాత్రి మేల్కొని సుదీర్ఘ నమాజు చేయటం, ఆ తర్వాత వెంటనే మరుసటి రోజు ఉపవాసానికి ఉపక్రమించటం భారంగా ఉంటుంది. అందుకని కారుణ్యప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) రమజాన్ మాసంలో రాత్రి నమాజు (తహజ్జుద్) ను ఇషా తర్వాత వెంటనే పెట్టించేసి ప్రజలను ఇబ్బందుల నుంచి కాపాడారు.

https://teluguislam.net

## తరావీహ్ రకాతుల సంఖ్య గురించి కొట్లాడుకోవటం అవివేకం!

ప్రామాణిక హదీసులన్నీ కూడా దైవప్రవక్త (సల్లం) తరావీహ్ నమాజు ఎనిమిది రకాతులు చేశారనే చెబుతున్నాయి. కనుక తరావీహ్ నమాజు సున్నతు ఎనిమిది రకాతులే. కాని ఒకవేళ ఎవరైనా నఫిల్ సంకల్పంతో (అదనంగా) మరి కొన్ని రకాతులు చేయదలచినా వారిని తప్పు పట్ట వలసిన అవసరం లేదు. రమజాన్ మాసం ఆరాధనల మాసం. కనుక ప్రజలు ఆ మాసంలో అత్యంత ఎక్కువగా ఆరాధనలు చేయటానికి ఉవ్విళ్లూరుతారు. ఈ సందర్భంగా గ్రామాల్లోనే కాకుండా విద్యావంతు లుండే పట్టణాల్లో సైతం తరావీహ్ నమాజు రకాతుల సంఖ్య గురించి తగాదాలు జరుతుంటాయి. ఈ తగాదాలు జనంలోని అవివేకాన్ని సూచిస్తాయి. ఎనిమిది రకాతులు చేసేవారు తరావీహ్ నమాజు సున్నతు ప్రకారం ఎనిమిది రకాతులేనని ప్రజలకు సౌమ్యంగా బోధించాలి. అంతేగాని దాని గురించి వారితో ఘర్షణ పడరాదు. అలాగే ఇరవై రకాతులు చేసేవారు ఎనిమిది రకాతులు చేసేవారిని ఆరాధనా చోరులని ఎత్తిపొడవరాదు. పైగా వారిలోని దైవప్రవక్త అనుసరణా పిపాసను గౌరవించాలి. ఎక్కువ పుణ్యాలు ఎక్కువ రకాతులతోనే కాదు, దైవప్రవక్త (స) విధానాన్ని అనుసరించటం వల్ల కూడా ఎక్కువ పుణ్యాలు లభిస్తాయని తెలుసుకోవాలి.

ఒకసారి ఎవరో ఒకాయన దైవప్రవక్త సతీమణి ఆయిషా (రజి.అన్హా) ను దైవప్రవక్త (సల్లం) గారి తహజ్జుద్ నమాజ్ గురించి అడిగితే అందుకామె, “ఆయన తహజ్జుద్ నమాజు ఎంత బాగా, ఎంత సుదీర్ఘంగా చేసేవారంటే దాని గురించి నన్ను అడగమాకు. (నేను వాటిని వర్ణించలేను)” అని అన్నారు.

దీని ద్వారా తెలిసేదేమిటంటే ఎన్ని రకాతులు అనేదానికంటే ఎంత బాగా చేయాలన్నది ముఖ్యం. ఊగుతూ, ఊగిసలాడుతూ ఎన్నో రకాతులు చేసేకంటే దైవప్రవక్త(సల్లం) సున్నతు ప్రకారం ఎనిమిది రకాతులు చేసుకోవటం మేలు. శక్తి వుంటే ఎక్కువ రకాతులు చేయటంలోనూ తప్పులేదనుకోండి. కాని అవి నఫిల్‌గా మాత్రమే పరిగణించబడతాయి.

దైవప్రవక్త (సల్లం) (తరావీహ్ నమాజు) వితర్‌తో కలిపి మొత్తం పదకొండు రకాతులే చేసేవారని హదీసుల ద్వారా బోధపడుతోంది. (బుఖారీ)

## ఫిత్రా (రమజాన్ పండుగ నాడు పేదలకు చెల్లించవలసిన దానం)

1. ముస్లిం అయిన ప్రతి వ్యక్తికి అతను స్వేచ్ఛాపరుడయినా లేక బానిస అయినా, స్త్రీ అయినా పురుషుడయినా, పెద్దవాడయినా, పిన్నవాడయినా ఫిత్రా దానం చేయటం విధి. (బుఖారీ–ముస్లిం)
2. ఉపవాసి వల్ల జరిగే అవాంఛనీయ విషయాలను ప్రక్షాళనం చేయటానికి, సమాజంలోని నిరుపేదల్ని, అభాగ్య జీవుల్ని ఆదుకోవటానికి ఫిత్రాదానం విధిగా చేయబడింది. (అబూదావూద్)
3. బార్లీ, బియ్యం, కిష్‌మిష్, ఎండు ఖర్జూర్లు, ఉల్లిపాయలు మొదలగు తినే వస్తువుల నుండి ఒక 'సా' పరిమాణం ఫిత్రాదానంగా ఇవ్వాలి – ఒక 'సా' పరిమాణం ప్రస్తుతం వ్యవహారంలో ఉన్న తూనికల ప్రకారం రెండు కిలోల ఆరు వందల గ్రాములకు సమానంగా ఉంటుంది.
4. ఈద్గాహ్‌కు బయలుదేరే ముందే ఫిత్రాదానం ఇవ్వాలి.

https://teluguislam.net

(బుఖారీ–ముస్లిం)

5. నిరుపేదలకు పండుగ కంటే ముందుగానే ఫిత్రాదానం ఇవ్వటం మంచిది. దానివల్ల వారికి పండుగ రోజు అడుక్కునే అగత్యం ఏర్పడకుండా ఉంటుంది. (బైహఖీ)

6. కొందరు దైవప్రవక్త అనుచరుల దృష్టిలో బార్లీ, గోధుమలు, బియ్యం, కిష్మిష్, ఎండు ఖర్జూర్లు, ఉల్లిపాయలకు బదులు వాటి మూల్యం దానంగా ఇవ్వవచ్చు. (అబూదావూద్)

## మోడల్ ప్రశ్నలు

1) రమజాన్ మాస విశిష్ఠతను ఖుర్ఆన్, హదీసుల వెలుగులో తెల్పండి.
2) ఉపవాసంలో ఎన్ని ముఖ్యాంశాలున్నాయి? అవి ఏవి?
3) ఉపవాసం ఎవరికి విధి? మరెవరికి దీనినుంచి మినహాయింపు ఉంది?
4) ఉపవాస స్థితిలో సమ్మతమైన విషయాలు ఏవి?
5) ఉపవాసాన్ని భంగపరిచే విషయాలు ఏవి?
6) 'ఘనమైన రేయి' గురించి ఖుర్ఆన్, హదీసుల ద్వారా తెల్పండి?

## ఖాళీలు పూరించండి

1) ఉపవాసం భంగం అయితే.......... చెల్లించాలి.
2) సుదూర ప్రయాణాలలో............ పాటించవలసిన అవసరం లేదు.
3) లైలతుల్ ఖద్ర్ అంటే ............. రాత్రి అని అర్థం.
4) ఫిత్రా దానం................
5) ............. కు బయల్దేరే ముందే ఫిత్రా దానం ఇవ్వాలి.

https://teluguislam.net

44వ పాఠం

# జకాత్

## మనం జకాతు ఎందుకు చెల్లించాలంటే...

అల్లాహ్ మనకు ఆజ్ఞాపించాడు కాబట్టి. అవును! దానధర్మాలు చేసేవారంటే అల్లాహ్‌కు ఎంతో ఇష్టం. దాసులు అల్లాహ్ పట్ల ఆమాత్రం విధేయతా భావం కనబరచటం తప్పనిసరి.

అల్లాహ్ మనకు సంపదను ప్రసాదించాడు. ధనం ఆర్జించే మార్గాలను అనుగ్రహించాడు. అందుకు మనం ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకోవాలి. ఈ విషయంలో అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకునే విధానమే జకాతు!

అవసరాల్లో ఉన్నవాళ్ళ బాధలు, కష్టాలు తొలగటానికి జకాతు వ్యవస్థ అవసరం. అన్ని విధాలా ముస్లిం సమాజ అభివృద్ధి కోసం స్తోమతగల ప్రతి ఒక్క ముస్లిం తప్పకుండా జకాతు చెల్లించాలి. ప్రపంచంలో అన్ని చోట్లా ఇస్లాం సత్యతను, శాంతిని వ్యాపింపజేయటం ప్రతి ముస్లిం కర్తవ్యం. జకాతు విధితోనే ఆ కర్తవ్యం నెరవేరుతుంది. అందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి.

ఇది ఇస్లాం మూల స్తంభాలలోని అత్యంత ముఖ్యమైన అంశం. దీనివల్ల ఎన్నో ప్రయోజనాలున్నాయి. అవి క్రింద తెలుపబడ్డాయి.

1. సమాజంలో నిరుపేదల, అగత్యపరుల అవసరాలు తీరుతాయి.
2. ధనిక, బీద ప్రజల మధ్య మంచి సంబంధాలు ఏర్పడతాయి. ఆర్థిక అంతరాలు తొలగిపోతాయి. ప్రతీ ఒక్కరూ సహజంగానే తమకు మంచి చేసిన వారి వైపునకు మ్రొగ్గి ఉంటారు.
3. ఇది మనస్సును పరిశుద్ధపరుస్తుంది, ప్రక్షాళనం చేస్తుంది. మనిషిని

https://teluguislam.net

ధర్మపరంగానూ ఉత్తేజపరుస్తుంది. ప్రజలలో సహజంగా ఉండే లోభత్వాన్ని పోగొడ్తుంది.

4. అగత్యపరుల పట్ల జాలిని, దయను కలిగిస్తుంది. దాతృత్వాన్ని, ఔదార్యాన్ని పెంపొందిస్తుంది.
5. ఇది ఇహపర లోకాల్లో అల్లాహ్ అనుగ్రహాన్ని పొందడానికి మరియు సంపదను వృద్ధి పరచటానికి దోహదపడుతుంది.

## నాలుగు రకాల సంపదలపై జకాత్ చెల్లించాలి

1. వ్యవసాయోత్పత్తులు (పండ్లు మరియు ఆహార ధాన్యాలు).
2. మేత మేసే పశువులు.
3. బంగారం మరియు వెండి.
4. వాణిజ్య వస్తువులు.

దేనిపై ఎంత జకాత్ చెల్లించాలో, దానికి ఉండవలసిన కనీస మూల ధన పరిమితి (నిసాబ్) ఎంతో కింద పేర్కొనబడుతుంది. అంతకంటే తక్కువ మూలధనంపై జకాత్ చెల్లించవలసిన అవసరం ఉండదు.

### 1. వ్యవసాయ ఉత్పత్తులపై జకాత్

గింజలు, పండ్లు, గోధుమ, వరి, ఖర్జూరం, ద్రాక్ష, బార్లీ మొదలగు వ్యవసాయ ఉత్పత్తులు కనీసం 5 వస్ఖలకు, అనగా దాదాపు 675 కి.గ్రా లకు చేరుకుంటే అప్పుడు వాటిపై జకాత్ చెల్లించవలసి ఉంటుంది.

రైతు కష్టపడకుండా ప్రకృతి సంబంధమైన వర్షాలు, నదులు, వాగులు, కాలువలతో పండే భూముల్లో వచ్చే మొత్తం ఫలసాయం నుంచి పదో భాగాన్ని జకాత్‌గా చెల్లించాలి.

ఒకవేళ పంపుసెట్ల ద్వారా, నీళ్ళు తోడే పరికరాల ద్వారా లేదా

ఇతర పద్ధతుల ద్వారా లేదా కూలీలను పెట్టి చేసే వ్యవసాయంతో వచ్చే మొత్తం ఫలసాయం నుండి ఇరవయ్యో భాగాన్ని (5 శాతాన్ని) జకాత్‌గా చెల్లించాలి.

జంతువులపై ఎంత మేరకు జకాత్ చెల్లించాలో తెలుసుకునేందుకు నేరుగా దైవప్రవక్త(స) హదీసులను లేదా హదీసు పండితులను సంప్రతించమని పాఠకులను కోరుతున్నాము. ఈ పుస్తకం కేవలం ప్రధాన విషయాలను తెలుపటానికి మాత్రమే రాయబడింది. కనుక వాటిని ఇక్కడ ప్రస్తావించలేకపోతున్నాం. క్లుప్తంగా తెలుసుకోగోరే వారు మా పబ్లికేషన్ ద్వారానే ప్రచురితమైన మరో పుస్తకం “ఇస్లామీయ ఆరాధనలు” 237-239 పేజీలు చదవగలరు.

### 2. బంగారం, వెండి, నగదు మొదలగునవి

వెండి కనీస మూలధన పరిమితి (నిసాబ్) 140 ‘మిత్‌ఖాల్’, అనగా 595 గ్రాములు. సుమారు 52 1/2 తులాలు ఉన్నట్లయితే దానిపై జకాత్ చెల్లించాలి.

బంగారానికి మూలధన పరిమితి (నిసాబ్) 20 మిత్‌ఖాల్. అనగా 85 గ్రాములు లేదా 71/2 తులాలు.

బంగారం, వెండి సంపదల నుండి 40వ భాగాన్ని (అనగా 2.5 శాతాన్ని) జకాత్‌గా చెల్లించాలి.

అంటే తమ దగ్గర ఉన్న బంగారం, వెండి విలువను మార్కెట్ రేటు ప్రకారం మదించి రెండున్నర (21/2) శాతం డబ్బును జకాత్‌గా ఇవ్వాలి.

పైన పేర్కొన్న సంపదపై ఒక సంవత్సరం గడిచిన తర్వాతే జకాత్ విధి అవుతుంది.

ఎవరి వద్దనైనా జకాత్ విధి కావడానికి బంగారం ధరకు సమానమైన కరెన్సీ అంటే దిర్హంలు, దీనార్లు, డాలర్లు, పౌండ్లు, రియాల్‌లు లేదా

https://teluguislam.net

ఇతర కరెన్సీ(డబ్బులు) ఉండి, వాటిపై ఒక సంవత్సరం గడిస్తే తప్పనిసరిగా జకాత్ చెల్లించాల్సి ఉంటుంది. పైన తెలిపిన షరతులు దీనికీ వర్తిస్తాయి. అంటే మొత్తం ధనం నుండి 40వ వంతు (2.5 శాతం) జకాత్ చెల్లించాలి.

పెట్టుబడిపై లాభంగా వచ్చిన డబ్బుకు ఒక సంవత్సరం పూర్తిగా గడవాలనే షరతు వర్తించదు. మొత్తం డబ్బుపై జకాత్ ఇచ్చేటప్పుడు లాభాన్ని కూడా కలుపుకుని జకాత్ చెల్లించాలి. అప్పుడే పుట్టిన జంతువులను కూడా జకాత్ చెల్లించేటప్పుడు లెక్కలోనికి తీసుకోవలసి ఉంటుంది. మొత్తం పశువుల సంఖ్య మూలధన పరిమితికి (నిసాబ్‌కు) చేరుకుని పూర్తి సంవత్సరం గడిస్తే నవజాత జంతువులపై ఒక సంవత్సరం పూర్తిగా గడవాల్సిన అవసరం ఉండదు.

స్త్రీల నగలకు కూడా ఇదే సూత్రం వర్తిస్తుంది. బంగారం లేదా వెండి ఆభరణాలు వినియోగించుకోడానికి లేదా అప్పుగా ఇచ్చి ఉన్నా, అవి మూలధన పరిమితికి (నిసాబ్‌కు) చేరి, వాటిపై ఒక పూర్తి సంవత్సరం గడిస్తే జకాత్ విధిగా చెల్లించాలి. దైవప్రవక్త(స) ఇలా ఉపదేశించారు:

'ఎవరైనా బంగారం లేదా వెండికి యజమాని అయి తమపై విధిగా ఉన్న జకాత్‌ను చెల్లించకపోతే ఒకరోజు వస్తుంది. ఆ రోజు (అంటే ప్రళయ దినాన) ఆ వెండి, బంగారాలు నరకాగ్నిలో కాల్చబడి, వాటితోనే వారి నొసటిపై, వారి పక్కలపై, వీపులపై వాతలు వెయ్యబడతాయి. అవి చల్లబడగానే వాటిని మళ్ళీ కాల్చి వాతలు పెట్టటం జరుగుతుంది. ఈ ప్రక్రియ ఒక రోజు మొత్తం జరుగుతూనే ఉంటుంది. అయితే ఆ ఒక్కరోజు యాభైవేల సంవత్సరాలకు సమానంగా ఉంటుంది.'

ఒకసారి దైవప్రవక్త(స) ఒక మహిళ చేతుల్లో రెండు బంగారు గాజులను చూసి 'వీటిపై జకాత్ చెల్లిస్తున్నావా?' అని అడిగారు. దానికి

ఆమె 'లేదు' అని సమాధానమిచ్చింది. ఆయన(స), "మరైతే ప్రళయదినాన అల్లాహ్ నీకు రెండు అగ్ని గాజులను తొడిగించటం ఇష్టమేనా?" అని అడిగారు. ఇది వినగానే ఆ మహిళ ఆ రెండు గాజులను తీసేసింది" (అబూ దావూద్, తిర్మిజీ, ఇబ్ను మాజా)

ఉమ్మె సలమా (ర.అన్హా) ఒకసారి బంగారు నగ ఒకటి ధరించి ఉన్నారు. అప్పుడు ఆమె (రజి) దైవప్రవక్త (స)ను, అది కన్జ్ (పోగు చేసినదిగా) భావించబడుతుందా? అని ప్రశ్నించారు. అందుకు దైవ ప్రవక్త(స), 'దీన్ని శుద్ధపరిస్తే (దీనిపై జకాత్ చెల్లిస్తే) ఇది కన్జ్ (పోగు చేసినది)గా భావించబడదు' అని సమాధానమిచ్చారు. మరికొన్ని హదీసులు కూడా ఈ విషయాన్ని ధ్రువపరుస్తున్నాయి.

| సంపద | మూలధన పరిమితి | జకాత్ శాతం | గమనిక |
|---|---|---|---|
| బంగారం | **85 గ్రా।** | **2.5%** | వ్యక్తిగత అవసరానికి |
| వెండి | **595గ్రా॥** | **2.5%** | వ్యక్తిగత అవసరానికి |
| డబ్బు-నోట్లు, నాణాలు | బంగారంతో సమానమైన విలువ | **2.5%** | ప్రస్తుత విలువ |
| భూ ఉత్పత్తులు | **675 కి.గ్రా.** | **5%** | కృత్రిమ నీటిపారుదల |
| భూ ఉత్పత్తులు | **675 కి.గ్రా.** | **10%** | వర్షం, వాగులు, నదులు లాంటి ప్రకృతి నీటిపారుదల |
| వాణిజ్య వస్తువులు | బంగారంతో సమానమైన విలువ | **2.5%** | ప్రస్తుత విలువ |

## 3. వాణిజ్య వస్తువులు, భూమి:

వాణిజ్య వస్తువుల యజమాని ప్రతి యేడు చంద్రమానం ప్రకారం ఒక సంవత్సరం గడవగానే వాటి విలువను లెక్కకట్టి అందులో నుండి

https://teluguislam.net

40వ వంతు లేదా 2.5శాతం విలువ డబ్బును జకాత్‌గా ఇవ్వాలి. వాటి ప్రస్తుత విలువ కొనుగోలు విలువ కంటే ఎక్కువగా ఉందా, తక్కువగా ఉందా లేదా సమానంగా ఉందా అన్న సంగతి పరిగణనలోకి రాదు.

సమురా(రజి) ఇలా తెలిపారు: "మేము అమ్మడానికి సిద్ధంగా ఉంచుకున్న సరుకుపై సదఖా(జకాత్) ఇవ్వవలసిందిగా దైవప్రవక్త(స) మమ్మల్ని ఆజ్ఞాపించారు." (అబూదావూద్).

అమ్మకానికి పెట్టిన భూములు, ఇళ్లు, కార్లు, నీటిని తోడే యంత్రాలు మొదలగునవన్నీ ఇందులోకి వచ్చేస్తాయి.

అమ్మడానికి కాకుండా అద్దెకివ్వడానికి ఇల్లు కట్టుకున్నట్లయితే, అద్దె డబ్బుపై ఒక పూర్తి సంవత్సరం గడిచిన తరువాత జకాత్ ఇవ్వవలసి ఉంటుంది. కాని ఇంటిపై జకాత్ చెల్లించాల్సిన అవసరం లేదు. ఎందుకంటే అది అమ్మడానికి సిద్ధంగా లేదు కాబట్టి.

అదే విధంగా సొంతకార్లు, అద్దెకు ఇచ్చిన కార్లపై జకాత్ ఉండదు. అద్దె కార్ల యజమాని వాటిపై సంపాదించిన డబ్బుపై ఒక చంద్రమాన సంవత్సరం గడిచిన తర్వాత జకాత్ చెల్లించాలి. ఆ సొమ్మును సొంతానికి ఖర్చుపెట్టడానికి, వివాహం కొరకు, లేదా అప్పులు తీర్చడానికి, లేదా స్థిరాస్తుల కొనుగోలు కొరకు లేదా ఇతర పనులు దేనికోసం వెచ్చించడానికి ఉంచినా సరే; ఇస్లామీయ షరీయత్ ప్రకారం దానిపై జకాత్ చెల్లించాల్సిందే. ధర్మవేత్తల ప్రామాణిక అభిప్రాయం ప్రకారం, అప్పు సాకుతో జకాత్ చెల్లింపు రద్దు కాదు.

అదే విధంగా అనాథల, మానసిక పరిపక్వత లేనివారి వద్ద డబ్బు లేదా సంపద మూలధన పరిమితి (నిసాబ్) స్థాయి వరకు చేరి దానిపై ఒక చంద్రమాన సంవత్సరం గడిస్తే, వారి బాధ్యత తీసుకున్నవారు ఆ సొమ్ము నుంచి జకాత్‌ను చెల్లించాలి.

https://teluguislam.net

## జకాత్ పద్దులు:

ఇక జకాత్ సొమ్ము తీసుకోవటానికి అర్హులు ఎవరో కూడా అల్లాహ్ తెలియజేశాడు. ఎనిమిది రకాల మంది జకాత్ సొమ్ము తీసుకోవటానికి అర్హులు. ఈ ఎనిమిది రకాల పద్దుల గురించి ఖుర్ఆన్‌లోని తౌబా సూరా 60వ ఆయతులో ప్రస్తావించటం జరిగింది.

1. **ఫకీర్లు (దరిద్రులు):** జీవనోపాధి కోసం పని చేసే శక్తిలేని, ఇతరులపై ఆధారపడి జీవించే అభాగ్యజీవులు ఈ పద్దు క్రిందికి వస్తారు.
2. **మిస్కీన్ (చేయిచాపని నిరుపేద):** తన అవసరాలకు సరిపడ ధనం లేనివాడు, ప్రజలు ఆర్థిక సహాయం చేయటానికి అవకాశం లేకుండా (తన ఆత్మాభిమానం వల్ల) గుట్టుగా జీవితం వెళ్ళబుచ్చేవాడు, తనకు ఆర్థిక సహాయం చేయమని ప్రజల ముందు చేయిచాపని నిరుపేదను “మిస్కీన్” అని అంటారు. ఇలాంటి వారు జకాత్ దానం తీసుకోవటానికి అర్హులే! *(బుఖారీ-ముస్లిం)*
3. **జకాత్ వసూలు చేసే ఉద్యోగులు (ఆమిలీన్):** జకాత్ వసూలు చేయటానికి నియమించబడిన ఉద్యోగులకు జీతం జకాత్ ధనం నుండే ఇవ్వబడుతుంది.
4. **ముఅల్లఫతుల్ ఖులూబ్ (హృదయాలను ఆకట్టుకోవాలనే ఉద్దేశ్యంతో):** ప్రజల హృదయాలను ఇస్లాం ధర్మంపై సుస్థిరం చేయటానికి, వారిని ఇస్లాం ధర్మంపై నిలకడగా ఉండేలా చేయటానికి వారికి అప్పుడప్పుడూ ఆర్థిక సహాయం అందిస్తూ ఉండటమే ఈ పద్దు ఉద్దేశ్యం.
5. **రిఖాబ్ :** అంటే బానిసల్ని కొని వారికి స్వేచ్ఛను ప్రసాదించటం.

https://teluguislam.net

ప్రస్తుత కాలంలో బానిస వ్యవస్థ లేదు కాబట్టి ఆ ధనాన్ని ఇస్లాం కారణంగా ముస్లిమేతరుల వద్ద బందీలుగా పట్టుబడిన బాధిత ముస్లింలను విడిపించటానికి వినియోగించవచ్చు.

6. **గారిమీన్ (రుణగ్రస్తులు) :** అంటే రుణగ్రస్తులకు ఆర్థిక సహాయం చేయటం. తమ దగ్గరున్న ఆస్తిపాస్తులన్నిటినీ అప్పు తీర్చటానికి వినియోగించిన పక్షంలో తాము దరిద్రులుగా మిగిలిపోయే అవకాశ ముంటే అలాంటి వారికి జకాత్ నుండి ఆర్థిక సహాయం అందజేయ వచ్చు.

7. **ఫీ సబీలిల్లాహ్ (దైవమార్గంలో):** దైవమార్గంలో పోరాటం చేయటా నికి, ధర్మ తిరస్కార వ్యవస్థను అంతమొందించి ఇస్లామీయ జీవన వ్యవస్థను నెలకొల్పటానికి జకాత్ ధనం వినియోగించవచ్చు.

   అంతేగాకుండా, ఈ పద్దు క్రింద ముస్లింల సామాజిక సమస్యల్ని పరిష్కరించటానికి, ప్రజలకు ఉపయోగపడే కార్యకలాపాల కొరకు కూడా ధనం వినియోగించవచ్చు. ఉదా: ధార్మిక పాఠశాలలు, అనాథ శరణాలయాలు నెలకొల్పటం, ముస్లింలకు త్రాగు నీటి వసతి తదితర సామాజిక అవసరాల కొరకు జకాత్ ధనాన్ని వినియోగించ వచ్చు.

8. **ఇబ్నుస్సబీల్ (బాటసారి):** ప్రయాణంలో ఉన్నవారు ఎవరయినా సరే, ఇంటి దగ్గర వారు ఎంతటి స్థితిమంతులయినా ప్రయాణా వస్థలో ఆర్థిక ఇబ్బందులకు గురయితే అలాంటి వారికి జకాత్ ధనం నుండి ఆర్థిక సహాయం చేయవచ్చు.

ఈ ఎనిమిది (8) పద్దులను తమ ఇష్టానుసారం మార్చే హక్కుగానీ,

https://teluguislam.net

హెచ్చుతగ్గులు చేసే స్వేచ్ఛాధికారంగానీ ఎవరికీ లేదు. అల్లాహ్ సర్వం తెలిసినవాడు, వివేకసంపన్నుడు.

## మోడల్ ప్రశ్నలు

1) జకాత్ సొమ్మును తీసుకోవడానికి అర్హులు ఎవరో వివరంగా తెలుపండి.
2) ఎన్ని రకాల సంపదలపై జకాత్ చెల్లించాలి? చెల్లించే నిష్పత్తిని తెలుపండి.

## ఖాళీలు పూరించండి

1) ............... రకాల ఉత్పత్తులపై జకాత్ చెల్లించాలి.
2) వ్యవసాయ ఉత్పత్తులు దాదాపు ............... కి.గ్రాలకు చేరుకుంటే జకాత్ చెల్లించాలి.
3) వర్షాధారంతో పండే భూముల్లో................ భాగాన్ని జకాత్‌గా చెల్లించాలి.
4) $7^1/_2$ తులాల బంగారంపై ........ తర్వాత జకాత్ చెల్లించడం విధి చేయబడుతుంది.
5) బంగారంపై .............. శాతం జకాత్‌గా చెల్లించాలి.

https://teluguislam.net

45వ పాఠం

# హజ్ యాత్ర

## ఇస్లాం ధర్మ మూలస్తంభాల్లో ఐదవది హజ్

అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

**“ప్రజలపై అల్లాహ్‌కు ఉన్న హక్కు ఏమిటంటే, ఈ (కాబా) గృహానికి వెళ్ళే శక్తిగల వారు దాని హజ్‌ను విధిగా చెయ్యాలి. ఈ ఆజ్ఞను పాలించటానికి తిరస్కరించేవాడు, అల్లాహ్‌కు ప్రపంచ ప్రజల అవసరం ఎంత మాత్రం లేదు అని స్పష్టంగా తెలుసు కోవాలి” *(ఖుర్ఆన్ 3 : 97)***

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు: ప్రజలారా! అల్లాహ్ మీపై హజ్ యాత్ర విధిగా చేశాడు. కనుక (మీలో శక్తిగలవారు) హజ్ యాత్ర చేయండి. *(బుఖారీ-ముస్లిం)*

## హజ్ యాత్ర విశిష్ఠతలు

దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: మనోవాంఛలకు, చెడు పనులకు దూరంగా ఉంటూ అల్లాహ్ ప్రసన్నత కోసం హజ్ చేసి తిరిగొచ్చే వ్యక్తి, ఆ రోజే తల్లి గర్భం నుంచి పుట్టినట్లు అత్యంత పునీతుడిగా తిరిగి వస్తాడు. *(బుఖారీ-ముస్లిం)*

ఒక హదీసు ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: హజ్ యాత్ర చేయటం వృద్ధులకు, బలహీనులకు, స్త్రీలకు జిహాద్ చేయటంతో సమానం. *(నసాయి)*

ఇంకో హదీసులో ఆయన ఈ విధంగా ప్రవచించారు: హజ్

https://teluguislam.net

ఉమ్రా యాత్రలకు వెళ్ళేవాళ్ళు అల్లాహ్ అతిథులు. వారు గనక దుఆ చేస్తే అల్లాహ్ వారి దుఆలను ఆమోదిస్తాడు. వారు తమ మన్నింపు కోసం వేడుకుంటే ఆయన వారిని మన్నిస్తాడు. *(నసాయి, ఇబ్నె మాజా)*

## హజ్ విధిని వాయిదా వేసుకోరాదు!

దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: తాను హజ్ చేయాలి అని అనుకునే వ్యక్తి దాని కోసం తొందరపడాలి. ఆలస్యం చేస్తే అతను వ్యాధి బారిన పడవచ్చు లేదా తన వాహనాన్ని అయినా పోగొట్టుకోవచ్చు. లేదా అతనికి ఇంకా ఏదయినా ఆటంకం ఏర్పడవచ్చు.

*(అహ్మద్, ఇబ్నెమాజా)*

## హజ్ విధింపుకై షరతులు

ఈక్రింది షరతులు వర్తించగానే మనిషికి హజ్‌యాత్ర చేయటం విధి అయిపోతుంది.

1. అతను ముస్లిం అయి ఉండాలి.
2. వయోజనుడై ఉండాలి.
3. స్వేచ్ఛాపరుడై ఉండాలి.
4. ప్రయాణ మార్గంలో ప్రమాదాల బెడద లేకుండా ఉండాలి.
5. హజ్ చేయటానికి ప్రయాణ ఖర్చులు, తను హజ్ చేసి వచ్చేంత వరకు తన మీద ఆధారపడి బ్రతికేవారి పోషణ ఖర్చులకు సరిపడేంత ధనాన్ని కలిగి ఉండాలి.
6. స్త్రీకి హజ్ ప్రయాణంలో భర్తగానీ లేక మహ్రం (అనగా భర్త లేక తనతో వివాహం నిషిద్ధమైన) పురుషుడు గాని తోడుగా ఉండాలి.

https://teluguislam.net

## హజ్ రకాలు

హజ్ మూడు విధాలుగా చేయవచ్చు

1. ఇఫ్రాద్ 2) ఖిరాన్ 3) తమత్తూ

### 1. ఇఫ్రాద్

కేవలం హజ్ చేసే సంకల్పంతో ఇహ్రాం దీక్షబూని, హజ్ విధుల న్నిటినీ నిర్వర్తించి జిల్ హిజ్జా మాసపు పదో తేదీన 'మినా'లో ఇహ్రాం దీక్షను విరమించటం.

### 2. ఖిరాన్

హజ్, ఉమ్రాల కొరకు ఒకేసారి ఇహ్రాం దీక్షబూనటం. ఈ పద్ధతిలో ఉమ్రా అనంతరం ఇహ్రాం దీక్షను విరమించకూడదు. పదో తేదీన ఖుర్బానీ మరియు తవాఫ్ చేసిన తర్వాతే ఇహ్రాంను విరమించాలి. ఖిరాన్ హజ్ చేసేవారు తప్పకుండా ఖుర్బానీ ఇవ్వవలసి ఉంటుంది.

### 3. తమత్తూ

'మీఖాత్' (నిర్ణీత ప్రదేశం) చేరుకున్న తర్వాత కేవలం ఉమ్రా కొరకు దీక్షబూని ఉమ్రా పూర్తి చేసుకొని దీక్షను విరమించాలి. ఆ తర్వాత జిల్ హిజ్జా మాసపు ఎనిమిదో తేదీన తిరిగి హజ్ కొరకు దీక్షబూని హజ్ విధులన్నీ నిర్వర్తించి హజ్ కూడా పూర్తి చేసుకోవాలి. ఈ పద్ధతిని 'తమత్తూ' అని అంటారు.

## హజ్ విధులు

హజ్‌లో నాలుగు విధులు ఉన్నాయి.

1. ఇహ్రాం దీక్షబూనటం.
2. అరఫాత్ మైదానంలో ఆగటం.

https://teluguislam.net

3. తవాఫె ఇఫాజా
4. సఫా మర్వాల మధ్య పరుగెత్తటం.

పై విధుల్లో ఏ ఒక్కటి లోపించినా హజ్ నెరవేరదు.

## హజ్‌లో తప్పనిసరిగా నిర్వర్తించవలసిన అంశాలు

1. మీఖాత్ (నిర్ణీత) ప్రాంతం నుండి ఇహ్రాం దీక్షబూనటం.
2. సూర్యాస్తమయం వరకు అరఫాత్ మైదానంలో ఉండటం.
3. ముజ్దలిఫా ప్రాంతంలో రాత్రి గడపటం.
4. తష్రీఖ్ రోజుల రాత్రులు మినాలో గడపటం.
5. వరుసగా జమ్రాలకు రాళ్ళు కొట్టడం.
6. తల గొరిగించుకోవటం లేదా వెంట్రుకలు కత్తిరించుకోవటం.

అరఫాత్ మైదానానికి హాజరుకావటం ఒక ముఖ్య విధి. ఎవరయినా ఏదయినా కారణం చేత అక్కడికి వెళ్ళకపోతే వారి హజ్ నెరవేరదు.

దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: అరఫాత్ హాజరుకు మారుపేరే హజ్. జిల్ హిజ్జా మాసపు పదో తేదీన ఉషోదయానికి ముందు అరఫాత్ మైదానానికి చేరుకున్నవాడు హజ్ చేసుకున్నట్లే.

*(ముస్నదె అహ్మద్)*

కాబా గృహం చుట్టూ ఏడుసార్లు ప్రదక్షిణాలు (తవాఫ్) చేసిన తర్వాత మఖామె మహ్‌మూద్ వద్ద రెండు రకాతులు నమాజ్ చేయాలి, ఈ రెండు రకాతులు చేయటం సున్నత్. *(ముస్లిం)*

*గమనిక: హజ్-ఉమ్రా యాత్రలకు సంబంధించి పూర్తి వివరాలు తెలుసుకోదలిస్తే మేము ప్రచురించిన **"హజ్ యాత్రా విధానం"** పుస్తకం చదవండి.*

https://teluguislam.net

అధ్యాయం - 5

# అంత్యక్రియలు

## 46వ పాఠం

# ముస్లిం శవానికి స్నానం (గుస్ల్) చేయించే పద్ధతి

1. మనిషి చనిపోయాడని విశ్వసనీయంగా తెలియగానే అతని కళ్లు మూసివేయాలి. దవడలు తెరుచుకొని వుంటే వాటిని దగ్గరగా కలిపి ఉంచాలి.

2. మృతదేహానికి స్నానం చేయించేటప్పుడు మర్మావయవాలను కప్పి ఉంచాలి. మృతుని కడుపును మెల్లగా ఒత్తాలి. గుసుల్ చేయించేవారు తమ చేతులకు గుడ్డగాని మరేదైనా కాగితంగాని చుట్టుకొని మృతుని మర్మావయవాలను శుభ్రం చేయాలి. సాధారణంగా మనం నమాజ్ కోసం ఏ విధంగా వుజూ చేసుకుంటామో అదే విధంగా మృతునికి వుజూ చేయించాలి.

   తరువాత అతని తలను, గడ్డాన్ని రేగు ఆకులతో లేక మాలిన్యాన్ని వదిలించే మరేదైనా వస్తువుతో అనగా సబ్బుతో రుద్ది నీళ్ళతో శుభ్రం చేయాలి. తరువాత శరీరాన్ని కుడివైపు నుండి ఎడమవైపుకు కడగాలి. ఇదే విధంగా మూడుసార్లు శుభ్రపరచాలి. ప్రతిసారి మృతుని కడుపును మెల్లగా ఒత్తుతూ ఉండాలి. ఆ సమయంలో మలమూత్ర విసర్జన మార్గాల ద్వారా ఏదైనా బయటికి వస్తే దాన్ని కడిగి ఆ రంధ్రాలను దూదితో లేక మరేదైనా వస్తువుతో మూసివేయాలి. ఒకవేళ వాటి వల్ల ప్రయోజనం లేకపోయినట్లైతే అప్పుడు మల మూత్రాలను ఆపగలిగే ఇతర వస్తువును దేన్నయినా ఉపయోగించాలి. ఉదాహరణకు: వైద్యవిధానంలో వాడే అతుకుడు ప్లాష్టర్‌లను ఉపయోగించవచ్చు.

https://teluguislam.net

తరువాత శవానికి మళ్ళీ వుజూ చేయించాలి. మొత్తం శరీరాన్ని మూడుసార్లు కడిగినప్పటికీ అది శుభ్రం కాకపోతే అప్పుడు దాన్ని అయిదు లేదా ఏడు సార్లు కూడా కడగవచ్చు. తరువాత శరీరాన్ని బాగా తుడిచి చంకల్లో, మోకాళ్లకు ఇంకా సజ్దా స్థితిలో నేలకు ఆనే అవయవాలన్నింటికీ సుగంధ ద్రవ్యాలు పూయాలి. ఒకవేళ మొత్తం శరీరానికి సుగంధ ద్రవ్యం పూస్తే ఇంకా మంచిది. శవానికి తొడిగించే వస్త్రాలను సాంబ్రాణి పొగబెట్టాలి. గోళ్ళు, మీసాలు పెరిగివుంటే వాటిని కత్తిరించాలి. తలవెంట్రుకలను దువ్వకుండా ఎలా ఉన్నాయో అలాగే వదిలిపెట్టాలి. ఒకవేళ చనిపోయినది స్త్రీ అయితే ఆమె తల వెంట్రుకలను మూడు భాగాలుగా విభజించి వాటిని ఆమె వీపు వెనకాల వదిలిపెట్టాలి.

## 3. శవానికి వస్త్ర సంస్కారం (కఫన్)

మృతుడు గనక పురుషుడైతే అతని శవానికి మూడు వస్త్రాలు చుట్టటం మంచిది. ఆ మూడు వస్త్రాల్లో చొక్కా, తలపాగా ఉండకూడదు. ఒకవేళ చొక్కా, నడుం క్రింద వస్త్రం లేదా ఒకపెద్ద దుప్పటితో చుట్టినా ఫర్వాలేదు.

చనిపోయినది స్త్రీ అయితే ఆమె మృతదేహాన్ని అయిదు వస్త్రాల్లో చుట్టాలి. ఒక విడిగుడ్డ (దిర్ర్), ముఖాచ్ఛాదనం, ఇజార్ మరియు రెండు పెద్ద దుప్పట్లు. చిన్న పిల్లవాడి మృతదేహాన్ని ఒకటి నుంచి మూడు వస్త్రాల్లో చుట్టవచ్చు. అదే చిన్న పిల్ల మృతదేహమైతే ఒక కమీజు, రెండు పొడువాటి దుప్పట్లల్లో చుట్టాలి.

శవసంస్కారం చేసేవారు మృతుడి సంరక్షకులు అనగా తండ్రి, సమీప బంధువులు, తాతలు స్నానం చేయించటానికి ఎక్కువ హక్కు

దారులు. అదే విధంగా మృతురాలికి ఆమె తల్లి, అమ్మమ్మ, నాయనమ్మ, సమీప బంధువులు స్నానం చేయించటానికి ఎక్కువ హక్కుదారులు.

4. భర్త తన భార్య మృతదేహానికి, అలాగే భార్య తన భర్త మృత దేహానికి గుసుల్ చేయించవచ్చు. దైవప్రవక్త(స) అల్లుడుగారైన హజ్రత్ అలీ (రజి) తన భార్య ఫాతిమా(రజి) మృతదేహానికి స్నానం చేయించారు. అబూబక్ర్(రజి) మృతదేహానికి ఆయన భార్య స్నానం చేయించారు.

## మోడల్ ప్రశ్నలు

1) మృతుడికి స్నానం గుసుల్ చేయించే పద్ధతిని వివరించండి?
2) శవానికి వస్త్ర సంస్కారం (కఫన్) గురించి తెల్పండి?

## ఖాళీలు పూరించండి

1) మృతుడు గనక పురుషుడైతే ఆ శవానికి ......... వస్త్రాల్లో చుట్టడం ఉత్తమం.
2) చనిపోయినది స్త్రీ అయితే అమె మృత దేహాన్ని......... వస్త్రాల్లో చుట్టాలి.
3) మృతులకోసం ఉపయోగించే వస్త్రాలు.......... రంగులో ఉండటం ఉత్తమం.
4) శవసంస్కారం చేసేవారు మృతుడి ........ స్నానం చేయించడానికి ఎక్కువ హక్కుదారులు.

https://teluguislam.net

# 47వ పాఠం జనాజా నమాజ్ చేసే విధానం

## జనాజా నమాజ్‌లో నాలుగు తక్బీర్లు పలుకుతారు

1. మొదటి తక్బీర్ తరువాత 'అల్ ఫాతిహా' సూరా పఠించాలి. ఫాతిహా సూరాతోపాటు మరొక సూరా లేదా ఒకటి, రెండు ఖుర్ఆన్ సూక్తులు పఠించటం ఉత్తమం అని ఇబ్నె అబ్బాస్(రజి) ఉల్లేఖించిన హదీసు ద్వారా తెలుస్తోంది.
2. రెండవ తక్బీర్ పలికి దరూద్ పఠించాలి.
3. మూడవ తక్బీర్ పలికి మన్నింపు కొరకు అల్లాహ్‌ను వేడుకోవాలి.

**"అల్లాహుమ్మగ్ ఫిర్లి హయ్యినా వమయ్యితినా వషాహిదినా వ గాయిబినా వ సగీరినా వ కబీరినా వజకరినా వ ఉన్‌సానా. అల్లాహుమ్మ మన్ అహ్‌యైతహూ మిన్నా ఫఅహ్‌యిహీ అలల్ ఇస్లామ్. వమన్ తవఫ్ఫైతహూ మిన్నా ఫతవఫ్ఫహూ అలల్ ఈమాన్. "అల్లాహుమ్మ లా తహ్‌రిమ్‌నా అజ్రహూ వలా తఫ్‌తిన్నా బాదహూ."**

ఓ అల్లాహ్! మాలో బ్రతికి ఉన్నవారినీ, చనిపోయిన వారినీ, ఇక్కడున్న వారినీ, లేనివారినీ, చిన్నలనూ, పెద్దలనూ, స్త్రీలనూ, పురుషులనూ అంద రినీ క్షమించు. ఓ అల్లాహ్! మాలో ఎవరిని సజీవంగా ఉంచినా ఇస్లాం ధర్మంపై ఉంచు. ఎవరికి మరణాన్ని ప్రసాదించినా విశ్వాస స్థితిలోనే ప్రసాదించు. ఈ మరణించిన వ్యక్తి (విషయంలో సహనం వహించటం

https://teluguislam.net

వల్ల లభించే) పుణ్యానికి మమ్మల్ని దూరం చేయకు. ఇతని తరువాత మమ్మల్ని ఉపద్రవాలకు గురిచేయకు.

పై దుఆతో పాటు ఈ క్రింది దుఆ కూడా కలిపి చేయవచ్చు.

**అల్లాహుమ్మగ్ ఫిర్ లహూ వర్‌హమ్‌హు. వ ఆఫిహీ వాఫు అన్‌హు, వ అక్రిమ్ నుజులహూ, వ వస్సీ ముద్‌ఖలహూ, వగ్‌సిల్‌హు బిల్‌మాయి, వస్సల్‌జి వల్‌బరది, వ నఖ్ఖిహీ మినల్ ఖతాయా కమా నఖ్ఖయి తస్సౌబల్ అబ్‌యజ మినద్దనసి, వ అబ్‌దిల్‌హు దారన్ ఖైరన్ మిన్ దారిహీ, వ అహ్‌లన్ ఖైరన్ మిన్ అహ్‌లిహీ, వ జౌజన్ ఖైరన్ మిన్ జౌజిహీ, వ అద్‌ఖిల్‌హుల్ జన్నత వ అయిజ్‌హు మిన్ అజాబిల్ ఖబ్‌రి వ అజాబిన్నారి, వఫ్‌సహ్ లహూ ఫీ ఖబ్‌రిహీ వ నవ్విర్ లహూ ఫీహి. అల్లాహుమ్మ లా తహ్‌రిమ్‌నా అజ్‌రహూ వలా తుజిల్లనా బాదహూ.**

ఓ అల్లాహ్! ఇతన్ని క్షమించు, ఇతని మీద దయచూపు, ఇతన్ని శిక్ష నుండి కాపాడు. ఇతన్ని మన్నించు, ఇతన్ని ఆదరించి మర్యాద చెయ్యి, ఇతని సమాధిని విశాలపరచు, ఇతన్ని నీళ్ళతో, మంచుతో, వడగళ్ళతో కడిగి, తెల్లని వస్త్రాన్ని మురికి లేకుండా శుభ్రం చేసినట్లు పాపాల నుండి ఇతన్ని శుభ్రం చెయ్యి. ఇతనికి ఇహలోకపు ఇల్లు కన్నా మంచి ఇల్లునీ, ఇహలోకపు పరివారం కన్నా ఉత్తమ పరివారాన్ని, ఇహలోకపు ఇల్లాలి కన్నా మంచి ఇల్లాలిని ఇవ్వు. ఇతన్ని స్వర్గంలోకి ప్రవేశింపజెయ్యి. సమాధి శిక్ష నుంచి ఇతన్ని కాపాడు. ఇతని సమాధిని విశాలపరచు. అందులో వెలుగును నింపు. అల్లాహ్! ఇతని (విషయంలో సహనం హించటం వల్ల లభించే) పుణ్యానికి మమ్మల్ని దూరం చేయకు. ఇతని తరువాత మమ్మల్ని అపమార్గానికి గురిచేయకు."

https://teluguislam.net

దైవప్రవక్త(స) వారి సున్నత్ ప్రకారం, మృతుడు పురుషుడైతే ఇమాం అతని తలకు ఎదురుగా ఖిబ్లా వైపు నిలబడి జనాజా నమాజ్ చేయించాలి. స్త్రీ అయితే ఆమె శవపేటికకు మధ్యన నించోవాలి.

ఒకటి కంటే ఎక్కువ మృతదేహాలు ఉన్నప్పుడు పురుషుడి శవాన్ని ఇమామ్ ముందుంచి దాని తరువాత స్త్రీ శవాన్ని ఉంచాలి. ఒకవేళ పిల్లలు ఉన్నట్లయితే మగపిల్లవాడిని స్త్రీ కంటే ముందుంచాలి. ఒకవేళ ఆడపిల్ల మృతదేహం ఉంటే దాన్ని స్త్రీ శవానికి అవతల ఉంచాలి.

జనాజా నమాజులో పాల్గొన్నవారు ఇమామ్ వెనుక నిలబడాలి. ఇమామ్ వెంట ఒక్కడే ఉంటే అతను ఇమాముకు కుడి ప్రక్కన నించోవాలి.

## మోడల్ ప్రశ్నలు

1) జనాజా నమాజ్ చేసే విధానం తెల్పండి?

2) జనాజా నమాజ్‌లో చదివే 'దుఆ' వ్రాయండి?

https://teluguislam.net

## అధ్యాయం - 6

# నిషిద్ధాలు, చేయకూడనివి

https://teluguislam.net

48వ పాఠం

# ఇస్లాంలో నిషిద్ధాలు (ముహర్రమాత్)

దివ్యఖుర్‌ఆన్‌లో, ఇంకా ముహమ్మద్ ప్రవక్త (స)వారి విధానం (సున్నత్) ద్వారా అల్లాహ్ మనకు ఎన్నో చట్టాలు తెలియజేశాడు. వాటిలో కొన్ని విధిగా నెరవేర్చవలసినవి. కాగా; కొన్ని చేయకూడనివి, అంటే వాటిని విధిగా వదలివేయాలన్న మాట. విధిగా చేయవలసినవి ఏవో ఇంతకు ముందే చెప్పటం జరిగింది. ఇకపోతే విధిగా వదలివేయ వలసినవి కూడా ఎన్నో ఉన్నాయి. వాటిలో కొన్ని ముఖ్యమైనవాటిని గురించి ఇక్కడ తెలుసుకుందాం.

## నిషిద్ధ ఆహారాలు:

**మృత మాంసం:** (1) ఇస్లామీయ విధానం ప్రకారంగా జిబహ్ చేయబడకుండా సహజంగా చనిపోయిన జంతువులు, (2) గొంతు పిసికి చంపబడినవి, (3) ఎత్తు నుంచి క్రిందపడి చనిపోయినవి, (4) మరేదైనా క్రూరజంతువు తిని వదిలేయగా (ఇస్లామీయ విధానం ప్రకారం జిబహ్ చేయకముందే) చనిపోయినది, (5) ముస్లింలు, యూదులు, క్రైస్తవులు గాక వేరితరులచే జిబహ్ చేయబడిన జంతుమాంసం.

అయితే మృత సముద్ర జంతువుల మాంసం నిషిద్ధం కాదు. (6) ప్రవహించిన రక్తం నిషిద్ధమే. (7) పందిమాంసం నిషిద్ధం. (8) జంతువును జిబహ్ చేస్తున్నప్పుడు అల్లాహ్ పేరుగాక వేరితుల పేరును ఉచ్చరించినా లేక కేవలం అల్లాహ్ ప్రసన్నత కోసం కాకుండా వేరితరుల ప్రసన్నత కోసం జిబహ్ చేసినా ఆ జంతువు మాంసం నిషిద్ధం అవుతుంది.

https://teluguislam.net

(9) పులి, సింహం, కుక్క లాంటి వేటాడే క్రూర జంతువుల మాంసం, (10) అలాగే గ్రద్ద, రాబందు లాంటి పంజాలతో వేటాడే పక్షుల మాంసం కూడా నిషిద్ధమే. (11) మచ్చిక చేసుకునే (డొమెస్టిక్) గాడిదల మాంసం నిషిద్ధం. (12) మాలిన్యాలు తినే జంతువుల మాంసం. ఒకవేళ వాటిని మాలిన్యానికి దూరంగా ఉంచి సముచిత కాలం వరకు శుద్ధమైన మేత తినిపిస్తే అప్పుడు వాటి మాంసం నిషిద్ధం కాదు. (13) మలినమైన ఆహారాన్ని నీటితో శుభ్రపరచటం వీలైన పక్షంలో దానిని శుభ్రపరచనంత వరకు నిషిద్ధంగానే భావించబడుతుంది. (14) మద్యం, ఇతర అన్ని రకాల మత్తు పదార్థాలు నిషిద్ధం. (15) ఆరోగ్యానికి హాని కలిగించే ఆహార పదార్థాలు నిషిద్ధం.

## నిషిద్ధ పనులు

ఈ క్రింద పేర్కొనబడిన కార్యాలను, వాటికి పాల్పడేవారిని అల్లాహ్ అసహ్యించుకుంటాడు. వారిని శిక్షిస్తాడు.

- ఆరాధనలో అల్లాహ్‌తోపాటు వేరొకరిని లేక వేరొక వస్తువును భాగస్వామిగా చేయటం.
- తల్లిదండ్రుల పట్ల అవిధేయతకు పాల్పడటం
- అబద్ధపు సాక్ష్యం చెప్పటం
- అల్లాహ్ నిషిద్ధం చేసిన ప్రాణిని అన్యాయంగా చంపటం
- వ్యభిచారం, అక్రమ లైంగిక సంబంధాలు
- దొంగతనం
- అనాధ సొమ్ములో నుంచి ఏదైనా వస్తువు అక్రమంగా కాజేయటం

https://teluguislam.net

- అల్లాహ్ విరోధులతో యుద్ధం జరిగినప్పుడు వెన్నుచూపి పారి పోవటం
- అమాయకులు, సౌశీల్యవతులైన విశ్వాస స్త్రీలపైన అభాండాలు వేయటం
- దేహంలోని కప్పివుంచవలసిన భాగాన్ని ఇతరుల ముందు బయల్ప రచటం (పురుషులు నాభి నుంచి మోకాళ్ళ వరకు భాగాన్ని కప్పి వుంచటం, స్త్రీలు అరచేతులు, ముఖం తప్ప మిగతా శరీర భాగాన్ని కప్పివుంచటం విధి).
- లంచం, దోపిడి, మోసం, వంచనతో పరుల సొమ్మును కబళిం చటం
- లంచం ఇచ్చి ఇతరుల సంపదను చట్టవిరుద్ధంగా కబళించటం, తమకు చెందని హక్కును కొల్లగొట్టటం
- తల్లిని, కూతురిని, సోదరిని, మేనత్తను, తల్లి సోదరిని, సోదరుని కుమార్తెను, సోదరి కుమార్తెను, పాలిచ్చిన తల్లిని, పాల వరుస అక్కా చెల్లెళ్ళను, భార్య తల్లిని, భార్య కూతురిని, సొంత కొడలిని వివాహం చేసుకోరాదు. ఏకకాలంలో ఇద్దరు అక్కాచెల్లెళ్ళను కలిపి భార్యలుగా చేసుకోవటం కూడా నిషిద్ధమే.
- ముస్లిమేతర స్త్రీలు విశ్వసించి ముస్లింలు కానంత వరకు వారిని వివాహమాడటం నిషిద్ధం. అయితే క్రైస్తవ లేక యూద స్త్రీని వివాహమాడవచ్చు.

**గమనిక:** క్రైస్తవ లేక యూద స్త్రీలను వివాహమాడటానికి ఇస్లాంలో అనుమతి ఉంది. అయితే ఇటువంటి వివాహాల

https://teluguislam.net

వల్ల ఎన్నో దుష్ ప్రభావాలు కూడా లేకపోలేదు. ఖుర్ఆన్‌లో ఈ అనుమతి ఇచ్చిన చోటే సౌశీల్యవతులైన స్త్రీలను వివాహ మాడమని అల్లాహ్ ప్రబోధించాడు. ఏ స్త్రీని వివాహం చేసుకో వటం వల్ల విశ్వాసం (ఈమాన్) ప్రమాదంలో పడే అవకాశం ఉందో అలాంటి స్త్రీల వలలో పడకుండా ఉండటంలోనే మేలుంది. ఈ మధ్య కాలంలో గ్రంథవహుల స్త్రీలను వివాహం చేసుకున్న చాలామంది ముస్లింల విశ్వాసం డోలాయమాన స్థితిలో ఉంది. వారి ద్వారా కలిగే సంతానం కూడా సగం ఇస్లాం, సగం ఇస్లామేతర భావాలు కలిగివుండటానికి ఎక్కువ ఆస్కారం ఉంటుంది. ధర్మసమ్మతమైన ఒక పని కోసం విధి అయినటువంటి 'విశ్వాసం' (ఈమాన్)ను ప్రమాదంలో పడవేయటం వివేకం కాదు కదా! అందుకే ఉమర్ (రజి) ఇటువంటి వివాహాలను అస్సలు ఇష్టపడేవారు కాదు.

- ముస్లిమేతర పురుషులు వారు యూదులైనా, క్రైస్తవులైనా ఎవరైనా సరే విశ్వసించి ముస్లింలు కానంత వరకూ ముస్లిం స్త్రీలు వారిని వివాహమాడరాదు.

## మోడల్ ప్రశ్నలు

1) ఇస్లాంలో నిషిద్ధ ఆహారాలు ఏవి?
2) ఇస్లాంలో నిషిద్ధ కార్యాలు ఏవి?
3) గ్రంథవహులను వివాహమాడటం వల్ల లాభనష్టాలు ఏమిటి?

https://teluguislam.net

అధ్యాయం - 7

# స్త్రీలకు ప్రత్యేకం

https://teluguislam.net

49వ పాఠం

# బహిష్టు, పురిటి రక్తస్రావం

## బహిష్టుకు, అధిక స్రావానికి (ఇస్తిహాజాకు) మధ్య భేదాలు

| బహిష్టు రక్త స్రావం (హైజ్) | ఇస్తిహాజా రక్తం |
|---|---|
| 1) బహిష్టు (హైజ్): స్త్రీలకు ప్రతి నెలా జరిగే రక్తస్రావాన్ని "హైజ్" (బహిష్టు) అంటారు. | 1) స్త్రీకి బహిష్టు కాలం తర్వాత కూడా స్రవిస్తూ ఉండే రక్తాన్ని 'ఇస్తిహాజా' అని అంటారు. |
| 2) బహిష్టు రక్తం గర్భం నుంచి వెలువడుతుంది. | 2) ఇస్తిహాజా రక్తం అనారోగ్యం వల్ల నరాలనుంచి స్రవిస్తుంది. |
| 3) బహిష్టు (హైజ్) రక్తం నల్లగా, చిక్కగా ఎరుపు రంగు ఆవరించినట్లుగా ఉంటుందని దైవప్రవక్త (స) సూచించారు. (దారెఖుత్నీ) | 3) ఇస్తిహాజా రక్తం ముక్కు నుంచి కారే రక్తం లాగా పలుచగా పసుపు రంగు ఆవరించి ఉంటుంది. |
| 4) బహిష్టు రక్తం చిక్కగానే కాకుండా ఒక్కోసారి గడ్డలుగా కూడా వెలువడుతుంది. | 4) పలచగా ఉండే ఈ రక్తం మామూలు గాయాల నుంచి స్రవించినట్లు వేగంగా స్రవిస్తుంది. |
| 5) బహిష్టు రక్తంలో కుళ్ళిన దుర్వాసన ఉంటుంది. | 5) ఇస్తిహాజా రక్తంలో సాధారణ రక్తపు వాసనే ఉంటుంది. |

https://teluguislam.net

**ప్రశ్న: స్త్రీకి బహిష్టు రక్తం ఏ వయసులో మొదలవుతుంది? ఏ వయసులో బహిష్టు ఆగిపోతుంది?**

**జ)** కనీసం తొమ్మిదేండ్ల వయసు నుంచి అమ్మాయిలు రజస్వల అవుతారు. అప్పటి నుంచే బహిష్టు రక్తం మొదలవుతుంది. ఒకవేళ అంతకుముందే స్త్రీ మర్మాంగం నుంచి రక్తస్రావం జరిగితే అది 'ఇస్తిహాజా' రక్తం అయి ఉంటుంది. బహిష్టు ఆగిపోయే నిర్ణీత వయసు అంటూ ఏమీ లేదు.

**ప్రశ్న: బహిష్టు దినాల కనీస గడువు ఎంత?**

**జ)** ఒకరాత్రి, ఒక పగలు (24 గంటలు). అంతకన్నా తక్కువ సమయం రక్తం స్రవిస్తే 'ఇస్తిహాజా' రక్తం అవుతుంది.

**ప్రశ్న: బహిష్టు దినాల గరిష్ట గడువు ఎంత?**

**జ)** పదిహేను రోజులు. ఒకవేళ రక్తస్రావం అప్పటికీ ఆగకపోతే అనారోగ్యానికి ఆనవాలు. దాన్ని ఇస్తిహాజా రక్తంగా పరిగణించ వలసి ఉంటుంది.

**ప్రశ్న: రెండు బహిష్టులకు మధ్య కనీస పరిశుద్ధ వ్యవధి ఎంత?**

**జ)** కనీసం 13 రోజులు. ఒకవేళ ఈ వ్యవధి పూర్తికాకముందే బహిష్టు రక్తం కనిపిస్తే అది అనారోగ్య లక్షణం. దాన్ని ఇస్తిహాజా రక్తంగా భావించాల్సి ఉంటుంది.

**ప్రశ్న: సాధారణంగా ఎక్కువ మంది స్త్రీలలో బహిష్టు గడువు ఎంత?**

**జ)** 7 నుంచి 9 రోజులు.

**ప్రశ్న: బహిష్టులో స్త్రీ ఖుర్ఆన్ వ్యాఖ్యానం ఉన్న పుస్తకాలు చదవటానికి, తనకు జ్ఞాపకంవున్న ఖుర్ఆన్ వాక్యాలను పఠించటానికి అనుమతి ఉందా?**

https://teluguislam.net

**జ:** ఇస్లామీయ విద్వాంసుల అత్యంత దృఢమైన అభిప్రాయం ప్రకారం బహిష్టు లేక పురిటి రక్తస్రావానికి లోనై వున్న స్త్రీ ముస్‌హఫ్ (అసలు ఖుర్‌ఆన్ ప్రతిని) ముట్టుకోకుండా ఖుర్‌ఆన్ వ్యాఖ్యానం రాసివున్న పుస్తకాలను చదవటంలో, జ్ఞాపకం వున్న ఖుర్‌ఆన్ ఆయతులను పఠించటంలో ఎలాంటి తప్పు లేదు.

**ప్ర: సాధారణంగా స్త్రీలలో పరిశుద్ధతా గడువు ఎంత?**

**జ)** 23 లేక 24 రోజులు

**ప్ర: గర్భవతిగా ఉన్నప్పుడు రక్తం స్రవిస్తే?**

**జ)** స్త్రీలు గర్భవతులుగా ఉన్న కాలంలో ఎరుపు రంగులోగానీ, పసుపు పచ్చ రంగులోగానీ నీరు కనిపిస్తే అది 'ఇస్తెహాజా'గా పరిగణించబడుతుంది.

**ప్ర: బహిష్టు స్థితిలో ఉన్న స్త్రీ తాను పరిశుద్ధత పొందానన్న దానికి గుర్తు ఏమిటి?**

**జ)** పరిశుద్ధత పొందటానికి గుర్తు ఈ క్రింది రెండు విధానాలలో ఒకటి:

1) అత్యధికమంది బహిష్టు స్త్రీలకు బహిష్టు ఆగిపోగానే తెల్ల తీగ కనిపిస్తుంది.

2) కొంతమందికి తెల్ల తీగ కనిపించదు. కాని పలుచని ఎరుపు (గోధుమ)రంగు లేక పసుపు తెలుపు కలగలసిన నీరు కనిపించి తడి ఆరిపోతుంది. ఇవీ పరిశుద్ధతకు గుర్తులు.

**ప్ర: పరిశుద్ధావస్థలో స్త్రీ మర్మాంగం నుండి ఊరే ద్రవాల గురించి షరీయత్ ఆదేశం ఏమిటి?**

**జ)** పల్చగా లేక తెల్లరంగులో జిగటుగా స్రవిస్తే పరిశుద్ధంగా భావించ బడుతుంది. కాగా; రక్తం మరియు బ్రౌన్ లేక పసుపు రంగులో స్రవిస్తే అది అపరిశుద్ధంగా భావించబడుతుంది. ఏమైనప్పటికీ ఈ రెండు రకాలు వుజూని భంగపరుస్తాయి. ఈ లక్షణాలున్నవారు ఇస్తిహాజా స్థితికి లోనైనట్టు పరిగణించాలి.

ప్ర: **మర్మాంగం నుండి బ్రౌన్ లేక పసుపు రంగు నీరు స్రవించే స్త్రీలకు షరీయతు ఆదేశం ఏమిటి?**

**జ)** ఒకవేళ అటువంటి నీరు బహిష్టుకు ముందుగానీ, బహిష్టు తరు వాత గానీ కంటిన్యూ అయినట్లయితే దానిని బహిష్టుగానే లెక్కిం చాలి. ఒకవేళ ఈ నీరు బహిష్టు కాలంలో కాకుండా వేరే రోజులలో కనబడితే దానిని ఇస్తిహాజాగా భావించాలి.

ప్ర: **ఒక స్త్రీకు సాధారణ బహిష్టు వ్యవధి కన్నా ముందుగానో లేక ఆలస్యంగానో స్రవిస్తే?**

**జ)** వెనుకటి బహిష్టు నుండి కనీసం 13 రోజులు గడిచిన తర్వాత, ఏ సమయంలో బహిష్టు లక్షణాలు కనిపించినా దానిని బహిష్టు గానే భావించాలి.

ప్ర: **బహిష్టు కాలం సాధారణంగా ఉండే కన్నా ఎక్కువ లేక తక్కువ రోజులు ఉంటే ఏం చేయాలి?**

**జ)** అది బహిష్టుకాలంగానే భావించబడుతుంది. అది బహిష్టు యొక్క గరిష్ట కాల పరిమితిని అనగా 15 రోజులు దాటనంత వరకూ.

ప్ర: **ఒక స్త్రీకి సుదీర్ఘ కాలం వరకు రక్తస్రావం జరుగుతుంటే ఏం చేయాలి? ఉదా: ఒక నెల లేక అంతకన్నా ఎక్కువ కాలం బ్లీడింగ్ అవుతుంటే షరీయత్ దృష్ట్యా ఏం చేయాలి?**

https://teluguislam.net

**జ)** దాని స్వరూప స్వభావాలు నాలుగు విధాలుగా ఉంటాయి:

1) ఒక స్త్రీ తనకు నెలవారీ ఎప్పుడు మొదలవుతుంది? ఎన్ని రోజులు బహిష్టు రక్తం స్రవిస్తుంది? అనే విషయం తెలిసి వుంటే ఆమె ఆ లెక్కన బహిష్టు రక్తానికి–వేరితర రక్తస్రావానికి మధ్య భేదం గుర్తించ గలుగుతుంది. ఆ విధంగా ఆమె తన నెలవారీ దినాలను కనుక్కోవాలి.

2) ఒకామెకు తన బహిష్టు దినాల సంఖ్య తెలుసు. కాని బహిష్టు కాలంలోని రక్తంలో – ఇతర దినాల రక్తంలో తేడా కనిపించదు. అలాంటి స్థితిలో ఆమె తన నెలవారీ సమయాన్నీ, దినాలను కౌంట్ చేసుకుని తన బహిష్టు కాలాన్ని నిర్ధారించుకోవాలి.

3) ఒకామెకు బహిష్టు మొదలయ్యే సమయం తెలుసుగానీ బహిష్టు దినాలెన్ని? అనేది ఇదమిత్థంగా తెలీదు. అప్పుడేం చేయాలి? అన్నది ప్రశ్న. అలాంటప్పుడు ఆమె సాధారణ స్త్రీల మాదిరిగా ఆరు లేక ఏడు దినాలను బహిష్టు గడువుగా లెక్కించుకోవాలి.

4) తనకు ఎన్ని రోజులు బహిష్టు రక్తం పోతుందో తెలుసుగానీ బహిష్టు ఎప్పుడు మొదలైందో ఒకామెకు తెలీదు. అలాంటి స్త్రీ ప్రతి నెలా చంద్రమానం ప్రకారం మొదటి నుంచీ తెలిసిన దినాలను బట్టి బహిష్టు దినాల లెక్క కట్టుకోవాలి.

## గమనికలు:

1) **ఇస్తిహాజా :** గర్భసంచి దిగువ భాగాన ఉండే 'ఆజిల్' అనే నరం నుండి ఒకానొక వ్యాధి కారణంగా స్రవించే రక్తమిది. బహిష్టు రక్తానికి – ఇస్తిహాజా రక్తానికి మధ్యగల వ్యత్యాసం ఏమిటంటే; 1) బహిష్టు రక్తం ముదురు ఎరుపు రంగులో చిక్కగా నలుపు

https://teluguislam.net

ఆవరించి ఉంటుంది. ఇస్తిహాజా రక్తం మాత్రం లేత ఎరుపు రంగులో పల్చగా ఉంటుంది.

2) బహిష్టు రక్తం చిక్కగా ఉంటుంది – ఒక్కోసారి ఈ బహిష్టు రక్తంతో పాటు గడ్డకట్టిన నెత్తురు కూడా పుడుతుంది. కాగా; ఇస్తిహాజా రక్తం చాలా పల్చగా ఉంటుంది.

3) బహిష్టు రక్తంలో దుర్వాసన కూడా ఉంటుంది. కాని ఇస్తిహాజా రక్తంలో ఈ లక్షణం ఉండదు. బహిష్టు ఆదేశం : హదసె అక్బర్ (పెద్ద తరహా అశుద్ధావస్థ)కు గురైన వారికి ఏ ఏ పనులు అధర్మం (హరామ్) చేయబడ్డాయో అవన్నీ బహిష్టు స్త్రీకి కూడా అధర్మం చేయబడ్డాయి. ఉదాహరణకు: నమాజ్ చేయటం, మస్జిద్‌లో ఆగటం, ఖుర్‌ఆన్ ప్రతిని ముట్టుకోవటం, ఉపవాసాలు పాటించటం – ఇత్యాదివి.

**గమనిక:** ఈ స్థితిలో కూడా స్త్రీ "అసలు ఖుర్‌ఆన్ ప్రతి" (ముస్‌హఫ్)ను ముట్టుకోకుండా ఖుర్‌ఆన్ వ్యాఖ్యానం రాసివున్న పుస్తకాలను చదవటంలో, జ్ఞాపకం వున్న ఖుర్‌ఆన్ ఆయతులను పఠించటంలో ఎలాంటి తప్పు లేదు.

2) **ఎరుపు నీరు:** స్త్రీ మర్మాగం నుంచి స్రవించే ఎరుపు. ఇది సాధారణంగా బ్రౌన్ కలర్‌లో ఉంటుంది.

3) **పసుపు పచ్చని నీరు:** ఇది కూడా ఇస్తిహాజా కోవకు చెందిన రక్తస్రావమే. ఇందులో పసుపు దనం ఎక్కువగా ఉంటుంది.

4) **తెల్లని పదార్థం:** బహిష్టు ఆగి, పరిశుద్ధత మొదలయిందన్న దానికి సంకేతంగా కనిపించే తెల్లని ద్రవపదార్థం. ఈ పదార్థం అశుద్ధమైనది కాదుగానీ ఇది వెలువడినపుడు వుజూ భంగమవుతుంది.

https://teluguislam.net

# నిఫాస్ (పురిటి రక్తస్రావం)

ప్ర: **స్త్రీకి కాన్పు అయినప్పటికీ రక్తం స్రవించకపోతే?**

జ) ఆమెకు 'నిఫాస్' (పురిటి రక్తస్రావపు) ఆదేశాలు వర్తించవు. ఆమె స్నానం చేయటం కూడా తప్పనిసరి కాదు. ఒకవేళ ఆమె ఆ సమయంలో ఉపవాసం ఉంటే ఉపవాసం కూడా భంగమవదు.

ప్ర: **ఒక స్త్రీకి ప్రసవ లక్షణాలు గోచరిస్తే షరీయతు పరంగా ఏ ఆదేశాలు వర్తిస్తాయి?**

జ) ప్రసవానికి కొంతసేపు క్రితం వరకూ పురిటి నొప్పులతో కనిపించిన ఎరుపు ఇస్తిహాజాగానే పరిగణించబడుతుంది. దానికి 'నిఫాస్' ఆదేశం వర్తించదు.

ప్ర: **కాన్పు సమయంలో స్రవించిన రక్తం గురించి షరీయత్ ఆదేశం ఏమిటి?**

జ) ఇది నిఫాస్ (పురిటి రక్తస్రావం) గానే లెక్కించబడుతుంది. శిశువు పూర్తిగా బయటపడినా పడకపోయినా ఆ సందర్భంగా నాగా అయిన నమాజులను ఆమె ఖజా చేసుకోవటం తప్పనిసరి (వాజిబ్) కాదు.

ప్ర: **నిఫాస్ దినాలు ఎప్పటి నుంచి మొదలువుతాయి?**

జ) తల్లి కడుపు నుంచి శిశువు పూర్తిగా బయటపడిన క్షణం నుంచి నిఫాస్ వ్యవధి మొదలవుతుంది.

ప్ర: **'నిఫాస్' (పురిటి దినాల) కనీస గడువు ఎంత?**

జ) కనీస గడువు ఎంత? అనే దానికి ఒక హద్దంటూ లేదు. కాన్పు అయిన కొద్దిసేపటికే రక్తస్రావం ఆగిపోయినట్లయితే ఆమె స్నానం

చేసి నమాజ్ చేయటం మొదలెట్టాలి. నలభై రోజుల వరకూ ఆగవలసిన అవసరం లేదు.

ప్ర: **'నిఫాస్' గరిష్టకాలం ఎంత?**

**జ)** నలభై రోజులు. ఒకవేళ నలభై రోజుల తర్వాత కూడా ఎరుపు కనిపిస్తే, దాన్ని పట్టించుకోకుండా స్నానం చేసి నమాజ్ చేసుకోవటం వాజిబ్ (తప్పనిసరి).

అయితే కొంతమంది స్త్రీలకు 40 రోజుల తర్వాత మరో స్థితి కూడా ఎదురు కావచ్చు. గర్భవతి కాకముందు తమకు సాధారణంగా కొన్ని ప్రత్యేక రోజుల్లో బహిష్టు వస్తూ వుంటుంది. ఒకవేళ 40 రోజుల పురిటి రక్తస్రావం తర్వాత వారి ఆ సాధారణ బహిష్టు రోజులు మొదలై, అప్పుడు రక్తం కనిపిస్తే మాత్రం దానిని బహిష్టుగానే పరిగణించవలసి ఉంటుంది.

ప్ర: **ఒకే కాన్పులో ఇద్దరు లేక అంతకన్నా ఎక్కువమంది పిల్లలుపుడితే?**

**జ)** మొదటి శిశువును కన్న క్షణం నుంచే నిఫాస్ వ్యవధి మొదలవుతుంది.

ప్ర: **ప్రీ మెచ్యూర్ డెలివరీగానీ, అబార్షన్‌గానీ జరిగితే?**

**జ)** గర్భధారణ జరిగి 80 రోజులు లేక అంతకన్నా తక్కువ ఉంటే ఆ రక్తం 'ఇస్తిహాజా'గా భావించబడుతుంది. ఒకవేళ 90 రోజులు అయివుంటే అది నిఫాస్ (పురిటిరక్త స్రావం) గా లెక్కించబడుతుంది. ఒకవేళ 80-90 రోజుల మధ్యలో గర్భస్రావం జరిగితే శిశువు మానవాకారాన్ని సంతరించుకుందో లేదో గమనించాలి. మానవాకారం సంతరించుకుని ఉంటే అది నిఫాస్ (పురిటిరక్త స్రావం)గా పరిగణించాలి. లేకుంటే 'ఇస్తిహాజా' రక్తంగా లెక్కించాలి.

https://teluguislam.net

**ప్ర: ప్రసవించిన స్త్రీ 40 రోజులు గడవకముందే పరిశుద్ధురాలై, నలభై రోజులు దాటకముందే మళ్లీ రక్తం స్రవిస్తే....?**

**జ)** 40 రోజుల గడువుకు ముందే ఎప్పుడు పరిశుద్ధురాలైనా ఆమె పరిశుద్ధురాలిగానే భావించబడుతుంది. వెంటనే స్నానం చేసి నమాజ్ చేయటం మొదలెట్టాలి. ఈ గడువులోగా మళ్ళీ రక్తస్రావం జరిగితే గడువు ముగిసే వరకూ నిఫాస్ ఆజ్ఞలు వర్తిస్తాయి.

## గమనార్హమైన కొన్ని ముఖ్యాంశాలు

- హదసె అక్బర్ (పెద్దతరహా అశుద్ధత)కు లోనైన వ్యక్తిపై ఏ ఏ పనులు నిషేధించబడతాయో అవన్నీ బహిష్టు స్త్రీకి, కాన్పు అయిన స్త్రీకి కూడా నిషేధించబడతాయి.

**గమనిక:** ఈ స్థితిలో కూడా స్త్రీ "అసలు ఖుర్ఆన్ ప్రతి" (ముస్హఫ్)ను ముట్టుకోకుండా ఖుర్ఆన్ వ్యాఖ్యానం రాసివున్న పుస్తకాలను చదవటంలో, జ్ఞాపకంవున్న ఖుర్ఆన్ ఆయతులను పఠించటంలో ఎలాంటి తప్పులేదు.

- ఇస్తిహాజా జబ్బుకు గురైన స్త్రీ నమాజ్‌ను వదలిపెట్టకూడదు. అయితే ఆమె ప్రతి నమాజుకు ముందు తప్పకుండా వుజూ చేసుకోవాలి.
- బహిష్టు స్త్రీగానీ, ప్రసవించిన స్త్రీగానీ సూర్యాస్తమయానికి ముందే 'పరిశుద్ధత'ను పొందితే ఆ రోజు జుహ్ర్, అస్ర్ నమాజులు ఖజా చేసుకోవటం తప్పనిసరి (వాజిబ్). ఒకవేళ తెల్లవారకముందే పరిశుద్ధత పొందితే ఆ రాత్రిలోని మగ్రిబ్, ఇషా నమాజులను ఖజా చేసుకోవలసి ఉంటుంది.
- ఏ స్త్రీకయినా నమాజు వేళ అయినపుడు ఆమెకు బహిష్టు అవటంగానీ, కాన్పు అవటంగానీ జరిగితే ఆ నమాజును ఆమె ఖజా చేసుకోవలసిన అవసరం లేదు.
- హైజ్ (బహిష్టు) స్థితి నుండి, నిఫాస్ (పురిటి) స్థితి నుంచి పరిశుద్ధత


https://teluguislam.net

పొందిన మీదట స్త్రీ స్నానం చేస్తున్నప్పుడు కురులు (జడ) పూర్తిగా విప్పాలి. అయితే రతిక్రీడ తరువాత లైంగిక అశుద్ధావస్థను తొలగించటానికి స్నానం చేసేటప్పుడు కొప్పు లేక జడను విప్పటం తప్పనిసరి కాదు.


- బహిష్టు (హైజ్) స్థితికి, పురిటి (నిఫాస్) స్థితికి లోనై వున్న స్త్రీతో సంభోగించకూడదు. ఒక్క సంభోగం తప్ప మిగిలినవన్నీ సమ్మతమే.
- 'ఇస్తిహాజా' స్థితికి లోనైన స్త్రీతో సంభోగించటంలో తప్పులేదు గాని నిగ్రహం పాటించటం మంచిది. ఒకవేళ భర్త నిగ్రహించుకోలేనపుడు ఆ దంపతులు నిస్సంకోచంగా రతిక్రీడలో పాల్గొనవచ్చు.
- 'ఇస్తిహాజా' జబ్బుకు గురైన స్త్రీ ప్రతి నమాజుకు ముందు స్నానం చేయగలిగితే ఉత్తమం. ఒకవేళ అది సాధ్యం కాకపోతే జుహ్ర్–అస్ర్ నమాజులకై ఒకసారి స్నానం, మగ్రిబ్–ఇషా నమాజులకై ఒకసారి స్నానం చేసి, ఫజ్ర్ నమాజుకు ముందు ఒకసారి స్నానం చేయాలి. ఈ విధంగా 24 గంటలలో ఐదు పూటల నమాజులకుగాను మూడుసార్లు స్నానం చేసినట్లవుతుంది. ఒకవేళ దీన్ని కూడా ఓర్చుకోలేకపోతే రోజుకు ఒక్కసారైనా స్నానం తప్పక చేయాలి. అయితే ప్రతి నమాజుకు ముందు తప్పకుండా వుజూ చేసుకుంటూ ఉండాలి.
- హజ్–ఉమ్రా క్రియలను పూర్తి చేసుకునే ఉద్దేశ్యంతోగానీ, రమజాన్ ఉపవాసాలను పూర్తి చేసుకునే మంచి ఉద్దేశ్యంతోగానీ తాత్కాలికంగా బహిష్టు స్థితిని కొన్ని రోజులు వాయిదా వేసుకునేందుకు డాక్టర్ సలహాతో మాత్రలు వేసుకోవటం సమ్మతమే. అయితే ఆ మాత్రలతో స్త్రీ ఆరోగ్యానికి హాని జరిగే ప్రమాదం వున్న పక్షంలో మాత్రం అందుకు అనుమతి ఉండదు.

https://teluguislam.net

# సున్నత్ ప్రకారంగా వుజూ విధానం




చేతులు మణికట్టు వరకు 3 సార్లు కడుక్కోవాలి.




వేళ్ళల్లోకి వేళ్ళను చొప్పించి శుభ్రంగా చేతులను కడుక్కోవాలి




నోటిలోకి నీరు తీసుకుని 3 సార్లు పుక్కిలించాలి




కుడి చేత్తో ముక్కులోకి నీరు ఎక్కించి ఎడమ చేత్తో ముక్కును చీదాలి.




ముఖమంతా 3 సార్లు శుభ్రంగా కడుక్కోవాలి.




రెండు చేతులను మోచెయ్యి వరకు 3 సార్లు కడగాలి.




తల మొదటి భాగం నుండి చివరి వరకు తడిచేతులతో ఇలా తుడుచుకోవాలి.




తల చివరి భాగం నుండి మళ్ళీ మొదటికి తడిచేతులతో తుడుచుకోవాలి.

https://teluguislam.net




చూపుడు వేళ్ళతో చెవుల లోపలి భాగాలను, బొటన వేళ్ళతో బయటి భాగాన్ని తుడవాలి.




కుడి, తరువాత ఎడమ పాదాన్ని చీలమండ వరకు 3 సార్లు కడగాలి.





వేళ్ళ మధ్యల్లోకి ఎడమ చేతి చిటికిన వేలును పోనిచ్చి శుభ్రపరచుకోవాలి.

# సున్నత్ ప్రకారంగా నమాజ్ విధానం





చేతులు ఇలా భుజాల వరకు పైకెత్తి 'అల్లాహు అక్బర్' అని చెప్పాలి.





ఎడమ చేతిని కుడిచేత్తో ఛాతీ మీద ఇలా కట్టుకోవాలి.





రుకూలో వీపు ఇలా సమాంతరంగా ఉంచి తిన్నగా నేలవైపు చూస్తుండాలి.




అరచేతులతో మోకాళ్ళను అదిమి పట్టుకోవాలి. వేళ్ళను వదులుగా వుంచాలి.





సజ్దా ఇలా విశాలంగా చేయాలి.





ఖాయిదాలో కుడి పాదమును నిలబెట్టి ఎడమ పాదంపై ఇలా కూర్చోవాలి.




రెండు సజ్దాల మధ్య కనీసం ఒకసారి 'రబ్బిగ్ ఫిర్‌లీ' అని పలకాలి.




చివరి తషహ్హుద్‌లో ఇలా ఎడమ పాదమును కుడి కాలి క్రింద నుంచి వెలుపలికి తీసికూర్చోవాలి.




చివరి తషహ్హుద్‌లో బొటనవ్రేలు మధ్య వేలితో రింగ్‌లాగా చేసుకుని చూపుడు వేలిని పైకి కిందికి కదిలిస్తూ ఉండాలి

https://teluguislam.net

## విన్నపం

ఈ పుస్తకంపై మీ సలహాలు, సూచనలను ఈ క్రింద తెలుపబడిన చిరునామాకు లేదా ఈ-మెయిల్‌కు పంపించ మనవి. మీ అమూల్యమైన సలహాలను మలి ముద్రణలో పరిగణనలోకి తీసుకోవటం జరుగుతుంది.

**హాఫిజ్ ఎస్.ఎం. రసూల్ షర్ఫీ**

*అక్బర్‌బాగ్, సయీదాబాద్, హైదరాబాద్- 59. సెల్ :*

***9676144697***

*E-mail: shantimargam@gmail.com*

## శ్రేయోభిలాషులకు మనవి

ఈ పుస్తకాన్ని కనీసం 500 కాపీలు లేదా 1000, 1500, 2000 ఇలా ఎన్ని కాపీలైనా ముద్రించి దైవమార్గంలో ఉచితంగా పంచిపెట్టాలని కోరుతున్న శ్రేయోభిలాషులు వివరాల కోసం ***"శాంతి మార్గం పబ్లికేషన్ ట్రస్టు"*** హైదరాబాద్ వారిని సంప్రదించగలరు.

సెల్ : ***9676144697***

*E-mail: shantimargam@gmail.com*

https://teluguislam.net